


ESTD: 1999

www.voodayam.com

# వుదయం




వరంగల్ | 30-05-2026 శనివారం | సంపుటి : 11 | సంచిక : 340 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on

## పేదలు సంతృప్తి చెందేలా

# ఇళ్ల డిజైన్

**ముఖ్యమంత్రి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం**

**భవిష్యత్ తరాలకు అనుకూలంగా డ్రైనేజీ వ్యవస్థ, వాణిజ్య అవసరాలు**

**రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో**

**పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, మే 29 (వుదయం ప్రతినిధి) :** పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు.

మిగతా 2లో

## నీట్ తరహా పేపర్ లీక్‌లపై వివరణ కోరిన

# సుప్రీం



**ప్రధాని మోడీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు**

**సుప్రీంకోర్టుకు తెలిపిన సొలిసిటర్ జనరల్**

**జూన్ 21న పునఃపరీక్ష నిర్వహించడానికి ఏర్పాట్లు**

* యువత నిరాశ చెందకూడదు, ఇంతటి భావోద్వేగాలు, సమయం వెచ్చించిన తర్వాత ఇలా జరగడం చాలా బాధాకరం అని సుప్రీం కోర్టు పేర్కొంది. పరీక్షల నిర్వహణలో యూపీఎస్సీని కూడా కోర్టు ఉదాహరణగా ఉదహరించింది. అధికార కమిటీ ఉన్నప్పటికీ ఈ సంఘటన జరిగితే, అసలు సిఫార్సులోనే లోపం ఉంది లేదా సరైన అమలు లేదా అని జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. ఇటువంటి సంఘటన సంభవిస్తే, అది విద్యార్థులకు మాత్రమే కాకుండా, వారి కుటుంబాలకు, అందరికీ కూడా నిజంగానే అత్యంత తీవ్రమైన మానసిక వేదనను కలిగిస్తుంది. వారు దీనిపై ఎంతో భావోద్వేగాన్ని వెచ్చిస్తారు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**న్యూఢిల్లీ, మే 29 (వుదయం) :** ప్రశ్నపత్రం లీక్ అయిన నేపథ్యంలో, నీట్-యూజీ రద్దు ప్రక్రియను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని శుక్రవారం సుప్రీం కోర్టుకు సొలిసిటర్ జనరల్ వెల్లడించారు. ఈ లీక్ దర్యాప్తు ప్రక్రియ, ముగింపు ఎలా, ఏ రీతిలో జరుగుతుందో వివరిస్తూ ప్రభుత్వం నుండి సమాధానం కోరిన నేపథ్యంలో, అఫిడవిట్ రూపంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విషయాన్ని సమర్పించారు. లైవ్ లా కథనం ప్రకారం, ప్రధానమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు, అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు . విచారణ సందర్భంగా, అమలు తీరుపై ఎంతమేర పర్యవేక్షణ జరిగింది, అలాగే లీకేజీకి గల కారణం ఏమిటని జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ కేంద్రాన్ని ప్రశ్నించారు. యువత ఈ విధంగా నిరాశ చెందకూడదని, ఇంతటి భావోద్వేగాలు, సమయం వెచ్చించిన తర్వాత ఇలా జరగడం చాలా బాధాకరం అని కోర్టు పేర్కొంది. పరీక్షల నిర్వహణలో యూపీఎస్సీని కూడా కోర్టు ఉదాహరణగా ఉదహరించింది. అధికార కమిటీ ఉన్నప్పటికీ ఈ సంఘటన జరిగితే,

మిగతా 2లో

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై

# సుప్రీంలో విచారణ

**గత విచారణలో కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని కోర్టు దృష్టికి**

**అజారుద్దీన్ తరపు న్యాయవాది**

**మంత్రివర్గ నిర్ణయం ప్రకారం జరిగిన దానికి గవర్నర్ ఏం చేస్తారు**

**ప్రశ్నించిన ధర్మాసనం**



**న్యూఢిల్లీ, మే 29 (వుదయం బ్యూరో) :** తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై అమీర్ అలీఖాన్, అజారుద్దీన్ దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్లపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కేసు విచారణ జులై 22న చేపట్టనున్నట్టు ఇప్పటికే ప్రకటించామని ధర్మాసనం పేర్కొంది. గత విచారణలో కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని అజారుద్దీన్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. గతంలో గవర్నర్ తనపేరు సూచించి తర్వాత నిర్ణయం మార్చుకున్నారని అమీర్ ఖాన్ తెలిపారు. మంత్రివర్గ నిర్ణయం ప్రకారం జరిగిన దానికి గవర్నర్ ఏం చేస్తారని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. ఇరువురి అప్లికేషన్లను ప్రధాన కేసుతోనే విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. రెండు అప్లికేషన్లపై ప్రతివాదులకు నోటీసులు జారీసిన సుప్రీంకోర్టు తదుపరి విచారణ జులై 22కి వాయిదా వేసింది.

## రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు

# మొగ్గుచూపాలి

- **సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం పదిలం**
- **ప్రజలు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి**
- **రైతులు పంట వ్యర్థాలను కాల్చొద్దు**
- **వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**హైదరాబాద్, మే 29 (వుదయం ప్రతినిధి) :** హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో హెచ్ఎంటీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్గానిక్ మేళా ప్రదర్శన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, సాగు విధానాలు, ఎదురవుతున్న సవాళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు ఆర్గానిక్ సాగు వైపు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సారవంతత దెబ్బతింటోందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా

మిగతా 2లో

## రూ. 2,000 కోట్ల

# బకాయిలు విడుదల

**ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన మాట**

**నిలబెట్టుకున్నందుకు ఉద్యోగుల హర్షం**



**హైదరాబాద్, మే 29 (ఎఎంస్) :** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తెలంగాణ ప్రభుత్వం మరోసారి నిరూపించుకుంది. ఉద్యోగులకు ఇచ్చిన హామీని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో చూపించింది. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ. 6,000 కోట్లు విడుదల చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈరోజు విడుదల చేసిన నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని వంద శాతం క్లియర్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి మిగతా 2లో

## మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఇబ్బందులను

# సత్వరమే పరిష్కరించండి

**నియమ నిబంధనలకు విరుద్ధమైన స్థలాలపై ముందుగానే నోటీసులు ఇవ్వాలి**

**అధికారులు, పోలీసులు సమన్వయంతో పని చేయాలి**

**అనవసరంగా దళిత సంఘాల నాయకులపై కేసులు నమోదు చేయడం సరికాదు**

**సామాజిక న్యాయ సంకల్పానికి అనుగుణంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం**

**అంబేద్కర్, పూలే, జగజీవన్ రామ్ ఆశయాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి మార్గదర్శకం**

**మహనీయుల విగ్రహాల ఏర్పాట్లలో ఎదురవుతున్న సమస్యలపై సచివాలయంలో**

**ఉన్నత స్థాయి సమీక్షలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

*మహనీయుల విగ్రహాలు కేవలం శిల్పాలు కావని, అవి సామాజిక చైతన్యానికి, స్వాభిమానానికి, రాజ్యాంగ విలువలకు ప్రతీకలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దళితులు, గిరిజనులు, బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి అత్యంత కట్టుబడి పనిచేస్తోంది. సమాజంలోని అణగారిన వర్గాలకు గౌరవప్రదమైన స్థానం కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.*

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్, మే 29 (వుదయం ప్రతినిధి) :** మహాత్మా జ్యోతిబా పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగజీవన్ రామ్ వంటి మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఎదురవుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు అధికారులను ఆదేశించారు. మహనీయుల విగ్రహాలు కేవలం శిల్పాలు కావని, అవి సామాజిక చైతన్యానికి, స్వాభిమానానికి, రాజ్యాంగ విలువలకు ప్రతీకలని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దళితులు, గిరిజనులు, బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి అత్యంత కట్టుబడి పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. సమాజంలోని అణగారిన వర్గాలకు గౌరవప్రదమైన స్థానం కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఎదురవుతున్న ఇబ్బందులపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

మిగతా 2లో

## విద్యుత్ నెట్ వర్క్ మరింత బలోపేతం దిశగా

# గ్రీన్ ఎనర్జీ కారిడార్

**ఏపిలో 18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు కనెక్ట్ చేసేలా**

**సుమారు రూ.22 వేలకోట్లతో ప్రతిపాదనలు**

**ప్రభుత్వ భవనాలపై సోలార్ ఏర్పాటు పనులు త్వరితగతిన చేపట్టాలి**

**2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సోలారైజేషన్**

**నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పిఎం సూర్యఘర్ అమలు**

**విద్యుత్ శాఖపై సమీక్షలో ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు**



*గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించుకున్నామని.. దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలి. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే.. రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఈ నెట్ వర్క్ బాగా ఉపకరిస్తుంది. ఇక విద్యుత్ మౌళిక సదుపాయాలు పెరిగితే.. ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయి.* – సిఎం చంద్రబాబు

**అమరావతి, మే 29 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి.. ఆ మేరకు విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్-3లో భాగంగా సుమారు రూ. 22 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖపై సమీక్షించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరు నెలల ప్రణాళిక, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, పీఎంఈ-డ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈసీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ విస్తరించే అంశంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను అడిగారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద సుమారు 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ మేరకు కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు.

మిగతా 2లో




## ధాన్యం దిగుబడిలోనే కాదు.. కొనుగోలులోను తెలంగాణ రికార్డ్

**యావత్ భారత దేశంలోనే తెలంగాణ వాటా**

**60 శాతం : మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**యాసంగి లోను రికార్డ్ స్థాయిలో కొనుగోళ్ళు**

2

## మాజీ మంత్రి గాదె వెంకట్ రెడ్డి కన్నుమూత

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి**

**అసెంబ్లీకి ఐదుసార్లు ప్రాతినిధ్యం**

**విచారం వ్యక్తం చేసిన**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

2



## డికే అను

# నేను..



**డీకే శివకుమార్ నాయకుడిగా ఎన్నికయ్యే అవకాశం**

**శనివారం కర్ణాటక కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశం**

**అధికార బదిలీ, కొత్త మంత్రివర్గ ఏర్పాటుపై చర్చించేందుకు ఢిల్లీలో**

**కాంగ్రెస్ అగ్ర నాయకులను కలిసిన సిద్ధరామయ్య, శివకుమార్**

**బెంగళూరు, మే 29 (వుదయం) :** కర్ణాటక కాంగ్రెస్ శాసనసభ పక్షం (సీఎల్పీ) తన కొత్త నాయకుడిని ఎన్నుకోవడానికి సమావేశం కానుంది. సిద్ధరామయ్య వారసుడిగా ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌ను నియమించాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించిన నేపథ్యంలో, ఆయనే నాయకుడిగా ఎన్నికవుతారని విస్తృతంగా భావిస్తున్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు విధానసౌధలోని సమావేశ మందిరంలో, పదవీ విరమణ చేసిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ఈ విషయమై శుక్రవారం నాడు సీఎల్పీ కార్యదర్శి ఒక సర్క్యులర్‌ను జారీ చేశారు. హైకమాండ్ ఆదేశాలకు అనుగుణంగా, సిద్ధరామయ్య ఇప్పటికే శివకుమార్‌ను తన వారసుడిగా ప్రకటించి ఉండటంతో, సీఎల్పీ నాయకుడిగా ఆయన ఎన్నిక కేవలం ఒక లాంఛనప్రాయమైన ప్రక్రియగా మారింది. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సూర్జేవాలా, అలాగే కర్ణాటక శాసన మండలిలోని కాంగ్రెస్ పక్ష నాయకుడు, మంత్రి ఎన్.ఎస్. బోసెరాజు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా, 136 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ శాసనసభాపక్ష (సీఎల్పీ) నాయకుడిని ఎన్నుకుంటారని భావిస్తున్నారు. ఎమ్మెల్యేల నుండి మద్దతు లేఖలను సేకరించిన అనంతరం, కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతి కోరుతూ, అలాగే మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి ఒక తేదీని ఖరారు చేసేందుకు కొత్త సీఎల్పీ నాయకుడు గవర్నర్‌ను కలుస్తారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం నాడు విధాన సౌధంలోని విశాలమైన మెట్లపై జరిగే అవకాశం ఉంది. ఇలా ఉండగా, అధికార బదిలీ, కొత్త మంత్రివర్గ ఏర్పాటుపై చర్చించేందుకు సిద్ధరామయ్య, శివకుమార్ ఇద్దరూ ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నాయకులను కలిశారు. అంతకు ముందు రోజులో, జాతీయ రాజధానిలోని ఒక హోటల్‌లో శివకుమార్ ఇతర కాంగ్రెస్ నాయకులను కూడా కలిశారు. న్యూఢిల్లీలో విలేకరులతో

మిగతా 2లో

# ధాన్యం దిగుబడిలోనే కాదు.. కొనుగోలులోను తెలంగాణ రికార్డ్

**హైదరాబాద్, మే 29 (వుదయం ప్రతినిధి) :** ధాన్యం దిగుబడిలోనే కాకుండా కొనుగోళ్లలోను తెలంగాణా రాష్ట్రం దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మొత్తం భారతదేశంలో వివిధ రాష్ట్రాలలో కొనుగోలు చేసిన ధాన్యం తో పోల్చి చూసినప్పుడు తెలంగాణా రాష్ట్ర భాగస్వామ్యం 60% నికి చేరుకుందని ఆయన తెలిపారు. శుక్రవారం రోజు డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్,మహమ్మద్ అజహరుద్దీన్, ఖమ్మం లోకసభ సభ్యులు రామ సహాయం రఘు రాంరెడ్డి,తూడి దేవేందర్ రెడ్డి తదితరులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు.దేశం మొత్తం మీద ధాన్యం కొనుగోలు చేసిన రాష్ట్రాలతో పోల్చి చూసినప్పుడు ఇప్పటి వరకు 60% భాగస్వామ్యం అయిన తెలంగాణా రాష్ట్రం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి అయ్యే నాటికి దేశంమొత్తంలో 75% భాగస్వామ్యానికి చేరుకోవొచ్చని ఆయన తెలిపారు. కొనుగోళ్లలో మిగిలిన రాష్ట్రాలతో ఆయన పోలుస్తూ ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 24 లక్షల మెట్రిక్ టన్నులు, తమిళనాడులో 11 నుంచి 12 లక్షల మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రలో 3 లక్షల మెట్రిక్ టన్నులు, కేరళలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కాగా, తెలంగాణ ఇప్పటికే 60 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి 52 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆ లక్ష్యాన్ని అధిగమించి 60 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లను పూర్తి చేసిందన్నారు. ఇది రైతుల కష్టానికి, కాంగ్రెస్ ప్రభుత్వ రైతు పక్షపాత విధానాలకు నిదర్శనమని చెప్పారు. 2025-26 యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో 64.36 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి, సుమారు 141 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఉత్పత్తి పెరుగుతున్నా కేంద్రం కొనుగోళ్లు తగ్గిస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో ప్రతి సీజన్‌కు వరి ఉత్పత్తి పెరుగుతోందని, కానీ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా స్వీకరిస్తున్న బియ్యం పరిమాణాన్ని తగ్గిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను పలుమార్లు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దేశంలో అతిపెద్ద ధాన్యం ఉత్పత్తి, కొనుగోలు రాష్ట్రంగా తెలంగాణకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.




**భారీ స్థాయిలో ఏర్పాట్లు.** .. ధాన్యం కొనుగోళ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు, దాదాపు 13 వేల రవాణా వాహనాలు, రెండు లక్షలకు పైగా సిబ్బందిని ప్రభుత్వం వినియోగించిందన్నారు. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లోకి రూ.11,050 కోట్లు నేరుగా జమ చేశామని తెలిపారు. ఖరీఫ్, యాసంగి కలిపి 2025-26 సీజన్‌లో రైతులకు చెల్లింపులు, కొనుగోళ్లు, రవాణా తదితర కార్యకలాపాలపై దాదాపు రూ.39,300 కోట్ల వ్యయం జరుగుతోందన్నారు.

**అకాల వర్షాల వల్ల రైతులకు నష్టం రాకుండా చర్యలు**

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో తడిసిన 10,214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి రైతులకు నష్టం జరగకుండా కాపాడామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ధాన్యం కొనుగోలు, రవాణా, రైతులకు చెల్లింపులు, భారీ స్థాయిలో లాజిస్టిక్స్ నిర్వహణ వంటి అంశాల్లో తెలంగాణ సాధించిన విజయాన్ని చారిత్రాత్మక విజయంగా ఆయన అభివర్ణించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులకు పూర్తి మద్దతు అందిస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

**బీజేపీ, బీఆర్ఎస్‌పై తుమ్మల విమర్శలు**

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రేరేపిత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో ధాన్యం ఉత్పత్తి, కొనుగోళ్లు జరుగుతున్నాయని, రైతులు తీసుకొచ్చే ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని చెప్పారు. రైతులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణకు మరింత ధాన్యం కొనుగోలు కోటా, ఎఫ్‌సీఐ స్వీకరణ లక్ష్యాలను పెంచాలని డిమాండ్ చేయాలని తుమ్మల రాష్ట్ర బిజెపి నేతలకు సూచించారు.

## నీట్ తరహా పేపర్ లీక్‌లపై
# వివరణ కోరిన సుప్రీం

మొదటి పేజీ తరువాయి

అసలు సిఫార్సులోనే లోపం ఉంది లేదా సరైన అమలు లేదా అని జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. ఇటువంటి సంఘటన సంభవిస్తే, అది విద్యార్థులకు మాత్రమే కాకుండా, వారి కుటుంబాలకు, అందరికీ కూడా నిజంగానే అత్యంత తీవ్రమైన మానసిక వేదనను కలిగిస్తుంది. వారు దీనిపై ఎంతో భావోద్వేగాన్ని వెచ్చిస్తారు, అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జూన్ 21న జరగనున్న నీట్-యుజి పరీక్ష కోసం కొత్త విధానాలను అమలులోకి తెచ్చినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానానికి తెలిపారు. ఎన్‌టిఎ నిర్వహించిన నీట్-యూజీ రద్దును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు శుక్రవారం చేపట్టిన నేపథ్యంలో ఈ వ్యాఖ్య వెలువడింది. అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని కోరిన కోర్టు, ఈ అంశంపై విచారణను జూలై రెండవ వారానికి వాయిదా వేసింది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో, వైద్య ప్రవేశాల కోసం మే 3న జరిగిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (అండర్ గ్రాడ్యుయేట్), లేదా నీట్‌ను మే 12న ఎన్‌టిఎ రద్దు చేసింది. ఈ పేపర్ లీక్ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. జూన్ 21న పునఃపరీక్ష నిర్వహించడానికి షెడ్యూల్ ఖరారైంది. 2024 ఆరంభంలో, నీట్-యూజీ ప్రశ్నాపత్రాలు లీకయ్యాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, సుప్రీం కోర్టు ఆ పరీక్షను రద్దు చేయడానికి నిరాకరించింది. అయితే, ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే లక్ష్యంతో పలు ఆదేశాలను జారీ చేయడంతో పాటు, ప్రభుత్వ పరీక్షలను రద్దు చేయడానికి పాటించాల్సిన ప్రమాణాలను కూడా నిర్దేశించింది.

# అమీర్‌పేట్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ మహోత్సవం

**- మైత్రివనం చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి**

**- ముఖ్యఅతిథులుగా సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే నవీన్ యాదవ్**



**అమీర్‌పేట్ మే 28 (వుదయం ప్రతినిధి) :**

జూబ్లీహిల్స్ బైఎలక్షన్ సందర్భంగా నందమూరి అభిమానులకు ఇచ్చిన మాట ప్రకారం, గెలిచిన అనంతరం అమీర్పేట్ మైత్రివనం చౌరస్తాలో ఎన్టీ ఆర్ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించడం ద్వారా అభిమానులకు ప్రత్యేక కానుక అందించారు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పోరేషన్ చైర్మన్లు ,ప్రజా ప్రతినిధులు, సినిమా నటులు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సభను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతూ ఇంతటి మహోత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు.. మైత్రివనం చౌరస్తాలో భారతదేశం గర్వించదగ్గ యావత్తు తెలుగు జాతి చేత అన్నా అని పిలిపించుకున్న గొప్ప నాయకుడు ఎన్టీఆర్ గారు అన్నారు. ఆనాడు తాడిత, పీడిత వర్గాల కోసం, మహిళల ఓటు హక్కు కోసం కృషి చేసి, దళితవాడల్లో నివసించే పేదలకు కూడా ఓటు హక్కు కల్పించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని నేడు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరాగాంధీ ఉక్కు మహిళ అని, జమీందారుల చేతుల్లో ఉన్న రాజభరణాలను రద్దు చేసి, భూస్వాముల వద్ద ఉన్న భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచారని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం పోరాడిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని కొనియాడారు.. నీతి, నిజాయితీ, నిబద్ధతకు ప్రతీక ఎన్టీఆర్ గారని, కులమత భేదాలు లేకుండా దేశం గర్వించదగ్గ నాయకుడిగా ఆయన నిలిచారని అన్నారు. ఎన్టీఆర్ గారి స్ఫూర్తితోనే నేడు ప్రజాపాలన ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.. ఎన్టీఆర్ గారి విగ్రహాన్ని ఆవిష్కరించడం తన జీవితంలో చిరస్మరణీయ ఘట్టమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పేర్కొన్నారు. ఆనాడు ఎన్టీఆర్ గారు ప్రవేశపెట్టిన రెండు రూపాయల కిలో బియ్యం పథకం స్ఫూర్తితోనే నేడు 6 కిలోల ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం ఇందిరాగాంధీ కృషి చేస్తే, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్టీ ఆర్ గారు పాటుపడ్డారని అన్నారు.. పటేల్‌పట్వారి వ్యవస్థను రద్దు చేసి, గ్రామీణ పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా చేసిన మహానేత ఎన్టీఆర్ గారని గుర్తు చేశారు. దేశానికి ఇందిరా గాంధీ ఎంత ముఖ్యమో, ఎన్టీఆర్ గారు కూడా అంతే ముఖ్యమని, ఈ ఇద్దరు మహానేతల ఆలోచనా విధానాలతోనే ప్రస్తుతం ప్రజాపాలన ప్రభుత్వం కొనసాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

# గ్రీన్ ఎనర్జీ కారిడార్




మొదటి పేజీ తరువాయి

మొత్తంగా 18 గిగావాట్లల్లో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే 11 గిగా వాట్ల విద్యుత్ ను... అలాగే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 7 గిగావాట్ల విద్యుత్ ను ప్రధాన గ్రిడ్ కు అనుసంధానించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. ఈ మేరకు 2,261 కిలో మీటర్ల మేర కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్టు వెల్లడించారు. ఈ కారిడార్లో భాగంగా 9,500 మెగా వాట్ల సామర్థ్యంతో 5 భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించుకున్నామని.. దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే.. రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఈ నెట్ వర్క్ బాగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక విద్యుత్ మౌలిక సదుపాయాలు పెరిగితే.. ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు. ఈ ప్రాజెక్టును మొదలు పెట్టడంతో పాటు... టైమ్ బౌండ్ కార్యక్రమంగా పెట్టుకుని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

**పీఎం సూర్య ఘర్ అమలులో వేగం పెరగాలి**

సమీక్షలో భాగంగా పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలుపై సీఎం అధికారులతో చర్చించారు. అలాగే ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ పనులు ఎంత వరకు వచ్చాయని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 మెగా వాట్ల సామర్థ్యంతో ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టినట్టు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ ప్రక్రియలో భాగంగా రెస్కో మోడల్ అనుసరిస్తున్నామని అధికారులు తెలిపారు. నెట్ మీటరింగ్ విధానంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. అలాగే నెట్ జీరో విధానంలో హెల్తీ క్యాంపస్ లను తీర్చిదిద్దేలా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసేందుకు 2,898 హాస్టళ్లు, స్కూళ్లల్లో గుర్తించినట్టు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, స్కూళ్లలో సోలార్ వినియోగం పెరిగితే.. ప్రభుత్వంపై విద్యుత్ భారం తగ్గుతుందని సీఎం చెప్పారు. ఈ విషయంలో అధికారులు పూర్తిగా ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం అమల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందని... అగ్రస్థానంలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చామని.. మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇక బీసీ వర్గాలకు రూ. 20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లకు సోలార్ ప్యానెళ్లను బిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని... వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఇక రాష్ట్రంలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించినట్టు అధికారులు వెల్లడించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ప్రవాహ' సంస్థ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ సహకారంతో, ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకుంటున్న విధానాన్ని అధికారులు ప్రజెంట్ చేశారు. ఈ తరహాలో విద్యుత్ సరఫరా కోసం దేశంలోనే మొదటిసారిగా డిజిటల్ ట్విన్ గ్రిడ్ రూపొందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షలో భాగంగా విద్యుత్ డిమాండ్ ఏ మేరకు ఉందనే విషయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. జూన్ 2026 నుంచి నవంబర్ 2026 వరకు రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరి, రోజువారీ డిమాండ్ 226 నుంచి 261 మెగా యూనిట్లు వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని చెప్పారు. మే 27 వరకు 7,060 మెగాయూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందని అధికారులు వెల్లడించారు. 2025తో పోలిస్తే ఏప్రిల్-మే 2026 కాలంలో గరిష్ట డిమాండ్ 14.48 శాతం నుంచి 16.77 శాతానికి విద్యుత్ వినియోగం పెరిగిందని అధికారులు చెప్పారు. రైతులకు ఆర్థికంగా లబ్ధికలిగే సీబీజీ(కంప్రెస్డ్ బయో గ్యాస్)ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించేలా పాలసీ చేశామని, సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు విషయంలో అధికారులు చొరవ తీసుకుని త్వరితగతిత ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**సీఎంను కలిసిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం**

వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి థీమాటిక్ సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రీయల్ రెవెల్యూషన్- C4IR అమలు చేయాల్సిన కార్యాచరణపై ఈ బృందం చర్చించింది. C4IR ఏర్పాటుపై ఏపీ ట్రాన్స్ కో-వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో గతంలోనే ఒప్పందం కుదిరింది. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి రంగాలపై C4IR అధ్యయనం చేయనుంది. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు. వివిధ రకాల విద్యుత్ ఉత్పత్తి మోడళ్లను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి బెస్ట్ మోడల్ తయారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు, పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని C4IR కార్యాచరణతో అనుసంధానం చేయాలని సూచించారు. రిజల్ట్ ఓరియేంటేషనుతో C4IR పని చేయాలని సీఎం ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లాలని C4IRకు సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సీఎస్ సాయిప్రసాద్, విద్యుత్, ట్రాన్స్ కో, జెన్కో, డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో ఇబ్బందులను పరిష్కరించండి

మొదటి పేజీ తరువాయి

నిర్వహించారు. ఈ సమావేశంలో దళిత సంఘాల ప్రతినిధులు, యువకులు, ప్రజా సంఘాల నాయకులు విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి ఎదురవుతున్న స్థల సమస్యలు, అనుమతుల జాప్యం, స్థానిక స్థాయిలో తలెత్తుతున్న అభ్యంతరాలు, పోలీసు అనుమతులు, రెవెన్యూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... మహనీయుల ఆశయాలను గ్రామస్థాయి నుంచి యువతలోకి తీసుకెళ్లే ప్రక్రియలో విగ్రహాల ప్రతిష్టాపనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలలో అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాహుల్ గాంధీ చేపట్టిన "భారత్ జోడో యాత్ర" దేశంలో సామాజిక ఐక్యత, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం లక్ష్యాలతో సాగిందని మంత్రి పేర్కొన్నారు. ఆ యాత్రలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, బాబూ జగజీవన్ రామ్ వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లే స్ఫూర్తి ప్రతిబింబించిందన్నారు. సమానత్వం, సోదరభావం, హక్కుల పరిరక్షణ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల మూలాధారమని చెప్పారు. విగ్రహాల ప్రతిష్టాపనలో ఎలాంటి అనవసర జాప్యం జరగకుండా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను చట్టబద్ధంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని సూచించారు. నియమ నిబంధనలకు అనుగుణంగా లేని స్థలాల విషయంలో ముందుగానే సంబంధిత సంఘాలకు స్పష్టమైన నోటీసులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. చివరి నిమిషంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, దళిత సంఘాలతో చర్చించి ముందస్తు పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనవసరంగా దళిత సంఘాల నాయకులపై కేసులు నమోదు చేయడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (వెల్ఫేర్) సభ్యసాచి ఘోష్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనోజ్ చౌదరి, ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, హైదరాబాద్ డీసీపీ-II కాజల్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, ఏసీఎల్‌బీ జి. జితేందర్ రెడ్డి, ఎస్సీడీడీ వీసీ, ఎండీ (ఎఫ్‌ఏసీ) హనుమంత్ నాయక్, ఎస్సీడీడీ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, రామారావు, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సంతోష్, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతో, ఎల్‌బీనగర్ సీపీ శ్రీనివాస్ యాదవ్, సైబరాబాద్ ఎస్‌బీ డీసీపీ వైవీఎస్ సుధీంధ్ర, ఓఎస్డీ వై .జే. విజయ్ కుమార్ తదితర అధికారులతో పాటు ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు దొమ్మాటి సుదర్శన్ బాబు, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రాం ప్రసాద్, కళానిధి మాస్టర్ జీ, నల్ల సూర్యప్రకాశ్, సొసైటీ ఫర్ సోషల్ జస్టిస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జీటీ శేఖర్, ఆల్ ఇండియా ఎస్సీ/ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎస్. నాను, జి.బి. శ్యామ్ రావు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగజీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వీకర్ సెక్షన్ అసోసియేషన్ (ఆదర్శనగర్) తాలూకా అనిల్, ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కుర్మల్‌గూడ నాయకులు సంగం మహేష్, కుర్మ మహేందర్, రాపాక అశోక్ తదితర దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# డికే అను నేను..



మొదటి పేజీ తరువాయి

మాట్లాడు తూ , కాంగ్రెస్ అధిష్టానంతో చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని, సమావేశం నిమిత్తం పార్టీ ఎమ్మెల్యేలందరూ బెంగళూరులోనే అందుబాటులో ఉండాలని కోరినట్లు శివకుమార్ తెలిపారు. అధిష్టానం కోరిన విధంగానే అన్నీ జరుగుతున్నాయి. ఇంకా ఏదీ నిర్ణయం కాలేదు. రేపు మేము సీఎల్పీ సమావేశాన్ని ఏర్పాటు చేశాము, మా కేంద్ర నాయకులు రావాల్సి ఉంది. మేం మా అధిష్టానంతో చర్చించాల్సి ఉంది. ఎమ్మెల్యేలందరూ బెంగళూరులో అందుబాటులో ఉండాలని మేం కోరాం. అది తప్ప, మరేమీ లేదు, అని శివకుమార్ పేర్కొన్నారు. నాయకత్వ మార్పుపై కొన్ని రోజులుగా సాగుతున్న తీవ్రమైన ఊహాగానాలకు తెరదించుతూ, గురువారం సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇక శుక్రవారం, కర్ణాటక మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, రాజ్యసభ ఎన్నికలు, ఇతర సంస్థాగత విషయాలపై చర్చించేందుకు సిద్ధరామయ్య న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ఇతర సీనియర్ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సీనియర్ నాయకుడు ఇప్పటికే రాజ్యసభ సీటును తిరస్కరించి, కేంద్రంలో బాధ్యతలు చేపట్టడం కన్నా కర్ణాటకలోనే చురుకుగా ఉండటానికే తన ప్రాధాన్యతను వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. గమనించవలసిన విషయం ఏమిటంటే, మే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత, ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. చివరకు, ఉప ముఖ్యమంత్రి పదవిని స్వీకరించేలా పార్టీ శివకుమార్‌ను ఒప్పించింది. ఆ సమయంలో, "ముఖ్యమంత్రి పదవిని పంచుకునే విధానంష (రొటేషనల్ చీఫ్ మినిస్టర్ ఫార్ములా) కింద ఒక రాజీ కుదిరినట్లు వార్తలు వచ్చాయి. దీని ప్రకారం, రెండున్నర సంవత్సరాల తర్వాత శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాల్సి ఉంటుంది. అయితే, పార్టీ గానీ, ఆ ఇద్దరు నాయకులు గానీ ఈ ఒప్పందాన్ని అధికారికంగా ధృవీకరించలేదు.

# ఇళ్ల డిజైన్

మొదటి పేజీ తరువాయి

రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు.. భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# ఉద్యోగుల బకాయిలు విడుదల

మొదటి పేజీ తరువాయి

మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించారు. "ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైంది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోంది."ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న ఈ శ్రద్ధ, శరవేగ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు
# మొగ్గుచూపాలి

మొదటి పేజీ తరువాయి

తీసుకోవడం వల్ల ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులు వేగంగా విస్తరిస్తుండటానికి ప్రధాన కారణాల్లో ఆహారపు అలవాట్లు, రసాయనాల ప్రభావం కూడా ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం రెండూ మెరుగుపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఉత్పత్తి చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజలు ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే, అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తేనే సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అలాగే రైతులు పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, ఇది భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మంత్రి తెలిపారు. రైతులు పంట వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు.

## అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరును
# ఓటరు జాబితాలో చేర్చాలి




**హైదరాబాద్, మే 29 (వుదయం ప్రతినిధి) :** అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరును ఓటరు జాబితాలో చేర్చాలని, అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగించాలని భారత ఎన్నికల సంఘం త్వరలో రాష్ట్రంలో నిర్వహించే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయంలో అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఐఎ ఎస్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎన్నికల అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, బిఎల్ఓ సూపర్ వైజర్లు తదితర ఎన్నికల అధికారులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఇఓ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ డిఇఓ, ఇఆర్ఓ ఎఇఆర్ఓ, బిఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఓ ల బాధ్యతలపై, సర్ ప్రక్రియలో ఐటీ సంబంధిత కార్యకలాపాల గురించి వివరించారు. శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి సర్ ప్రక్రియకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను, అలాగే సర్ అమలు ప్రక్రియలో ఉండే దశలు, విధానాలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు.

# శ్రీవాణి దర్శన టికెట్ల కేటాయింపులో మార్పులు

**టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల**

**మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు**

**అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనం**

**తిరుమల, మే 29 (వుదయం ప్రతినిధి) :** భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేస్తూ టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను టీటీడీ ఆన్ లైన్ ద్వారా అందుబాటులో ఉంచడం జరిగింది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలల ముందుగా ఆన్ లైన్ లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులో ఉంచడం జరిగింది. మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేయడం జరుగుతోంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 శ్రీవాణి దర్శన టికెట్లలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయించడం జరిగింది. ఈ సదుపాయం 2025 మే 1 నుండి విరాళం చెల్లించిన అర్హులైన దాతలకు వర్తించనుంది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేయబడతాయి. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనం కల్పించబడుతుంది. ఈ విధానం జూన్ 10వ తేది నుండి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో కలపబడతాయి. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుంది.



# గ్రేటర్ హైదరాబాద్



## నిర్మాణ రంగానికి చేయూతనందించండి.. సమ్మె విరమించాలని బిల్డర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి



**శేరిలింగంపల్లి 29 (వుదయం ప్రతినిధి)**

ప్రస్తుత పరిస్థితుల్లో నిర్మాణరంగం ఎన్నో ఒడిదుడుకులతో ఉందని నిర్మాణ రంగ కార్మికులు పరిస్థితి అర్థం చేసుకొని సమ్మె విరమించి బిల్డర్స్ తో సహకరించాలని అసోసియేషన్ చైర్మన్ మిరియాల రాఘవరావు కోరారు. ఈరోజు శేర్లింగంపల్లి నియోజకవర్గం లోని మాదాపూర్ డివిజన్లోని అయ్యప్ప సొసైటీలో ఏర్పాటుచేసిన ది గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక వర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిరియాల రాఘవరావు మాట్లాడుతూ అమెరికా ఇరాన్ యుద్ధం వల్ల ముడి సరుకులు వివిధ నిర్మాణ వస్తువులు పెరగటం వల్ల ఆర్థిక భారం నిర్మాణరంగంపై పడిందని తద్వారా భారీ ఎత్తున నిర్మాణ వ్యయం పెరగడంతో అంచనాలకు మించి బిల్డర్లు సతమతమవుతున్నారని ఆయన లో రేట్లు పెంచడం సమంజసంకాదని ఆయన అన్నారు . ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని సమ్మె విరమించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ కె రాజారెడ్డి మాట్లాడుతూ ఒకపక్క జరుగుతున్న యుద్ధాల వల్ల పెరుగుతున్న మెటీరియల్ ధరలతో పాటు ఈ సమ్మె కారణంగా చిన్న బిల్డర్స్ చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన వాపోయారు. ఈ కార్యక్రమంలో స్వప్న శ్రీనివాస్, అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పి బి ఎస్ విశ్వనాథ్, టెక్నికల్ అడ్వైజర్ సుమా రామకృష్ణ, మరియు పులి మురళి ,ఉపేందర్ రెడ్డి, చక్రపాణి ,వాసుదేవరావు, రామకృష్ణ ,విజయ ప్రతాపరెడ్డి ,కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది**
**మహిళా శక్తి వారోత్సవాలలో భాగంగా షాద్ నగర్ పట్టణ మహిళా సంఘం మంజూరైన చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్ నగర్**



మున్సిపల్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా శక్తి వారోత్సవాల పట్టణ మెప్మా వారి ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు మంజూరైన 4కోట్ల రూపాయలు గల చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ...ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సంఘాల వ్యవస్థ ప్రారంభమైనదని, దేశం రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళల ద్వారా సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసిందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పరిమితిని రూ 5 లక్షల నుండి 10 వరకు పెంచి, బ్యాంకు రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తుంది అన్నారు. మహిళలకు ఉచితబస్ ప్రయాణం, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు.మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక అభివృద్ధికి తోడ్పడే మహిళా సమైక్య భవనాలు ఉపయోగపడతాయన్నారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుండి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, కౌన్సిలర్ మురళీ మోహన్, దిలీప్, బచ్చలి నరేష్,కో ఆప్షన్ సభ్యురాలు ఉషారాణి, నేతలు కృష్ణరెడ్డి, నల్లమోని శ్రీధర్, మహమ్మద్ ఇబ్రహీం, బాలరాజు గౌడ్,ముబారక్ అలీఖాన్, సాదిక్, సోలీపూర్ అనిల్, చందూలాల్, కరుణాకర్, రాయికల్ శ్రీనివాస్, చందు నాయక్, రవితేజ, తుపాకుల శేఖర్, రమేష్, మెప్మా సిబ్బంది పట్టణ సమైక్య అధ్యక్షురాలు జయమ్మ, గోసియా,అనితా , శైలజ, విజయ, భాను, సునీత, స్వప్న, నీరజ, సంగీత ,గౌరమ్మ, అనిత, బాలమణి జ్యోతి ,తదితరులు పాల్గొన్నారు..

## నిరాశ్రయుల కేంద్ర నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

**షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ వి. సునీత**

**రంగారెడ్డి జిల్లా (వుదయం ప్రతినిధి)**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నిరాశ్రయుల కేంద్రం నిర్వహణకు ఆసక్తి గల స్వచ్ఛంద సంస్థలు, స్లమ్, పట్టణ సమాఖ్యలు, నెహ్రూ యువ కేంద్రాలు, సంక్షేమ సంబంధిత సంస్థల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పురపాలక సంఘ కమిషనర్ తెలిపారు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా, పురపాలక సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు ఆసక్తి గల సంస్థలు జూన్ 1వ తేదీ 2026 లోపు షాద్ నగర్ పురపాలక సంఘ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ సూచించారు మరిన్ని వివరాల కోసం కార్యాలయ పని వేళల్లో మెప్మా విభాగాన్ని సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

## స్వయం సహాయక మహిళ సంఘాలకు చెక్కును అందజేసిన



**ఎమ్మెల్యే విజయుడు**

**అలంపూర్ మే 29 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మున్సిపాలిటీ కేంద్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అలంపూర్ పురపాలక సంఘం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మహిళా సంఘాల లోన్ మేళా కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పట్టణ స్థాయి సమైక్య (టిఐఎఫ్), ప్రాంతీయ స్థాయి సమైక్య (ఏఎల్ ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. అలంపూర్ పట్టణ స్వయం సహాయక సంఘాలకు (14 సంఘాలు ) బ్యాంకు లింకేజీ ద్వారా రెండు కోట్ల రూపాయల (2,00,00,000)చెక్కును మండల మహిళా సమైక్య సభ్యులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, మండల మహిళ సమైక్య సభ్యులు, మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్ లు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఐలాపూర్‌లో గెస్ట్ హౌస్ వ్యవహారం హైకోర్టు ఆదేశాలు పాటించాలని బాధితుడి విజ్ఞప్తి



**అమీన్‌పూర్ (వుదయం ప్రతినిధి)**

అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన ముకీం ఇటీవల కూల్చివేయబడిన తన గెస్ట్ హౌస్‌కు సంబంధించిన వ్యవహారంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, హైడ్రా చర్యల అనంతరం సంబంధిత అధికారులు తనను పలు మార్లు సంప్రదిస్తూ వివిధ రకాల ఒత్తిడులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, హైడ్రాకు సంబంధించిన ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్ ప్రతిరోజూ జీహెచ్ఎంసీ పేరుతో ఉన్న వాహనంలో తన గెస్ట్ హౌస్ వద్దకు వచ్చి వివిధ అంశాల పేరుతో హెచ్చరికలు చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై తాను హైకోర్టును ఆశ్రయించినట్లు ముకిం తెలిపారు. విచారణ సందర్భంగా సంబంధిత భూమికి సంబంధించిన పూర్తి వివరాలు, ఎస్ఓపీ సంబంధిత రికార్డులు) సమర్పించాలని న్యాయస్థానం సూచించినట్లు చెప్పారు.హైకోర్టులో కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో, కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ తుది నిర్ణయం వచ్చే వరకు తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండాలని సంబంధిత అధికారులను, ముఖ్యంగా ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్‌ను కోరినట్లు తెలిపారు.ఈ అంశంపై అధికారుల స్పందన తెలియాల్సి ఉందని, కేసు ప్రస్తుతం న్యాయస్థాన పరిధిలో ఉన్నందున కోర్టు తీర్పు అనంతరం తదుపరి పరిణామాలు స్పష్టమవుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

## సిద్దిపేటలో డిస్ట్రిక్ట్ లెవెల్ టెలికాం కమ్యూనికేషన్ కమిటీ సమావేశం



**నెట్‌వర్క్ సేవల్లో అంతరాయం కలగవద్దు: అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్**

**సిద్దిపేట, మే 29 (వుదయం బ్యూరో)**

జిల్లాలో ఇంటర్నెట్, మొబైల్ వినియోగదారులకు ఎక్కడా ఎలాంటి ఆటంకాలు కలగకుండా నిరంతరాయంగా నెట్‌వర్క్ సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ టెలికాం కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన అధ్యక్షతన 'డిస్ట్రిక్ట్ లెవెల్ టెలికాం కమ్యూనికేషన్ కమిటీ' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సాంకేతిక కారణాల వల్ల నెట్‌వర్క్ సమస్యలు తలెత్తినా లేదా సెల్ టవర్ల సిగ్నల్స్‌కు అంతరాయం ఏర్పడినా, వాటికి రిపేర్లు చేపట్టే ముందు తప్పనిసరిగా 'కాల్ బిఫోర్ యూ డిగ్' యాప్‌లో సమస్యను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. దీనివల్ల స్థానిక అధికారులందరికీ ముందస్తు సమాచారం అందుతుందని, తద్వారా నెట్‌వర్క్ సేవల అంతరాయం గురించి ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసే వీలుంటుందని ఆయన తెలిపారు.ప్రభుత్వ అధికారులతో టెలికాం కంపెనీల ప్రతినిధులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని అదనపు కలెక్టర్ హెచ్చరించారు.ఈ సమీక్షా సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటరెడ్డి, జిల్లా పారిశ్రామిక అధికారి గణేష్ రామ్, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యతో పాటు విద్యుత్ శాఖ ఎస్ఈ, వివిధ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. అలాగే టీఫైబర్, బీఎస్ఎన్ఎల్ , జియో, ఇండస్ టవర్స్ వంటి ప్రముఖ టెలికాం కంపెనీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## గ్లోబల్ మోన్యుమెంట్స్‌లో మన రాళ్లదే హవా.. 90 శాతం భారత్ నుంచే ఎగుమతి: 'ఫిగ్సి' ప్రతినిధి

**దేశవ్యాప్తంగా 15 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న ₹60,000 కోట్ల రాతి పరిశ్రమ**
**ప్రజా మౌలిక వసతుల నిర్మాణంలో స్టోన్ వ్యర్థాలను వినియోగించేలా ప్రభుత్వ విధానం అవసరం**
**సహజ రాళ్ల పరిశ్రమపై పన్నులు తగ్గించి, ప్రభుత్వ ప్రాజెక్టుల్లో సహజ రాళ్ల వినియోగాన్ని పెంచాలి**
**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు దేశానికి "రత్నగర్భ"లాంటివి**



**హైదరాబాద్, (వుదయం ప్రతినిధి)**

భారతదేశ సహజ రాళ్ల పరిశ్రమ ప్రపంచ నిర్మాణ రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రపంచంలోని ప్రధాన స్మారక చిహ్నాలు, స్మారక స్థూపాలు, వాణిజ్య సముదాయాలు, ప్రజా ప్రదేశాలు, ప్రతిష్టాత్మక నిర్మాణాల్లో దాదాపు 90 శాతం వరకు భారతీయ రాళ్లు ఏదో ఒక రూపంలో ఉపయోగించబడ్డాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ గ్రానైట్ అండ్ స్టోన్ ఇండస్ట్రీ (FIGSI) సీనియర్ పదాధికారి, క్వారీయింగ్ డెవలప్‌మెంట్, ఎన్విరాన్‌మెంట్ అండ్ ఎకాలజీ సబ్ కమిటీ చైర్మన్ రాజేష్ అంగార తెలిపారు.హైదరాబాద్‌లో హైటెక్స్‌లో నిర్వహిస్తున్న స్టోన్ అండ్ టెక్ ఎక్స్‌పో 2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.భారతీయ సహజ రాళ్లు నాణ్యత, మన్నిక, వైవిధ్యమైన రంగులు, నైపుణ్యపూర్వక ప్రాసెసింగ్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందుతున్నాయని, ప్రస్తుతం 120కు పైగా దేశాలకు భారతదేశం నుంచి గ్రానైట్, మార్బుల్, శాండ్‌స్టోన్, లైమ్‌స్టోన్, క్వార్ట్‌జైట్ వంటి రాళ్లు మధ్యప్రాచ్యం, ఆసియా, ఆఫ్రికా దేశాల్లోని అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు భారతీయ రాళ్లు సరఫరా అవుతున్నాయని చెప్పారు. స్టోన్ వ్యర్థాల వినియోగంపై ప్రత్యేక విధానం అవసరంరాతి తవ్వకాల సమయంలో 80 నుంచి 90 శాతం వరకు రాయి వ్యర్థంగా మిగిలిపోతుందని, ఈ వ్యర్థాలను ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే గ్రానైట్‌లో దాదాపు 80 శాతం ఎగుమతులకు వెళ్తోందని, ప్రపంచ మార్కెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు ఉందని రాజేష్ పేర్కొన్నారు.₹60,000 కోట్ల పరిశ్రమదేశవ్యాప్తంగా రాతి పరిశ్రమకు సంబంధించిన సుమారు 1.5 లక్షల సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, వ్యవస్థీకృత రంగంలో ఈ పరిశ్రమ పరిమాణం ₹60,000 కోట్లకు చేరుకుందని రాజేష్ అంగార తెలిపారు.తెలంగాణ, భారతదేశంలో మాత్రం ఇసుకతో తయారు చేసిన కృత్రిమ రాళ్లు, టైల్స్ వినియోగం ఎక్కువగా జరుగుతోందని, ఇవి సహజ రాళ్లతో పోలిస్తే తక్కువ మన్నిక కలిగి ఉంటాయని పేర్కొన్నారు. భారతదేశానికి రాళ్లతో ముడిపడిన గొప్ప సాంస్కృతిక వారసత్వం ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మాత్రమే ఈ పరిశ్రమ విలువ సుమారు ₹8,000 కోట్లుగా ఉందని వెల్లడించారు. వీటిలో మూడు చైనా సంస్థలకు చెందినవి కాగా, మిగిలినవి భారతీయ సంస్థలవి.ఎక్స్‌పోకు మూడు రోజులలో 4,000 మందికి పైగా సందర్శకులు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.ప్రవేశం ఉచితం అయినప్పటికీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మాత్రమే ఈ పరిశ్రమ విలువ సుమారు ₹8,000 కోట్లుగా ఉందని రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని రాజేష్ అంగార తెలిపారు.ముందస్తు నమోదు తప్పనిసరి.భారతీయ రాతి కళా వైభవానికి వేదికఈ ప్రదర్శనలో సహజ రాళ్ల తవ్వకం, ప్రాసెసింగ్, ఫినిషింగ్, సస్టైనబుల్ మైనింగ్ రంగాల్లోని ఆధునిక సాంకేతికతలను ప్రదర్శిస్తున్నారు. సహజ వనరులు, సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యాన్ని సమ్మిళితం చేసిన ఈ కళాఖండాలు సందర్శకులకు అరుదైన అనుభూతిని అందిస్తున్నాయి. మీడియా సంప్రదింపులకు: సోలస్ మీడియా, డి. రామ్‌చంద్రం, మొబైల్: 9848042020రాజేష్ అంగార, మొబైల్: 9885562539

## ఒంటి కాలు పై వీఓఏ ల నిరసన



**వికారాబాద్: మే 29 (వుదయం బొంరాస్ పేట ప్రతినిధి)**

బొంరాస్ పేట: తమ పక్షాన నిలబడి గత ప్రభుత్వాన్ని నిలదీసి న్యాయమైన డిమాండ్ లు నెరవేరుస్తామని ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రం లోని మహిళా సమాఖ్య ఆవరణ లో voa లు చేపట్టిన సమ్మె నేటితో 12వ రోజుకు చేరుకుంది. సమ్మె లో భాగంగా VOA ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య నాయక్ ఆద్వర్యం లో VOA లందరూ ఒంటి కాలు పై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడి ఎన్నికల్లో VOA లకు ఇచ్చిన హామీల మేరకు 20 వేల కనీస వేతనం చెల్లించాలని , అరుహు లైన VOA లను సీసీ లుగా పదోన్నతి కల్పించాలని, 20లక్షల ఆరోగ్య భీమా ఇవ్వాలని,58 జీ వో ను సవరించి తక్షణమే అమలు చేయాలని,డిమాండ్ చేస్తూ లేనిచో సమ్మె ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. ఈ నిరవధిక సమ్మె లో మండల VOA ల సంఘం నాయకులు రూప్ల నాయక్, సురేందర్ రెడ్డి, చరిత, దేవమ్మ, నీలిమ, రూప, శైలజ, అనితా, లక్ష్మణ్ నాయక్,నాగభూషణం, వెంకటయ్య, కృష్ణ మరియు బసప్ప పాల్గొన్నారు.

## పంట వ్యర్థాలను కాల్చవద్దు: రైతులకు ఏఈఓ ఖలీల్ అవగాహన



**దౌలాపూర్ గ్రామ పంచాయతీలో ఏకగ్రీవ తీర్మానం.. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా!**

**సిద్దిపేట/జగదేవ్‌పూర్, మే 29 (వుదయం ప్రతినిధి)**

పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే పంట వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తగులబెట్టవద్దని వ్యవసాయ విస్తరణ అధికారి ఎండి ఖలీల్ రైతులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో 'పంట అవశేషాలను కాల్చకూడదు' అనే అంశంపై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.ఈ సందర్భంగా ఏఈఓ ఖలీల్ మాట్లాడుతూ పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూమి తన సహజ సారవంతాన్ని కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పంటకు మేలు చేసే మిత్రపురుగులు, సూక్ష్మజీవులు నశిస్తాయని, వాతావరణ కాలుష్యం పెరిగి ప్రజలకు శ్వాసకోశ వ్యాధులు వస్తాయని హెచ్చరించారు. అంతేకాకుండా పొలాల్లో మంటలు పెట్టడం వల్ల పక్క పొలాలకు వ్యాపించి అగ్నిప్రమాదాలు జరిగే ముప్పు ఉందన్నారు. వ్యర్థాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నుకుంటే మంచి ఎరువుగా మారుతుందని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి పంట వ్యర్థాలను తగులబెడితే ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 27 ప్రకారం కఠినమైన పర్యావరణ పరిహార జరిమానాలు ఉంటాయని ఏఈఓ స్పష్టం చేశారు. సాధారణ స్థాయిలో వ్యర్థాలను కాల్చితే రూ. 5,000 జరిమానా. భారీ స్థాయిలో వ్యర్థాలను తగులబెడితే రూ. 25,000 వరకు జరిమానా విధిస్తారు. నేల ఆరోగ్యంగా ఉంటేనే పంట బాగుంటుంది: సర్పంచ్‌గ్రామ సర్పంచ్ కుక్కునూరు కృష్ణ మాట్లాడుతూ.. "నేల ఆరోగ్యంగా ఉంటేనే పంట ఆరోగ్యంగా ఉంటుంది" అని పేర్కొంటూ, పంట మార్పిడి విధానాన్ని పాటించాలని రైతులకు సూచించారు. భూసారాన్ని పెంచేందుకు రైతు సోదరులంతా తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులను వాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోకల రామచంద్రం, గ్రామ కార్యదర్శి సతీష్, వార్డు సభ్యులు మధు, బాగిరెడ్డి, నరేందర్ రెడ్డి, పుష్పలత, బొల్లు అయిలయ్య, నర్సింలు, నరసింహారెడ్డి, మంజే కిష్టయ్య తదితర రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ బాధితులకు 'డబుల్ బెడ్రూం'

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా (వుదయం ప్రతినిధి)**





దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులలో బాధితులకు 2 బిహెచ్ కె ఇల్లు కేటాయించి అందించే నిర్ణయం తీసుకోవడం గర్వకారణమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులతో కలిసి అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి లు హాజరైనారు. ఈ సందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల 25వ తేదిన తహాసీల్దార్లు తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే సమావేశాన్ని నిర్వహించాలన్నారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలను త్వరిగతిన జారీ చేయాలన్నారు. పోలీసు శాఖ వారు పెండింగ్ కేసుల పై ప్రత్యేక శ్రద్ద వహించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని తద్వారా కమీషన్ వారికి పురోగతి కనిపిస్తుందన్నారు. మన జిల్లాలో ఒకరే పిపి ఉండడం వల్ల వారి అభిప్రాయానికి ఎక్కువ సమయం పడుతుందని మరొక పిపిని నిర్ణయించడానికి కమీషన్ వారు డివిఎంసి కమిటీ ద్వారా తగిన చొరవ తీసుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు. తప్పనిసరిగా మూడు నెలలకొకసారి డివిజన్ స్థాయిలో నిర్వహించి పెండింగ్ కేసులను క్లియర్ చేయాలన్నారు. సఫాయి కర్మచారిల గురించి ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. సఫాయి కర్మచారిలకు అందించే పిపిఈ కిట్, ప్రొటెక్టివ్ కిట్లను క్రమం తప్పకుండా అందించేందుకు మున్సిపల్ కమీషనర్లు, జోనల్ కమీషనర్లకు కలెక్టర్ ద్వారా లేఖలు అందజేస్తామన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతంరిజర్వేషన్ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఈఓ ను ఆదేశించారు. అంతకు ముందుగా గతంలో నిర్వహించిన డివిఎంసి సమావేశంలోని మినిట్స్ ప్రకారం పెండింగ్ కేసుల వివరాలను పోలీసు,రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించారు. అందుకే సివిల్ రైట్ డేను ప్రత్యేకంగా నిర్వహించి అమలు జరిగేలా చూడాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులపై విచారణ చర్యలను వేగవంతం చేసి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీంతో పాటు అధికారులు ఎఫ్ఐఆర్ కేసులు నమోదు అయిన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈరోజు జరిగిన సమావేశ మినిట్స్ ను తదుపరి నిర్వహించే సమావేశానికి పోలీసులు, వివిధ శాఖల అధికారులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు 2 బిహెచ్ కె ఇళ్లతోపాటు అదనంగా ఉపాధి, పెన్షన్ కూడా అందించేందుకు రెవెన్యూ శాఖ అధికారులు సహకరించాలన్నారు.డివిఎంసి సభ్యులు తమ దృష్టికి వచ్చిన ఎస్సీ ఎస్టీల సమస్యలను తెలుపగా అదనపు కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులకు తగు సూచనలు జారీ చేసారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులురాంబాబు నాయక్, డివిఎంసి సభ్యులు, డిఆర్ఓ మాలతి, ఆర్డిఓలు రాజేష్ కుమార్, శ్యాంప్రకాష్, పోలీసు ఉన్నత అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ రికార్డుతో మెరిసిన హబ్షిపూర్ చిన్నారి నిహిత్

**- గిన్నిస్ అచీవర్స్ మీట్‌లో ఘన సన్మానం**

**సిద్దిపేట, మే 29(వుదయం ):**



సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షిపూర్ గ్రామానికి చెందిన చిన్నారి నిహిత్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి ప్రపంచ రికార్డు జాబితాలో చోటు దక్కించుకోవడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది.హల్లెల్ మ్యూజిక్ స్కూల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని విక్టరీ ఆడిటోరియంలో 'గిన్నిస్ అచీవర్స్ మీట్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ ర్చి ఎంపిక కావడం విశేషమని పేర్కొన్నారు. అనంతరం నిహిత్‌కు గిన్నిస్ ఎంపిక చేసి సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు చెప్పారు.నిహిత్ విజయానికి తల్లిదండ్రులు నాగరాజ్, శశిరేఖల ప్రోత్సాహం, మార్గదర్శకత్వమే కారణమని కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు ఫోన్ ద్వారా మరియు ప్రత్యక్షంగా అభినందనలు తెలియజేశారు. నిహిత్ సాధించిన ఈ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హబ్షిపూర్ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

**IN THE COURT OF THE HON'BLE 1st JUNIOR CIVIL JUDGE,CITY CIVIL COURT AT: SECUNDERABAD**
**O.S. No. 243 OF 2025**

**Between:**
Dr.Bathini Mary Kantha Aruna & Others
**...Plaintiff**
**AND**
The Mandal Revenue Officer/ Tahsildar,Secunderabad Mandal & others
**...Defendants**

To,
The Mandal Revenue Officer,
78tdce, Sardar Patel Road,
Prenderghast Road,
Secunderabad,
Telangana, 500003

The Plaintiffs herein filed the above suit in O.S. No. 243 of 2025 before the Hon'ble 1st Junior Civil Judge, Secunderabad against the Defendants praying to declare them as legal heirs of late Sri Late B.J.Fleming & Late Dr.Orpamma. That the above Suit is posted on 18.06.2026 for appearance. Objections if any may be filed by 10.30 am on 18.06.2026.

***(BY ORDER OF THE COURT)***

Sd/-
**M/s U. SUMAN**
**L. MAHESWARI**
**Advocates**
**Mob: 9848933642**



* బీజేపీని వ్యతిరేకించే పార్టీల నాయకులపై ఈడీ చేపడుతున్న చర్యల విషయంలో కాంగ్రెస్ ఒక సంకుచిత వైఖరిని అవలంబిస్తోంది. తమ సొంత నాయకులు లక్ష్యంగా మారినప్పుడు మాత్రమే ఆ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. తన నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలకు సంబంధించి స్పందిస్తూ, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, తమను వ్యతిరేకించే పార్టీల పట్ల అది కఠిన వైఖరిని అవలంబిస్తోంది. అనేక ప్రతిపక్ష పార్టీలకు, వాటి నాయకులకు వ్యతిరేకంగా అది ఈడీని పక్షపాత ధోరణితో వినియోగిస్తోంది. కాంగ్రెస్ పార్టీ మాత్రం తమ సొంత నాయకులపై చర్యలు తీసుకున్నప్పుడు మాత్రమే దీనిని వ్యతిరేకిస్తుంది. మాజీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విషయంలో ఆయనను ఎందుకు అరెస్టు చేయడం లేదు, ఆయనపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని కాంగ్రెస్ పదేపదే ప్రశ్నించింది, అయితే ఆయనపై కేసు నమోదైనప్పుడు వారు సంబరాలు చేసుకున్నారు.

* కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ *

## వే'మన'పద్యం

ఎన్నిచోట్ల తిరిగి యేపాటు పడినను
అంటనియ్యక శని వెంటదిరుగు
భూమి క్రొత్తదైన భోక్తలు క్రొత్తలా
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# సిద్ధరామయ్య మౌనంగా ఉంటారా?

తన సోషలిస్టు భావ జాలంతో కాంగ్రెస్ పార్టీలో ఇమిడి, చక్రం తిప్పిన నేత సిద్ధరామయ్య అన్నది కాదనలేని వాస్తవం. ముఖ్యమంత్రి పదవిని అధిష్టించడమే ఆయన ఉనికికి ప్రధాన కారణం. ఒకవేళ ఆయన్ను 2013లో పక్కన పెట్టి ఉంటే, అప్పుడే ఆయన పార్టీని చీల్చి, పూర్తి అరాచకాన్ని సృష్టించే వారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో చిరకాల యోధుడైన మల్లికార్జున్ ఖర్గేకు కూడా ముఖ్యమంత్రి అయ్యే అవకాశం దక్కలేదు. మధ్యంతర మార్పులు, తీవ్రమైన అధికార పోరాటాలకు కేంద్రంగా ఉండే కర్ణాటక రాష్ట్రంలో ఇది ఒక అరుదైన విషయం. తొలిసారి, సిద్ధరామయ్య ఐదేళ్లపాటు తిరుగులేని ముఖ్యమంత్రిగా, అధికార కేంద్రంగా కొనసాగారు. తన ఐదేళ్ల పదవీకాలం తర్వాత 2018లో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైనప్పటికీ, సిద్ధరామయ్య తన దూకుడు వైఖరిని వీడలేదు. భారతీయ జనతా పార్టీ (బిజెపి)ని అధికారానికి దూరంగా ఉంచడమే ఏకైక లక్ష్యంగా, జనతా దళ్ (సెక్యులర్) (జెడి-ఎస్)తో పొత్తు పెట్టుకుని, హెచ్.డి. కుమారస్వామిని ముఖ్యమంత్రిగా పీఠమెక్కించేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఆయనను బుజ్జగించాల్సి వచ్చింది, ఒత్తిడి కూడా తీసుకురావాల్సి వచ్చింది. వాస్తవానికి, ఈ ఏర్పాటుకు ఆయన తీవ్ర వ్యతిరేకి. హెచ్.డి. దేవెగౌడతో ఏర్పడిన తీవ్ర విభేదాల కారణంగా 2005లోనే ఆయన జెడి-ఎస్ నుండి బయటకు వచ్చి కాంగ్రెస్‌లో చేరారు. 2019 పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే, ఆ పొత్తు కూలిపోవడాన్ని సిద్ధరామయ్య ప్రత్యక్షంగా చూశారు. బహుశా ఆ కూటమి పతనానికి ఆయనే పరోక్షంగా సహకరించి ఉండవచ్చు కూడా. ఆ తర్వాత కాంగ్రెస్, జెడి-ఎస్ఎమ్మెల్యేలు, సిద్ధరామయ్యకు నమ్మకస్తులైన అనేకులు మూకుమ్మడిగా రాజీనామా చేసి బిజెపిలో చేరడంతో, బి.ఎస్. యడియూరప్ప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడానికి మార్గం సుగమమైంది.

ఈ క్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా డి.కె. శివకుమార్ (లేదా డికెఎస్) ప్రాభవం పెరుగుతున్నప్పటికీ, ఆయన కాంగ్రెస్ పార్టీలో తన పట్టును నిలుపుకుని, ప్రతిపక్ష నాయకుడిగా తన స్థానాన్ని కాపాడుకున్నారు. ఆ తర్వాత, 2023లో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకమైన ప్రజా తీర్పుతో తిరిగి అధికారంలోకి వచ్చినప్పుడు, ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ తీవ్ర స్థాయికి చేరిన వేళ, సిద్ధరామయ్య మరోసారి పైచేయి సాధించారు. కర్ణాటక రాజకీయాల్లో, ఒక మాజీ ముఖ్యమంత్రి ఓటమి తర్వాత మళ్ళీ ఇంత ఘనంగా పునరాగమనం సాధించడం ఒక అరుదైన ఘనత. కాగా, కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నాయకత్వం శివకుమార్ వెనుక ఏకమైంది. వారు సిద్ధరామయ్య నుండి పదవీకాలం మధ్యలో నాయకత్వ మార్పు ఉంటుందనే అంగీకారాన్ని రాబట్టడమే కాకుండా, ఆ ఒప్పందం కచ్చితంగా అమలయ్యేలా చూశారు. 2013 నుండి 2018 మధ్యకాలంలో తనకు లభించినట్లుగా, ఈ పదవీకాలం ఆరంభం నుండే సిద్ధరామయ్యకు ఎటువంటి అప్రతిహతమైన అధికారం గానీ, సంపూర్ణ నియంత్రణ గానీ లభించదని స్పష్టమైంది. పాత అలవాట్లు అంత సులభంగా పోవు. ఆయన పదవి నుంచి వైదొలుగుతున్నప్పుడు, వయసు పైబడినప్పటికీ, నిశ్శబ్దంగా పదవీ విరమణ చేసిన ఒక పెద్ద రాజకీయవేత్త పాత్రను పోషిస్తారని కొద్దిమందే ఆశిస్తున్నారు. ఆయన ఒక దృఢమైన, క్షేత్రస్థాయి సోషలిస్టుగానే మిగిలిపోయారు. వాస్తవానికి గందరగోళానికి భయపడకుండా, దానిలోనే రాణించే ఒక అరాచకవాది. సిద్ధరామయ్య తెరమరుగున పడిపోకుండా, తన ఉనికిని చాటుకుంటారు. పదవి నుంచి వైదొలగిన సిద్ధరామయ్య ఒక అస్థిర శక్తిగా మారే అవకాశాలే ఎక్కువ. రాష్ట్రంలోని అధికార సమీకరణాలను చాలా జాగ్రత్తగా తిరిగి రూపొందించి, పునఃసమతుల్యం చేయవలసి ఉంటుంది. ఈ నాయకత్వ మార్పు కేవలం ముఖ్యమంత్రులను మార్చడం మాత్రమే కాదు, ఇది పాతుకుపోయిన సామాజిక కూటములను విచ్ఛిన్నం చేసి, వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడానికి సంబంధించినది. తన అద్భుతమైన వ్యక్తిత్వానికి అతీతంగా, సిద్ధరామయ్య వెనుకబడిన తరగతులకు అగ్రగామి ప్రతినిధిగా ఉన్నారు. రెండు దశాబ్దాలుగా కర్ణాటకలో కాంగ్రెస్ ఎన్నికల సమీకరణాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. ఆయనను తొలగించి అధికారంలోకి రావడం అంటే, సర్దుబాటు రాజకీయాలకు పేరుగాంచిన ఈ రాష్ట్రంలో అధికార సమీకరణాలను తలకిందులు చేయడమే. 2004 నుండి బి.ఎస్. యడియూరప్పతో కలిసి సిద్ధరామయ్య కర్ణాటక రాజకీయ కథను రచించగా, కుమారస్వామి ఎప్పటి లాగే మూడవ అంకాన్ని పోషించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఒక నిర్మాణాత్మక మార్పుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, చివరి కట్టుబడ్డ సోషలిస్ట్ రాజీనామాతో ఆ రాష్ట్రం ఒక సరికొత్త దశలోకి అడుగుపెడుతున్నట్లు కనిపిస్తోంది.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# "సీబీఎస్ఈ" పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు?

సీబీఎస్ఈ పరీక్షల షెడ్యూల్, విధానాల్లో తరచూ మార్పులు చేయడం కూడా మరో పెద్ద సమస్యగా మారింది. ఒక సంవత్సరం ఒక విధానం, మరో సంవత్సరం మరో విధానం అమలు చేయడం వల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. సిలబస్ తగ్గింపు, పరీక్షా నమూనా మార్పులు, ఇంటర్నల్ అసెస్‌మెంట్ విధానాల్లో అనిశ్చితి విద్యార్థులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. విద్యా విధానంలో స్థిరత్వం లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరింత వెనుకబడుతున్నారు. నగరాల్లో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలు మాత్రం ఈ మార్పులకు తక్షణమే అనుగుణంగా కోచింగ్ వ్యవస్థలను సిద్ధం చేసుకుంటూ లాభపడుతున్నాయి.

దేశంలో విద్యా వ్యవస్థ అంటే ఒకప్పుడు నమ్మకం, క్రమశిక్షణ, పారదర్శకతకు ప్రతీకగా భావించేవారు. ముఖ్యంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పరీక్షలను అత్యంత ప్రమాణాలతో నిర్వహించే వ్యవస్థగా దేశవ్యాప్తంగా గుర్తింపు ఉండేది. కానీ ఇటీవల సంవత్సరాల్లో వరుసగా వెలుగులోకి వస్తున్న ప్రశ్నాపత్రాల లీకులు, మూల్యాంకనంలో లోపాలు, ఫలితాల ఆలస్యం, సాంకేతిక వైఫల్యాలు, విద్యార్థుల మానసిక ఒత్తిడి, అసమానతల ఆరోపణలు వంటి పరిణామాలు ఈ వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యా వ్యవస్థలోనే గందరగోళం, అవ్యవస్థ, నిర్లక్ష్యం చోటుచేసుకోవడం కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు, ఇది కోట్లాది విద్యార్థుల జీవితాలతో జరుగుతున్న ప్రమాదకర ప్రయోగంగా మారింది.

సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణపై వచ్చిన విమర్శల్లో ప్రధానంగా ప్రశ్నాపత్రాల భద్రత అంశం పెద్ద చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లలో పదేపదే పేపర్ లీక్ ఆరోపణలు రావడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పరీక్షలకు నెలల తరబడి కష్టపడి చదివిన విద్యార్థులు పరీక్ష రోజు తమ కృషి విలువ కోల్పోతుందనే భయంతో మానసికంగా కుంగిపోతున్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రశ్నాపత్రాలు ముందుగానే వైరల్ అవుతున్నాయనే వార్తలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి. ఈ పరిస్థితి పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీస్తోంది. ఒక దేశంలో అత్యున్నత విద్యా బోర్డు కూడా ప్రశ్నాపత్రాలను రక్షించలేకపోతే, ఆ ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యంపై ప్రజలు ఎలా నమ్మకం ఉంచగలరు అనే ప్రశ్న తలెత్తుతోంది.

ఇక మూల్యాంకన విధానంలో ఉన్న లోపాలు విద్యార్థులను మరింత అసహనానికి గురిచేస్తున్నాయి. చాలా మంది విద్యార్థులు తాము బాగా రాసినా అనుకున్న మార్కులు రాకపోవడం, రీ-వాల్యుయేషన్ తర్వాత భారీ తేడాలు బయటపడడం వంటి ఉదాహరణలు తరచూ కనిపిస్తున్నాయి. కొంతమంది విద్యార్థులకు ఒకే సమాధానానికి వేర్వేరు మార్కులు రావడం, అంతర్గత మార్కుల విషయంలో పాఠశాలల మధ్య అసమానతలు ఉండడం విద్యా వ్యవస్థలో సమానత్వం లేదనే భావనకు కారణమవుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రతిభకు నిజమైన గుర్తింపు దక్కడం లేదని అనేక మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ యుగం పేరుతో కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో సాంకేతిక వ్యవస్థలను విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ, వాటి అమలులో ఉన్న లోపాలు విద్యార్థులకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. ఫలితాల విడుదల సమయంలో అధికారిక వెబ్‌సైట్లు పనిచేయకపోవడం, అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ కాకపోవడం, సర్వర్లు క్రాష్ అవడం వంటి సమస్యలు ప్రతి సంవత్సరం పునరావృతమవుతున్నాయి. దేశాన్ని "డిజిటల్ ఇండియా"గా మార్చుతున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ప్రాథమిక సాంకేతిక సదుపాయాలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సాంకేతికతను విద్యార్థుల సౌలభ్యం కోసం కాకుండా ప్రచార సాధనంగా మార్చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీబీఎస్ఈ పరీక్షల షెడ్యూల్, విధానాల్లో తరచూ మార్పులు చేయడం కూడా మరో పెద్ద సమస్యగా మారింది. ఒక సంవత్సరం ఒక విధానం, మరో సంవత్సరం మరో విధానం అమలు చేయడం వల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. సిలబస్ తగ్గింపు, పరీక్షా నమూనా మార్పులు, ఇంటర్నల్ అసెస్‌మెంట్ విధానాల్లో అనిశ్చితి విద్యార్థులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. విద్యా విధానంలో స్థిరత్వం లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరింత వెనుకబడుతున్నారు. నగరాల్లో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలు మాత్రం ఈ మార్పులకు తక్షణమే అనుగుణంగా కోచింగ్ వ్యవస్థలను సిద్ధం చేసుకుంటూ లాభపడుతున్నాయి. దీంతో విద్యా రంగంలో అసమానతలు మరింత పెరుగుతున్నాయి.



కోవిడ్ తర్వాత విద్యార్థుల మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఆ అంశాన్ని పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. పరీక్షల ఒత్తిడి, మార్కుల పోటీ, ప్రవేశ పరీక్షల భయం వల్ల విద్యార్థుల్లో ఆందోళన, నిరాశ, ఆత్మహత్యల ప్రవణత పెరుగుతున్నాయని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ విద్యార్థులకు కౌన్సెలింగ్ సదుపాయాలు, భావోద్వేగ సహాయం, పరీక్షా ఒత్తిడి నిర్వహణ వంటి అంశాల్లో సరైన చర్యలు కనిపించడం లేదు. విద్యను మానవీయ దృక్పథంతో చూడకుండా కేవలం ర్యాంకులు, శాతాలు, పోటీ మార్కెట్ కోణంలోనే ప్రభుత్వం చూస్తోందనే విమర్శలు బలపడుతున్నాయి. సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో ప్రైవేటీకరణ ప్రభావం కూడా పెరుగుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోచింగ్ సెంటర్ల ఆధిపత్యం, కార్పొరేట్ పాఠశాలల వ్యాపార ధోరణి వల్ల సాధారణ కుటుంబాలకు విద్య భారం అవుతోంది. పరీక్షల విధానం కూడా కోచింగ్ ఆధారితంగా మారుతోందనే విమర్శలు ఉన్నాయి. గ్రామీణ విద్యార్థులు, పేద కుటుంబాల పిల్లలు, ప్రాంతీయ భాషా మాధ్యమ విద్యార్థులు ఈ పోటీలో వెనుకబడుతున్నారు. సమాన విద్యా అవకాశాలను కల్పించాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ విద్యా వ్యవస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా కోవిడ్ తర్వాత విద్యార్థుల మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఆ అంశాన్ని పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. పరీక్షల ఒత్తిడి, మార్కుల పోటీ, ప్రవేశ పరీక్షల భయం వల్ల విద్యార్థుల్లో ఆందోళన, నిరాశ, ఆత్మహత్యల ప్రవణత పెరుగుతున్నాయని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ విద్యార్థులకు కౌన్సెలింగ్ సదుపాయాలు, భావోద్వేగ సహాయం, పరీక్షా ఒత్తిడి నిర్వహణ వంటి అంశాల్లో సరైన చర్యలు కనిపించడం లేదు. విద్యను మానవీయ దృక్పథంతో చూడకుండా కేవలం ర్యాంకులు, శాతాలు, పోటీ మార్కెట్ కోణంలోనే ప్రభుత్వం చూస్తోందనే విమర్శలు బలపడుతున్నాయి. సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో ప్రైవేటీకరణ ప్రభావం కూడా పెరుగుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోచింగ్ సెంటర్ల ఆధిపత్యం, కార్పొరేట్ పాఠశాలల వ్యాపార ధోరణి వల్ల సాధారణ కుటుంబాలకు విద్య భారం అవుతోంది. పరీక్షల విధానం కూడా కోచింగ్ ఆధారితంగా మారుతోందనే విమర్శలు ఉన్నాయి. గ్రామీణ విద్యార్థులు, పేద కుటుంబాల పిల్లలు, ప్రాంతీయ భాషా మాధ్యమ విద్యార్థులు ఈ పోటీలో వెనుకబడుతున్నారు. సమాన విద్యా అవకాశాలను కల్పించాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ విద్యా వ్యవస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

విద్యార్థుల నిరసనలు, తల్లిదండ్రుల ఆందోళనలు, విద్యావేత్తల విమర్శలు పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తరచూ సమస్యలను చిన్నచూపు చూస్తోందనే భావన ఉంది. తప్పిదాలు జరిగినప్పుడల్లా "దర్యాప్తు చేస్తాం", "వ్యవస్థను బలోపేతం చేస్తాం" అనే ప్రకటనలు అయితే వస్తున్నాయి కానీ, ఆచరణలో పెద్ద మార్పులు ఏమీ కనిపించడం లేదు. బాధ్యత వహించాల్సిన అధికారులు అరుదుగా మాత్రమే జవాబుదారీతనం స్వీకరిస్తున్నారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత, సమానత్వం లేకుండా కేవలం ప్రకటనలు, ప్రచారాలతో విద్యార్థుల విశ్వాసాన్ని తిరిగి పొందడం సాధ్యం కాదు. ఒక దేశ భవిష్యత్తు అక్కడి విద్యార్థుల చేతుల్లో ఉంటుంది. అలాంటి విద్యార్థుల జీవితాలను పరీక్షల అవ్యవస్థతో అనిశ్చితిలోకి నెట్టడం అత్యంత ప్రమాదకర విషయం. సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణపై వస్తున్న విమర్శలు కేవలం ఒక బోర్డుపై అసంతృప్తి మాత్రమే కాదు. అవి దేశ విద్యా పరిపాలనలో పెరుగుతున్న సంక్షోభానికి సంకేతం. విద్యను హక్కుగా కాకుండా మార్కెట్ వస్తువుగా మార్చిన విధానాలు, ప్రచార రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చిన పరిపాలనా వైఖరి, ప్రాథమిక సమస్యలను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ఇవన్నీ కలిసి ఈ పరిస్థితిని తీసుకొచ్చాయి. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వ్యవస్థపై సమాజం ప్రశ్నించాల్సిన సమయం ఇది. లేకపోతే పరీక్షల భయం మాత్రమే కాదు, మొత్తం విద్యా వ్యవస్థపైనే యువత నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్

## నాగేశ్వర్ గొంతు నొక్కడం సబబేనా?

తెలుగు రాష్ట్రాల సామాజిక, రాజకీయ యవనికపై 'ప్రొఫెసర్ కె. నాగేశ్వర్' ఒక నిష్పాక్షిక గొంతుక. జర్నలిస్టుగా, విద్యావేత్తగా, మాజీ శాసనమండలి సభ్యుడిగా దశాబ్దాలుగా ఆయన ప్రజాపక్షం వహిస్తూ, పాలకుల విధానాలను నిశితంగా విశ్లేషిస్తున్నారు. ఏ రాజకీయ పార్టీకీ లొంగని, రాజీపడని మేధావిగా ఆయనకు సమాజంలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. అయితే, ఇటీవల ఒక టీవీ విశ్లేషణలో ఆయన చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, నమోదైన పోలీసు కేసులు కేవలం ఒక వ్యక్తిని టార్గెట్ చేయడం మాత్రమే కాదు, మొత్తం మేధో సమాజం యొక్క ప్రశ్నించే హక్కుపై సాగుతున్న దాడిగా పరిగణించాల్సి ఉంది. నాగేశ్వర్ గొంతు నొక్కడం అంటే.. ఖచ్చితంగా సమాజం కళ్ళు పొడవడమే..! అయితే వివాదానికి మూలం ఈ నెల(మే నెల)లో జరిగిన ఒక టీవీ చర్చ. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారని, మాజీ సీఎం వైఎస్ జగన్‌ను అరెస్ట్ చేయాల్సిందిగా కోరగా.. అమిత్ షా తిరస్కరించారనే సమాచారాన్ని నాగేశ్వర్ ప్రస్తావించారు. దీనిపై జనసేన పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో, ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎంతో ఉన్నతమైన విలువలను ప్రదర్శించారు. ఏమాత్రం అహంకారానికి పోకుండా "నా వ్యాఖ్యలను పూర్తిగా బేషరతుగా ఉపసంహరించుకుంటున్నాను" అని లైవ్ టీవీలోనే ప్రకటించారు. ఒక సీనియర్ విశ్లేషకుడు ఇంతకంటే ప్రజాస్వామ్యబద్ధంగా ఎలా స్పందించగలరు..? నాగేశ్వర్ ప్రకటనను మొదట జనసేన పార్టీ నాయకత్వం స్వాగతించి, వివాదాన్ని ముగించినట్లే కనిపించింది. కానీ క్షేత్రస్థాయిలో సీన్ పూర్తిగా మారిపోయింది. భారతీయ న్యాయ సంహిత (BNS) లోని తీవ్రమైన సెక్షన్ల కింద పలు చోట్ల వరుసగా కేసులు నమోదు చేశారు. ఇది చాలదన్నట్లు, రాజమండ్రి సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ "చర్యకు ప్రతిచర్య ఉంటుంది, కర్మ ఎవరినీ వదలదు" అని చేసిన వ్యాఖ్యలు ప్రొఫెసర్‌ను నేరుగా లక్ష్యంగా చేసుకుని చేసినవేనని మేధావులంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. ఒక ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి, చర్చల్లో వచ్చిన మాటలను మనసులో పెట్టుకుని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ కక్షసాధింపును స్పష్టం చేస్తోంది. ఇక ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయడానికి ఏపీ పోలీసులు హైదరాబాద్ వస్తున్నారనే తీవ్రమైన ఊహాగానాలు చెలరేగాయి. పరిస్థితి ఎంతవరకు వెళ్లిందంటే, తెలంగాణ పోలీసులు ఆయన నివాసానికి, స్టూడియోలకు భద్రత కల్పించాల్సిన పరిస్థితి వచ్చింది. ఏపీ హోంమంత్రిత్వ శాఖ దీనిపై వివరణలు ఇచ్చుకుంటున్నప్పటికీ, భయాందోళనలు సృష్టించడమే పాలకుల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ అణచివేత వైఖరిపై తెలుగు సమాజం ఒక్కటై గర్జిస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు "నేను ముందస్తు బెయిల్ అడగను, అరెస్ట్‌కు సిద్ధంగా ఉన్నాను, జీవితంలో జైలు అనుభవం ఒక్కటే లేదు.. దాన్ని కూడా చూస్తాను" అంటూ నాగేశ్వర్ పాలకుల అహంకారానికి ధీటైన సవాల్ విసిరారు. అయితే ప్రజాస్వామ్యంలో విమర్శ అనేది పాలకులను సరిదిద్దే ఒక అద్భుతమైన ఔషధం. అధికార గర్వంతో విమర్శించే గొంతుకలను నొక్కేయాలని చూస్తే, చరిత్రలో ఏ పాలకుడికీ మంచి రోజులు రాలేదు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై పెట్టిన అక్రమ కేసులను ఏపీ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.

రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్

## చెమ్మ తాకిన ఏకాంతం

వెన్నెల దిగే సాయంకాలంలో
విరహ గీతమొకటి
రాసుకుంటున్నాను –

నిద్ర లేవక ముందే
ఇంటి ఆవరణలోని
లేత మొక్కలు
ఇంకొన్ని చెట్లు
నన్ను తట్టి లేపుతాయి –



వాటిని ఉదయమొకసారి
తడమందే
కాలం అడుగేయనీయదు –

వెన్నెల రాలేదు
చినుకులు రాలాయి
విరహం నేలదీ ,
మొక్క దీ
చెట్టు దీ
నాదీ –



వాటి శ్వాసల్లో
నన్ను నేను ఇంకా
వెతుక్కుంటూనే
ఉన్నాను !

మండాది గోపీనాథ్
ముక్కుడు దేవులపల్లి
98850 45344

# బట్టీ చదువుల నుంచి బతుకు చదువుల వైపు

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత ఆశాజనకమైన దేశం. దీనికి కారణం ఇక్కడ ఉన్న అపారమైన యువశక్తి. ప్రపంచ దేశాలన్నీ వృద్ధాప్యంతో తలమునకలవుతుంటే, మన దేశం సగటున 28 ఏళ్ల వయస్సున్న యువతతో ఉరకలేస్తోంది. కానీ, ఈ 'జనాభా డివిడెండ్' మనకు వరంగా మారాలంటే ఆ యువత చేతిలో తగిన ఉపాధి ఉండాలి. దురదృష్టవశాత్తూ, ఏటా లక్షల మంది పట్టభద్రులు కళాశాలల నుండి బయటకు వస్తున్నా, వారిలో పరిశ్రమలకు అవసరమైన కనీస నైపుణ్యాలు ఉండటం లేదని 'ఇండియా స్కిల్స్ రిపోర్ట్' వంటి గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. ఒకవైపు ఉద్యోగాలు లేవని నిరుద్యోగులు, మరోవైపు సరైన అభ్యర్థులు దొరకడం లేదని కంపెనీలు వాపోతున్నాయి. ఈ వైరుధ్యాన్ని పూడ్చడమే నేటి విద్యా వ్యవస్థ ముందున్న అసలైన సవాలు.

### నూతన విద్యా విధానం సంస్కరణల దిశగా

దశాబ్దాల కాలం నాటి పాత విద్యా పద్ధతులకు స్వస్తి పలికి, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నూతన విద్యా విధానం-2020' విద్యా రంగంలో ఒక విప్లవాత్మక మార్పుగా చెప్పవచ్చు. గతంలో విద్యా వ్యవస్థ కేవలం మార్కుల వేటను, బట్టీ పద్ధతులను ప్రోత్సహించేది. కానీ కొత్త విధానం నైపుణ్య ఆధారిత విద్య కు పెద్ద పీట వేస్తోంది. 6వ తరగతి నుంచే వృత్తి విద్యను పరిచయం చేయడం వల్ల విద్యార్థికి పుస్తక జ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి పనితీరుపై అవగాహన పెరుగుతుంది. సృజనాత్మకతకు, విమర్శనాత్మక ఆలోచనకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే విద్యార్థులు కేవలం 'ఉద్యోగాల కోసం వెతికే వారు' గా కాకుండా, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కర్తలుగా ఎదుగుతారు.

### మారుతున్న కెరీర్ పోకడలు - డిజిటల్ విప్లవం

ఒకప్పుడు ఇంజనీరింగ్, మెడిసిన్ అంటేనే



నేటి విద్యా రంగంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' ఒక అనివార్య శక్తిగా మారింది. చాట్ జీపీటీ వంటి ఏఐ టూల్స్ వల్ల సమాచార సేకరణ క్షణాల్లో సాధ్యమవుతోంది. వ్యక్తిగత అభ్యాసం లో ఇది ఎంతో తోడ్పడుతుంది. అయితే, ప్రతి నాణేనికి రెండు పార్శ్వాలు ఉన్నట్లుగానే ఏఐ వల్ల కొన్ని ప్రమాదాలు కూడా ఉన్నాయి. విద్యార్థుల్లో సొంతం గా ఆలో చించే శక్తి తగ్గడం, అసైన్ మెంట్ల కోసం కేవలం ఏఐపై ఆధారపడటం వల్ల సృజనాత్మకత మందగిస్తోంది. విద్యా సంస్థలు ఏఐని నిషేధించడం కంటే, దానిని నైతికంగా ఎలా వాడుకోవాలో నేర్పించాలి.

గౌరవప్రదమైన కెరీర్ అనే ముద్ర ఉండేది. కానీ డిజిటల్ విప్లవం ఆ గీతలను తుడిచివేసింది. నేడు డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, లాజిస్టిక్స్ మరియు కంటెంట్ క్రియేషన్ వంటి రంగాల్లో లక్షలాది అవకాశాలు ఉన్నాయి. సంప్రదాయ కోర్సులు చేసిన వారు కూడా అదనపు నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా కార్పొరేట్ రంగంలో రాణిస్తున్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు కేవలం సిలబస్‌ను కంఠస్థం చేయకుండా, వర్తమాన అంశాలను విశ్లేషించే శక్తిని పెంపొందించుకోవాలి. నేటి కాలంలో ఒక డిగ్రీతో జీవితం స్థిరపడుతుందని అనుకోవడం భ్రమ. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ప్రతి ఐదేళ్లకోసారి మనల్ని మనం పునరుద్ధరించుకోవడం తప్పనిసరి.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ :** నేటి విద్యా రంగంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' ఒక అనివార్య శక్తిగా మారింది. చాట్ జీపీటీ వంటి ఏఐ టూల్స్ వల్ల సమాచార సేకరణ క్షణాల్లో సాధ్యమవుతోంది. వ్యక్తిగత అభ్యాసంలో ఇది ఎంతో తోడ్పడుతుంది. అయితే, ప్రతి నాణేనికి రెండు పార్శ్వాలు ఉన్నట్లుగానే ఏఐ వల్ల కొన్ని ప్రమాదాలు కూడా ఉన్నాయి. విద్యార్థుల్లో సొంతం గా ఆలో చించే శక్తి తగ్గడం, అసైన్ మెంట్ల కోసం కేవలం ఏఐపై ఆధారపడటం వల్ల సృజనాత్మకత మందగిస్తోంది. విద్యా సంస్థలు ఏఐని నిషేధించడం కంటే, దానిని నైతికంగా ఎలా వాడుకోవాలో నేర్పించాలి. యంత్రం మనిషి మెదడుకు సహాయకారిగా ఉండాలే తప్ప, అది మన ఆలోచనా శక్తికి ప్రత్యామ్నాయం కాకూడదు. నిరుద్యోగం అనేది కేవలం అవకాశాలు లేకపోవడం వల్ల వచ్చేది కాదు, 'అర్హత ఉన్నా నైపుణ్యం లేకపోవడం' (Un-employability) వల్ల వచ్చేది. దీనిని ఎదుర్కోవడానికి నాలుగు ప్రధాన మార్గాలు ఉన్నాయి. పరిశ్రమ - విద్యాసంస్థల అనుసంధానం: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కళాశాలల పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు ఆధునీకరించాలి. కంపెనీ ప్రతినిధులు కాలేజీలకు వచ్చి పాఠాలు చెప్పే సంస్కృతి పెరగాలి. **ఇంటర్న్‌షిప్స్:** ప్రతి విద్యార్థి తన కోర్సు కాలంలో కనీసం ఆరు నెలల పాటు క్షేత్రస్థాయి పని అనుభవాన్ని గడించాలి. ప్రభుత్వ ప్రోత్సాహకాలు: చిన్న తరహా పరిశ్రమలకు, స్టార్టప్‌లకు ప్రభుత్వాలు మరిన్ని రాయితీలు ఇవ్వడం ద్వారా స్థానిక ఉపాధి పెరుగుతుంది. సాంకేతిక విద్య గ్రామీణీకరణ: నగరాలకే పరిమితమైన ఆధునిక సాంకేతిక కోర్సులను గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లాలి. విద్య అంటే కేవలం పరీక్షలు రాయడం, సర్టిఫికెట్లు సంపాదించడం కాదు. అది ఒక మనిషిని సంపూర్ణ జ్ఞానిగా, ఆత్మవిశ్వాసం గల పౌరుడిగా మార్చాలి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే డిగ్రీ పట్టాతో పాటు 'నైపుణ్యం' అనే ఆయుధం తప్పనిసరి. ప్రభుత్వాలు, విద్యా సంస్థలు, విద్యార్థులు సమన్వయంతో అడుగులు వేసినప్పుడే నిరుద్యోగమనే చీకటి తొలగిపోతుంది. అప్పుడే భారతదేశం నిజమైన 'విశ్వగురువు'గా అవతరిస్తుంది.



కాళేశ్వరం కృష్ణమూర్తి
9705196097



# జాతీయం-అంతర్జాతీయం





## జెఫ్ బెజోస్ సంస్థ 'బ్లూ ఆరిజిన్' పరీక్షా వేదిక వద్ద పేలిపోయిన రాకెట్

**వుదయం డెస్క్, మే 2**

9ః అమెరికాలోని ఫ్లోరిడాలోని కేప్ కెనవరల్‌లో గురువారం నాడు బ్లూ ఆరిజిన్‌కు చెందిన న్యూ గ్లెన్ రాకెట్ పేలిపోయింది. ప్రయోగ వేదిక నుంచి అంతరిక్షంలోకి పంపేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని బ్లూ ఆరిజిన్ సంస్థ తెలిపింది. ఆ ప్రదేశాన్ని ఒక భారీ అగ్నిగోళం కబళించడానికి కొన్ని క్షణాల ముందు, ఆ భారీ రాకెట్ కింద నుండి దట్టమైన పొగ పైకి లేస్తున్న దృశ్యాలు నాటకీయంగా కనిపించాయి. జెఫ్ బెజోస్ దీనిని చాలా కష్టమైన రోజుగా అభివర్ణించి, కంపెనీని పునర్నిర్మించి, కార్యకలాపాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. బ్లూ ఆరిజిన్ అంతరిక్ష కార్యక్రమానికి ఎదురైన ఈ తాజా ఎదురుదెబ్బ వెనుక కారణాన్ని నిర్ధారించడానికి దర్యాప్తు అధికారులు కృషి చేస్తుండగా, నాసా, ఎఫ్ఎఎ అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.ఆ ఏరోస్పేస్ కంపెనీ తరువాత ఎక్స్‌పై పోస్ట్ చేసిన ఒక ప్రకటనలో ఈ సంఘటనను ధృవీకరించింది. నేడు, హాట్ ఫైర్ పరీక్ష సమయంలో మేం ఒక అసాధారణ పరిస్థితిని ఎదుర్కొన్నాం, అని కంపెనీ పేర్కొంది, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారు అని కూడా తెలిపింది.ఎవరికీ ఎటువంటి గాయాలు సంభవించలేదని తెలుస్తోంది. అత్యవసర ప్రతిస్పందన బృందాలు వెంటనే ప్రయోగ సముదాయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.

రాకెట్ పేలుడు తర్వాత జెఫ్ బెజోస్ స్పందనబ్లూ ఆరిజిన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ఈ పేలుడు ఘటన జరిగిన కొద్దిసేపటికే స్పందిస్తూ, తమ కంపెనీ ఒక క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొందని అంగీకరించారు, కానీ అభివృద్ధి ప్రయత్నాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. మూల కారణం తెలుసుకోవడానికి చాలా తొందరగా ఉంది, మేం దానిని కనుగొనడానికి ఇప్పటికే కృషి చేస్తున్నాం," అని బెజోస్ ఎక్స్‌పై పోస్ట్ చేశారు.ఇది చాలా కష్టమైన రోజు, కానీ పునర్నిర్మించాల్సిన వాటిని పునర్నిర్మించి, తిరిగి ప్రయాణాలను ప్రారంభిస్తాం. ఇది విలువైనదే అని అన్నారు.దాదాపు 98 మీటర్ల (321 అడుగుల) ఎత్తు ఉన్న న్యూ గ్లెన్ రాకెట్, బ్లూ ఆరిజిన్ దీర్ఘకాలిక వాణిజ్య అంతరిక్ష, చంద్రుని ఆశయాలకు కేంద్రంగా పరిగణనలోకి తీసుకునేవారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరం అన్న ఎలాన్ మస్క్స్పేస్ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ కూడా ఈ విఫలమైన పరీక్షపై బహిరంగంగా స్పందించారు. ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమలో ప్రత్యక్ష పోటీదారు అయినప్పటికీ, మస్క్ ఈ ప్రమాదం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన ఈ పేలుడును అత్యంత దురదృష్టకరంగా అభివర్ణించారు.

భారీ రాకెట్ల అభివృద్ధిలో ఉండే అధిక ప్రమాద స్వభావాన్ని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. ఇక్కడ సాధారణ భూతల పరీక్షలు కూడా విపత్కర వైఫల్యాలకు దారితీయవచ్చు అని ఆయన అన్నారు.

పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్న నాసా ఈ పేలుడు వెంటనే ప్రభుత్వ, అంతరిక్ష అధికారుల దృష్టిని ఆకర్షించింది. ఈ ప్రమాదం గురించి తాను నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్‌తో మాట్లాడినట్లు ఫ్లోరిడా కాంగ్రెస్ సభ్యుడు మైక్ హారిడోపోలోస్ తెలిపారు.

ఎవరికీ గాయాలైనట్లు నివేదికలు లేనందుకు నేను కృతజ్ఞుడను. అలాగే, వేగంగా స్పందించిన తొలి స్పందనదారులు, ఇంజనీర్లు మరియు ప్రయోగ సిబ్బందికి ధన్యవాదాలు" అని హారిడోపోలోస్ ఎక్స్‌పై పోస్ట్ చేశారు.

ఆధునిక అంతరిక్ష యాన కార్యక్రమాలు ఎంత సవాలుతో కూడుకున్నవో నొక్కిచెబుతూ, ఐజాక్‌మన్ కూడా ఈ సంఘటనను అంగీకరించారు.

## రిజర్వ్ చేసిన మూడు నెలల్లోపు తీర్పును వెలువరించాలని హైకోర్టులను ఆదేశించిన సుప్రీం



**న్యూఢిల్లీ, మే 29(ఎ.ఎం.ఎస్):** తీర్పులను రిజర్వ్ చేసిన మూడు నెలల్లోగా అన్ని హైకోర్టులు తీర్పులను వెలువరించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. తీర్పులు వెలువరించడంలో జాప్యం వ్యాజ్యదారులకు పూడ్చలేని నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొంది.

వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయాలలో వేగవంతమైన నిర్ణయాల ఆవశ్యకతను నొక్కిచెబుతూ, బెయిల్ పిటిషన్లపై ఆదర్శవంతంగా అదే రోజున తీర్పు ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒకవేళ ఉత్తర్వులను రిజర్వ్ చేస్తే, వాటిని మరుసటి రోజుకల్లా ప్రకటించి, అప్‌లోడ్ చేయాలి.బెయిల్ మంజూరు చేసే లేదా శిక్షలను నిలిపివేసే ఉత్తర్వులను జైలు అధికారులకు తక్షణమే తెలియజేయాలని, విచారణలో ఉన్న ఖైదీని లేదా దోషిని వీలైతే అదే రోజు లేదా గరిష్టంగా మరుసటి రోజు విడుదల చేయాలని కూడా సుప్రీంకోర్టు పేర్కొంది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అసాధారణ అధికారాలను వినియోగించుకుంటూ, తీర్పులోని ప్రధాన భాగాన్ని మాత్రమే వెలువరించినట్లయితే, కారణాలతో కూడిన తీర్పును 15 రోజుల్లోగా అప్‌లోడ్ చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది.తీర్పును రిజర్వ్ చేసిన నాలుగు నెలల్లోగా వెలువరించని పక్షంలో, ఆ విషయాన్ని మరో బెంచ్‌కు అప్పగించమని కోరుతూ కక్షిదారులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు ఆదేశించింది.

బహిరంగ కోర్టులో కారణాలతో కూడిన తీర్పును వెలువరించినప్పుడు, ఆ తీర్పును 24 గంటల్లోగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ధర్మాసనం పేర్కొంది.తాము జారీ చేసిన ఆదేశాల ఉద్దేశ్యం ఏ ఒక్క న్యాయమూర్తిపైన గానీ, హైకోర్టు తీర్పుపైన గానీ నిందలు వేయడం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## మళ్ళీ ఢిల్లీ చేరుకున్న సిద్దరామయ్య

**4 రోజుల్లో రెండో పర్యటన**



**న్యూఢిల్లీ, మే 29(ఎ.ఎం.ఎస్):** కాంగ్రెస్ నాయకుడు సిద్ధరామయ్య మరోసారి ఢిల్లీలో ఉన్నారు. గత వారం ఆయన రాజధానికి వచ్చినప్పుడు, ఆయన ఇంకా కర్ణాటక ముఖ్యమంత్రిగానే ఉన్నారు. అయితే ఈసారి, ఆయన పదవీ విరమణ చేస్తున్న ముఖ్యమంత్రిగా పర్యటిస్తున్నారు. ఆయన గురువారం రాజీనామా చేశారు.హైకమాండ్ ఆదేశాల మేరకే రాజీనామా చేశాను: సిద్ధరామయ్యసిద్ధరామయ్య స్వయంగా వెల్లడించిన వివరాల ప్రకారం, పార్టీ హైకమాండ్ తనను ఏం చేయమని కోరిందో, ఆ పనినే ఆయన చేశారు. మంగళవారం నాడు ఆయన జాతీయ రాజధానిలో ఉన్నప్పుడు, ఆయన పర్యటన ఉద్దేశంపై అనేక ఊహాగానాలు చెలరేగాయి. అయితే, కేవలం రెండు రోజుల వ్యవధిలోనే ఆ విషయం స్పష్టమైంది. ఢిల్లీలోని కాంగ్రెస్ నాయకత్వాన్ని కలవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం; కర్ణాటక పగ్గాలను కొత్త నాయకుడికి అప్పగించేందుకు మార్గం సుగమం చేయాలని నాయకత్వం ఆయనను కోరింది.గురువారం నాటికి, సిద్ధరామయ్య వారి సూచనను పాటిస్తూ తన రాజీనామాను సమర్పించారు. ఆయన గురువారమే రాజీనామా చేసినప్పటికీ, గవర్నర్ దానిని శుక్రవారం ఉదయం ఆమోదించారు.కర్ణాటక ముఖ్యమంత్రిగా ఒక కొత్త నాయకుడిని పీఠంపైకి తీసుకురావడానికి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నంగా ఈ పరిణామాన్ని ఇప్పుడు పరిగణిస్తున్నారు. కాగా, ఆ నాయకుడు డి.కె. శివకుమార్ అయ్యే అవకాశమే ఎక్కువగా ఉంది. దీనికి సంబంధించి ఇక కేవలం అధికారిక ప్రకటన వెలువడటమే మిగిలి ఉంది.శుక్రవారం నాడు, సిద్ధరామయ్య కాంగ్రెస్ అగ్ర నాయకత్వాన్ని కలిసినప్పుడు, ఆయన వెంట ఆయన కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్య కూడా ఉన్నారు. ఆయన కుమారుడు కర్ణాటక శాసన మండలి సభ్యుడిగా ఉన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు కాబోయే కొత్త మంత్రివర్గంలో తన కుమారుడికి స్థానం కల్పిస్తామని పార్టీ అధిష్టానం నుండి హామీ పొందిన తర్వాతే ముఖ్యమంత్రి రాజీనామా చేశారని భావిస్తున్నారు.రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని పార్టీ యోచిస్తున్న నలుగురు ఉప ముఖ్యమంత్రులలో ఒకరిగా తన కుమారుడు ఉండాలని సిద్ధరామయ్య కోరుకుంటున్నట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే, ఎన్డీటీవీ ఉటంకించిన వర్గాల సమాచారం ప్రకారం, సిద్ధరామయ్య చేసిన ఈ విజ్ఞప్తి డి.కె. శివకుమార్‌కు ఏమాత్రం రుచించలేదు.ఢిల్లీలో కాంగ్రెస్ నాయకులతో సిద్ధరామయ్య భేటీఇదిలా ఉండగా, శుక్రవారం నాడు ఢిల్లీలో సిద్ధరామయ్య పలువురు అగ్రశ్రేణి కాంగ్రెస్ నాయకులను కలిశారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతోనూ, అలాగే పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోనూ ఆయన కరచాలనం చేస్తూ కనిపించారు.అంతే కాకుండా, కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రియాంక్ ఖర్గే, కె.జె. జార్జ్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆయన ఢిల్లీలో డి.కె. శివకుమార్‌ను కూడా కలిశారు.

ఈ సమావేశాల అనంతరం, సిద్ధరామయ్య తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఫోటోలను పోస్ట్ చేశారు. ఆ పోస్ట్‌కు జతచేసిన వ్యాఖ్యలో, ఈ రోజు న్యూఢిల్లీలోని 10 జనపథ్‌లో ఉన్న నివాసంలో, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీతో నేను ఒక ఆత్మీయ సమావేశం జరిపాను, అని ఆయన పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి పదవిని త్యజించి రాజ్యసభ స్థానాన్ని స్వీకరించాలని కాంగ్రెస్ నాయకులు సిద్ధరామయ్యను ఒప్పించేందుకు ప్రయత్నించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కర్ణాటకలో కేవలం ఎమ్మెల్యేగా మాత్రమే కొనసాగాలన్న ఆయన నిర్ణయం నుండి ఆయనను వెనక్కి మళ్ళించేందుకు వారు తమ వంతు కృషి చేశారు.అయితే, రాబోయే రెండేళ్ల పాటు తాను క్రియాశీల రాజకీయాల్లోనే కొనసాగుతానని పదవీ విరమణ చేసిన ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కనీసం రాబోయే రెండేళ్ల పాటు తన నియోజకవర్గమైన వరుణ కోసం పనిచేయడానికి ఆయన సుముఖత వ్యక్తం చేశారు.పార్టీ అధిష్టానం తనకు రాజ్యసభ స్థానాన్ని ఆఫర్ చేసిందని సిద్ధరామయ్య గురువారం తెలిపారు. అయితే, జాతీయ రాజకీయాలపై తనకు ఆసక్తి లేకపోవడంతో ఆయన ఆ ఆఫర్‌ను వినమ్రంగా తిరస్కరించారు.

## నాడు అదృశ్యం.. నేడు స్వామీజీగా ప్రత్యక్షం

**బళ్లారి మే 29(ఎ.ఎం.ఎస్)**

కర్ణాటకలోని బళ్లారికి చెందిన ఓ యువకుడు 20 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఉపాధి కోసం ఆయా రాష్ట్రాలు తిరుగుతూ సుదీర్ఘకాలం ఇంటికి దూరంగా ఉండిపోయిన అతడు.. ఇటీవల స్వగ్రామానికి తిరిగొచ్చాడు. అయితే, కాషాయ దుస్తులు, పొడవాటి గడ్డంతో స్వామీజీ వేషధారణలో దర్శనమివ్వడాన్ని చూసి అతడి తల్లిదండ్రులు, గ్రామస్థులు , చంద్రకళ దంపతుల కుమారుడు శంకర్ ఆచారి. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో 18 ఏళ్ల వయసులోనే ఉపాధిని వెతుక్కుంటూ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తొలుత బెంగళూరు, ఆ తర్వాత ముంబయి నగరాలకు వెళ్లిన ఆచారి.. చివరకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చేరుకున్నాడు. ఈ క్రమంలో ఏళ్లపాటు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో కుటుంబీకులకు అతని ఆచూకీ తెలియకుండా పోయింది. జవాబుదారీతనం ఉండాల్సిందే.. నీట్ పేపర్ లీక్‌పై సుప్రీంహరిద్వార్‌లో దాదాపు ఏడేళ్లపాటు ఆధ్యాత్మిక సాధన చేసిన ఆచారి.. ఓ గురువు మార్గదర్శకంలో సన్యాసాన్ని స్వీకరించాడు.

**ప్రపంచవ్యాప్త విమర్శల నడుమ**

## ఇజ్రాయెల్ పట్ల అసాధారణ ప్రేమ ఉన్న దేశం భారత్ అన్న నెతన్యాహు

**వుదయం డెస్క్, మే 29ః**



ఇతర చోట్ల యూదు దేశాన్ని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, భారతదేశం ఇజ్రాయెల్ పట్ల అసాధారణమైన ప్రేమను చూపిస్తోందని పేర్కొంటూ, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత్‌ను ఒక ప్రధాన ప్రపంచ శక్తిగా అభివర్ణించారు.

గురువారం జోర్డాన్ లోయలో జరిగిన ఒక నాయకత్వ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఇజ్రాయెల్ అంతర్జాతీయ సంబంధాల గురించి చర్చించేటప్పుడు ఆయన భారతదేశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. పెరుగుతున్న దౌత్య సంబంధాల విస్తరణకు, విస్తరిస్తున్న ప్రపంచ భాగస్వామ్యాలకు భారతదేశం ఒక ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు.

పశ్చిమాసియాలో నెలకొన్న సున్నితమైన భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్ బహుముఖంగా భద్రతా సవాళ్లను ఎదుర్కొంటూ, తన సంప్రదాయ మిత్రదేశాలకు అతీతంగా భాగస్వాములతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని చూస్తోంది.మేం మా కూటములను విస్తరిస్తున్నాం, మీరు మాట్లాడుతున్నది ఈ కూటములను ఒక పెద్ద పరిధికి విస్తరించడం గురించే. ఆ విస్తృతమైన పరిధి అనేది, భారతదేశం అనే ఒక మహాశక్తితో మాకున్న విశిష్టమైన సంబంధమే, అని ప్రభుత్వ పత్రికా కార్యాలయం విడుదల చేసిన ఒక వీడియోలో నెతన్యాహు పేర్కొన్నారు.

ఇజ్రాయెల్‌పై వస్తున్న అంతర్జాతీయ విమర్శలను ప్రస్తావిస్తూ, నేను ఒకటి చెబుతాను, ప్రపంచంలోని చాలా దేశాలలో మనం చట్టబద్ధతను కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాం, కానీ భారతదేశంలో కాదు. భారతదేశంలో ఇజ్రాయెల్ పట్ల పిచ్చి ప్రేమ ఉంది, నిజంగా పిచ్చి ప్రేమ. నాకు ఇతర ప్రాంతాల కంటే భారతదేశం నుండే ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉన్నారని నేను భావిస్తున్నాను అని అన్నారు.గతంలో, నెతన్యాహు ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో తనకున్న వ్యక్తిగత సత్సంబంధాలను ప్రస్తావిస్తూ, భారత్‌ఇజ్రాయెల్ మధ్య ఉన్న బలమైన సంబంధాల గురించి మాట్లాడారు.గతంలో చేసిన వ్యాఖ్యలలో, ఆయన భారతదేశాన్ని అపారమైన శక్తివంతమైనదిగా అభివర్ణించి, పలు రంగాలలో పెరుగుతున్న సహకారాన్ని ప్రస్తావించారు.



## మాస్కో భద్రతా ఫోరంలో రష్యా, మయన్మార్ నాయకులను కలిసిన ఎన్ ఎస్ ఎ దోవల్

**వుదయం డెస్క్, మే 29ః**

మాస్కోలో జరిగిన మొట్టమొదటి అంతర్జాతీయ భద్రతా వేదిక, భద్రతా సంబంధిత అంశాలపై ఉన్నత స్థాయి ప్రతినిధుల 14వ సమావేశం సందర్భంగా, భారతదేశ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పలు ఉన్నత స్థాయి ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహించారు.

రష్యన్ ఫెడరేషన్ భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు ఆతిథ్యం వహించిన ఈ వేదిక, బహుళధ్రువ ప్రపంచం ఆవిర్భవిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ భద్రతకు ఎదురవుతున్న సవాళ్లు, ముప్పులపై చర్చించింది. మే 28న, దోవల్ రష్యా ప్రథమ ఉప ప్రధాన మంత్రి డెనిస్ మాంటురోవ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరుపక్షాలు రక్షణ, ఇంధనం, అంతరిక్ష రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించుకున్నాయి. రష్యా జాతీయ అంతరిక్ష కేంద్రం, రోస్కోస్మోస్ (రష్యన్ ప్రభుత్వ అంతరిక్ష సంస్థ) సంయుక్త పరిశ్రమ సమాచార కేంద్రం సందర్శనకు కూడా సౌకర్యం కల్పించింది. అదే సదస్సు సందర్భంగా, మయన్మార్ జాతీయ భద్రతా సలహాదారు టిన్ ఆంగ్ సాన్‌తో కూడా దోవల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భద్రత, రక్షణ, అనుసంధాన రంగాలలో సహకారాన్ని సమీక్షించడంతో పాటు, ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

పొరుగు దేశాలకు ప్రథమ ప్రాధాన్యత విధానం కింద, భారతదేశం తన తూర్పు పొరుగు దేశంతో కొనసాగిస్తున్న సంబంధాలను ఈ సమావేశం ముందుకు తీసుకువెళ్తుంది. బంగాళాఖాత బహుళ రంగాల సాంకేతిక, ఆర్థిక సహకార చొరవ (బిమ్స్టెక్) కూటమికి చెందిన 5వ జాతీయ భద్రతా సలహాదారుల సమావేశం కోసం మయన్మార్ జాతీయ భద్రతా సలహాదారు జూలైలో భారతదేశానికి రానున్నారు.

గురువారం జరిగిన ఈ సదస్సులో ప్రసంగిస్తూ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని జాతీయ భద్రతా సలహాదారు దోవల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన తన సహచర జాతీయ భద్రతా సలహాదారు సెర్గీ షోయిగును కలిశారు, వారు పలు రంగాలలో కొనసాగుతున్న సహకారాన్ని సమీక్షించారు.

న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ ఎన్ ఎస్ ఎ సమావేశంపై కూడా ఇరు పక్షాలు తమ అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నాయి. ఒక అధికారిక ప్రకటన ప్రకారం, మే 28న షోయిగు నిర్వహించిన ఈ సమావేశంలో దోవల్ పాల్గొన్నారు.

సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, బాధ్యతాయుతమైన దేశాలు ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నవారికి మద్దతు ఇవ్వాలా లేక నిర్ణయాత్మక చర్యలతో వారిని ఎదుర్కోవాలా అనే విషయంలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని దోవల్ పేర్కొన్నారు.

పశ్చిమాసియాలోని పరిస్థితులను ప్రస్తావిస్తూ, హోర్ముజ్ జలసంధి, ఎర్ర సముద్రంతో సహా కీలకమైన అంతర్జాతీయ జలమార్గాల ద్వారా వాణిజ్యం సురక్షితంగా, నిరాటంకంగా సాగేలా చూడటం అత్యవసరమని దోవల్ పేర్కొన్నారు.

## భారత రుతుపవనాల అప్‌డేట్

**బలహీనమైన వర్షా లు, వేడి వాతావరణం కొనసాగుతాయని ఐఎమ్‌డి అంచనా**

**న్యూఢిల్లీ, మే 29(ఎ.ఎం.ఎస్)**

భారతదేశం బ2026లో లహీనమైన రుతుపవన కాలాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ సీజన్‌లో కురిసే వర్షపాతం దీర్ఘకాలిక సగటులో (లాంగ్ పీరియడ్ ఆవరేజ్) 90 శాతంగా ఉండనుంది. జూన్ నుండి సెప్టెంబర్ వరకు సాగే రుతుపవన కాలంలో, దేశవ్యాప్తంగా సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యేందుకు 84 శాతం అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.వాతావరణ సూచన వ్యవసాయ క్షేత్రాలు, జలాశయాలు, నగరాలు, ప్రజారోగ్యానికి ఎంతో కీలకం. 1971 నుండి 2020 వరకు సేకరించిన గణాంకాల ఆధారంగా ఉందని ఐఎండి తెలిపింది. సరళంగా చెప్పాలంటే, దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం లోటుగా ఉండే అవకాశం ఉంది. అంతేకాకుండా, జూన్ నెల కూడా బలహీనమైన రీతిలోనే ప్రారంభం కావచ్చు.భారతదేశ రుతుపవనాలు 2026: వర్షపాతం సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉండే అవకాశంఐఎండి తన రెండవ దశ అంచనాలో, భారతదేశ రుతుపవన వర్షపాతం 'దీర్ఘకాలిక సగటుస (ఎల్‌పిఎ)లో 90 శాతంగా ఉండే అవకాశం ఉందని, ఇందులో ప్లస్ లేదా మైనస్ 4 శాతం నమూనా లోపం (మోడల్ ఎర్రర్) ఉండవచ్చని పేర్కొంది. వర్షపాత సంభావ్యతా పట్టిక ప్రకారం, లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతం కాగా, వాయువ్య, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, తూర్పు ద్వీపకల్ప భారతదేశం, తూర్పుమధ్య భారతదేశంలోని కొన్ని భాగాలు, తూర్పు భారతదేశంలోని అక్కడక్కడా ఉన్న ప్రాంతాలలో సాధారణం నుండి అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.రైతులకు, నీటి సరఫరాకు...బలహీనమైన రుతుపవనాలు త్వరగా రోజువారీ జీవిత సమస్యగా మారవచ్చు. ఇది పంటల సాగు, తాగునీటి సరఫరా, జలవిద్యుత్, భూగర్భ జలాల రీచార్జిపై ప్రభావం చూపుతుంది.సాధారణం కంటే తక్కువ వర్షపాతం వ్యవసాయం, నీటి లభ్యత, జలవిద్యుత్ ఉత్పత్తి, కరువు ప్రమాదం, వడగాలి ఒత్తిడి, తాగునీటి వనరులు వంటి అనేక విషయాలకు సవాళ్లను సృష్టించవచ్చని ఐఎండి హెచ్చరించింది.

## హార్ముజ్ జలసంధిని భారత నౌకలు ఎలా దాటుతున్నాయి?

**వుదయం డెస్క్, మే 29ః**



అమెరికాఇరాన్ యుద్ధం కారణంగా నౌకల రాకపోకలకు చాలా వరకు నిరోధించిన కీలక సముద్ర మార్గమైన హోర్ముజ్ జలసంధి గుండా వచ్చిన అనేక నౌకలకు భారతదేశం స్వాగతం పలికింది. ప్రపంచ ఇంధన అంతరాయాల మధ్య దేశానికి అవసరమైన వనరులను తీసుకురావడమే కాకుండా, ఈ అస్థిర జలమార్గంలో భారత నౌకల రాకపోకలు కొనసాగేలా చేసిన దౌత్య ప్రయత్నాలకు ప్రశంసలు కూడా అందుకుంది.ఏప్రిల్ 9న జరిగిన తాత్కాలిక కాల్పుల విరమణ, క్రియాశీల పోరాటాన్ని నిలిపివేసినప్పటికీ, సాధారణంగా ప్రపంచ చమురు, ద్రవీకృత సహజ వాయువు రవాణాలో సుమారు ఐదవ వంతును నిర్వహించే వ్యూహాత్మక జలమార్గమైన హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి అది దారితీయలేదు. యుద్ధానికి ముందు నాటి చమురు నిల్వలు క్షీణించడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత ఒత్తిడిని ఎదుర్కోవచ్చనే భయాలు పెరుగుతున్నందున, భవిష్యత్తు చర్చలలో హోర్ముజ్ జలసంధి ఒక ప్రధాన అడ్డంకిగా మిగిలిపోయింది.భౌగోళిక ఆధిక్యత కారణంగా ఇరాన్ వాస్తవంగా నియంత్రణలో ఉన్న కీలకమైన జలసంధిని భారత నౌకలు దాటడానికి తెర వెనుక చాలా జరుగుతుంది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు హెచ్చరికగా ఇరాన్ అనేక నౌకలను లక్ష్యంగా చేసుకుంది.ప్రమాదకరమైన హోర్ముజ్‌ను భారత నౌకలు ఎలా దాటుతాయి?నౌకల కదలికల విషయంలో భారత్, ఇరాన్, సంబంధిత పక్షాల మధ్య సమన్వయం, ఏ నౌకలకు ప్రాధాన్యత ఇస్తున్నారు అనే విషయాలపై ఒక సాధారణ పత్రికా సమావేశంలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా, భద్రతా కారణాల దృష్ట్యా కొంత సమాచారాన్ని గోప్యంగా ఉంచుతూ, నౌకా రవాణా మంత్రిత్వ శాఖ శుక్రవారం ఈ ప్రయత్నాలకు సంబంధించిన వివరాలను పంచుకుంది.భారతదేశం, ఇరాన్‌లతో తమసమన్వయం ఏ విధంగా ఉంటుంది, ప్రాధాన్యతలను తాము ఎలా నిర్ణయిస్తాం అనే విషయానికి వస్తే, అనేక కారణాల దృష్ట్యా, మా సమన్వయ ప్రక్రియ గురించి మీకు వివరించడం నాకు ఇష్టం లేదు. మేం విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) ద్వారా సమన్వయం చేసుకుంటాము. ప్రస్తుతం మా పరిస్థితి అదే, అని శుక్రవారం జరిగిన అంతర్‌మంత్రిత్వ శాఖల సమావేశంలో ఓడరేవుల మంత్రిత్వ శాఖ షిప్పింగ్ డైరెక్టర్ ఓపేష్ కుమార్ శర్మ పేర్కొన్నారు.ప్రాధాన్యత పరంగా, పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ (ఎంఒపిఎన్‌జి), ఎరువుల మంత్రిత్వ శాఖల సమన్వయంతో నిర్ణయం తీసుకుంటామని, ఆ తర్వాత సమన్వయ ప్రాధాన్యతలను సిద్ధం చేసి, వాటి ద్వారా ఓడలను బయటకు తీసుకురావడానికి ప్రయత్నిస్తామని ఆయన తెలిపారు.ఓడల డేటా ట్రాకింగ్, వాటి కదలికలకు ఆటంకం కలిగిస్తుందా? హోర్ముజ్ జలసంధిలో సుమారు 13 భారత జెండా కలిగిన నౌకలు ఉన్నాయని శర్మ తెలిపారు. వాటిలో ఒకటి ఎల్‌పిజి ట్యాంకర్, ఐదు ముడి చమురు ట్యాంకర్లు, ఒకటి రసాయన లేదా ఉత్పత్తి ట్యాంకర్, మూడు కంటైనర్ నౌకలు, రెండు బల్క్ క్యారియర్లు, ఒక డ్రెడ్జర్ ఉన్నాయని ఆయన చెప్పారు.షిప్ డేటా ట్రాకర్ విషయానికి వస్తే, ఇవి వాణిజ్య పరమైన అప్లికేషన్లు. ప్రజలు సబ్స్క్రిప్షన్ తీసుకోవచ్చని, ఇది అందరికీ అందుబాటులో ఉంటుందని తాను నమ్ముతున్నాను, అని ఆయన అన్నారు.

ఓడల డేటా బహిరంగంగా అందుబాటులో ఉండటం నౌకల రాకపోకలకు ఆటంకం కలిగిస్తుందా అనే ప్రశ్నకు శర్మ సమాధానమిస్తూ, దానికి సమాధానం చెప్పడం చాలా కష్టం. బహిరంగంగా అందుబాటులో ఉన్న ఏ డేటానైనా ఒక వ్యక్తి ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు. అది అతని ఉద్దేశంపై ఆధారపడి ఉంటుంది. కానీ ప్రస్తుతానికి, ఈ డేటా ఓడలను ట్రాక్ చేయడానికి మాకు, అలాగే మీకు కూడా సహాయపడుతోంది, అని అన్నారు. ఇరుపక్షాల మధ్య పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసిన, ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ జరిపిన దాడులకు ఇరాన్ ప్రతీకారం తీర్చుకోవడంతో, హోర్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు చాలా వరకు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, భారతదేశం హోర్ముజ్ జలసంధి గుండా స్థిరమైన సముద్ర రవాణాను కొనసాగిస్తోంది. ఫిబ్రవరి 28 నుంచి భారతదేశానికి చెందిన అనేక నౌకలు ఈ కీలకమైన మార్గం గుండా ప్రయాణిస్తున్నాయి.ఇరాన్ మరియు ఒమన్ మధ్య ఉన్న ఈ ప్రమాదకరమైన జలమార్గం గుండా ప్రయాణించిన నౌకలలో శివాలిక్, నందా దేవి, జగ్ లాడ్కీ, పైన్ గ్యాస్, జగ్ వసంత, బిడబ్ల్యు టైర్, బిడబ్ల్యు ఎల్మ్, గ్రీన్ సాన్వి ఉన్నాయి.

## ఈడీ దాడులపై కాంగ్రెస్ వైఖరిని దుయ్యబట్టిన పినరయి

**వుదయం డెస్క్, మే 29ః**



బీజేపీని వ్యతిరేకించే పార్టీల నాయకులపై ఈడీ చేపడుతున్న చర్యల విషయంలో కాంగ్రెస్ ఒక సంకుచిత వైఖరిని అవలంబిస్తోందని కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం ఆరోపించారు. కేవలం తమ సొంత నాయకులు లక్ష్యంగా మారినప్పుడు మాత్రమే ఆ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. తన నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలకు సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, తమను వ్యతిరేకించే పార్టీల పట్ల అది కఠిన వైఖరిని అవలంబిస్తోందని విజయన్ అన్నారు.

అందులో భాగంగా, అనేక ప్రతిపక్ష పార్టీలకు, వాటి నాయకులకు వ్యతిరేకంగా అది ఈడీని పక్షపాత ధోరణితో వినియోగిస్తోంది. అయితే, కాంగ్రెస్ పార్టీ మాత్రం తమ సొంత నాయకులపై చర్యలు తీసుకున్నప్పుడు మాత్రమే దీనిని వ్యతిరేకిస్తుంది, అని రాష్ట్ర శాసన సభలోని ప్రతిపక్ష నాయకుడు వ్యాఖ్యానించారు.ఈ విషయంపై ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఎందుకు మౌనంగా ఉన్నారన్న ప్రశ్నకు సమాధానంగా, ఆ ప్రశ్నను కేరళ ముఖ్యమంత్రినే అడగాలని విజయన్ అన్నారు.

మాజీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విషయంలో, ఆయనను ఎందుకు అరెస్టు చేయడం లేదని లేదా ఆయనపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని కాంగ్రెస్ పదేపదే ప్రశ్నించిందని, అయితే ఆయనపై కేసు నమోదైనప్పుడు వారు సంబరాలు చేసుకున్నారని ఆయన ఆరోపించారు.

తన నివాసాల్లో ఇటీవల జరిగిన సోదాల నేపథ్యంలో, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, కేజ్రీవాల్ సైతం ఈడీ చర్యలను ఖండించారని, అదే సమయంలో కాంగ్రెస్ వైఖరిని విమర్శించారని ఆ సీనియర్ మార్క్సిస్టు నాయకుడు పేర్కొన్నారు.

ఇదంతా చూస్తున్నప్పటికీ కాంగ్రెస్ వైఖరిలో ఎటువంటి మార్పు రాకపోవడం దురదృష్టకరం. బీజేపీ చేపడుతున్న ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా మనమందరం ఏకతాటిపై నిలవాల్సిన అవసరం ఉంది. కానీ కాంగ్రెస్ నాయకత్వం మాత్రం ఈ విషయంలో సంకుచిత వైఖరిని అవలంబిస్తోంది, అని విజయన్ అభిప్రాయపడ్డారు.

ఈడీ చర్యలకు సంబంధించి, ఆ సంస్థ తన కుమార్తె వీణా టి.కి చెందిన ఒక ఖాతాను మూసివేసిందని, తన నివాసంలో సోదాలు జరిగిన సమయంలో తాను అక్కడే ఉన్నప్పటికీ, తనను మాత్రం విచారించలేదని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర రాజధానిలోని తన అద్దె నివాసంలో సోదాలు జరిగిన అనంతరం ఈడీ అధికారులపై జరిగిన హింసాత్మక దాడి విషయమై విజయన్ స్పందిస్తూ, నిరసనలు శాంతియుతంగా జరిగేలా చూసేందుకు సీపీఎం నాయకులు తగిన చర్యలు తీసుకున్నారని, ఈ విషయం అందరికీ స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.

ఈడీ నిర్వహించిన సోదాలు, విజయన్ కుమార్తె సంస్థకు, ఒక ఇసుక తవ్వకాల సంస్థకు మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించినవి.

తన కుమార్తె ప్రమేయం ఉన్న సిఎంఆర్ఎల్ మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా, బుధవారం నాడు ఈడీ కేరళ వ్యాప్తంగా మొత్తం 10 ప్రదేశాల్లో సోదాలు నిర్వహించింది. వీటిలో బేకరీ జంక్షన్ వద్ద ఉన్న విజయన్ అద్దె నివాసం, కన్నూరులోని ఆయన పూర్వీకుల ఇల్లు కూడా ఉన్నాయి.

## కాక్రోచ్ పార్టీ ఎక్స్ హాండిల్ అన్‌బ్లాక్‌కు తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, మే 29(ఎ.ఎం.ఎస్)**



వ్యంగ్య ఆన్‌లైన్ వేదిక అయిన 'కాక్రోచ్ జనతా పార్టీస (సిజెపి) ఎక్స్ అకౌంట్‌ను ప్రస్తుతానికి అన్‌బ్లాక్ చేయాలని ఆదేశించడానికి ఢిల్లీ హైకోర్టు శుక్రవారం నిరాకరించింది. దానికి బదులుగా, ఈ విషయాన్ని పరిశీలించి జూలై 7 లోగా నిర్ణయం తీసుకోవాలని ఐటీ నిబంధనల కింద ఒక సమీక్షా కమిటీని కోరింది.

ఈ విషయాన్ని విచారిస్తున్న జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను కమిటీ ముందు వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించారు. ఒకవేళ బ్లాకింగ్‌ను రద్దు చేయాలని కమిటీ సంతృప్తి చెందితే, సిజెపి అకౌంట్‌ను అన్‌బ్లాక్ చేయమని ఆదేశించేందుకు దానికి చట్టపరంగా అధికారం ఉందని ఆయన వ్యాఖ్యానించారు.సీజేపీ హ్యాండిల్‌ను బ్లాక్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ దీప్కే దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రానికి, ఎక్స్‌కు నోటీసులు జారీ చేసిన న్యాయమూర్తి, వారి స్పందనలను కోరి, ఈ విషయాన్ని జూలై 7న విచారణకు జాబితా చేశారు. తదుపరి విచారణ తేదీకి ముందే, సమీక్షా కమిటీ అటువంటి అన్ని అంశాలను పరిశీలించాలని ఆదేశించడమైనది. ఆ నిర్ణయాన్ని రికార్డులో నమోదు చేయాలి, అని కోర్టు పేర్కొంది. దీప్కే తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అఖిల్ సిబల్, సీజేపీ ఖాతా పూర్తి వ్యంగ్యం అని, అందులో కొన్ని అభ్యంతరకరమైన ట్వీట్లు ఉంటే, మొత్తం ఖాతాను నిలిపివేయడానికి బదులుగా వాటిని మాత్రమే నిరోధించవచ్చని సమర్పించారు.

హ్యాండిల్‌ను తాత్కాలికంగా అన్‌బ్లాక్ చేయాలని కోరుతూ, దీప్కే తరఫు న్యాయవాది బ్లాకింగ్ ఉత్తర్వును పరిశీలించాలని న్యాయమూర్తిని అభ్యర్థించారు. ఆ ఉత్తర్వు ఇంకా తమకు అందజేయలేదని ఆయన అన్నారు.అయితే, బ్లాకింగ్ ఉత్తర్వు రికార్డులో లేదని, పిటిషన్‌పై కేంద్రం సమాధానం దాఖలు చేసిన తర్వాత పిటిషనర్ అభ్యర్థనను పరిశీలిస్తామని జస్టిస్ కౌరవ్ పేర్కొన్నారు. మేం పరిశీలిస్తాం. ఈ మొత్తం చట్టం (బ్లాకింగ్‌కు సంబంధించి) ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ఈరోజు మనం తొందరపడొద్దు.

వారు దీనిని నోటీసు అందుకుని, మా వద్దకు రావాలి.వారి వద్ద ఏ సాక్ష్యాధారాలు ఉన్నా, వాటిని సమర్పించమని నేను వారిని ఆదేశించగలను, అని న్యాయమూర్తి అన్నారు. ఈలోగా, పిటిషనర్ తన ఫిర్యాదును సమీక్షా కమిటీ ముందు లేవనెత్తవచ్చని కూడా ఆయన తెలిపారు.కేవలం అభ్యంతరకరమైన ట్వీట్లను మాత్రమే నిలిపివేయమని ఆదేశించడం ద్వారా, బ్లాక్ చేసిన మరి కొన్ని సోషల్ మీడియా హ్యాండిల్స్‌కు ఉపశమనం కల్పిస్తూ కోర్టు గతంలో ఉత్తర్వులు జారీ చేసిందని సిబల్ వాదించినప్పటికీ, ఆ కేసులకు, ఈ కేసుకు మధ్య కొద్దిపాటి తేడా ఉన్నట్లు కనిపిస్తోంది అని కోర్టు పేర్కొంది.ఈ కేసులో మాత్రం, ఆ మొత్తం కార్యకలాపమే స్వతహాగా కొంత అభ్యంతరకరంగా ఉన్నట్లు కనిపిస్తోంది, అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)తో అనుబంధం కలిగి ఉన్న దీప్కే, ఒక న్యాయవాదికి సీనియర్ హోదా కల్పించడంపై మే 15న జరిగిన విచారణ సందర్భంగా,భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ బొద్దింకలు, పరాన్నజీవులు అంటూ చేసినట్లు ఆపాదించబడిన వ్యాఖ్యల వివాదం నడుమ సీజేపీని ప్రారంభించారు.అయితే, మే 16న, తాను యువతను విమర్శించినట్లుగా వచ్చిన మీడియా కథనాల పట్ల తనకు బాధ కలిగిందని పేర్కొంటూ,ప్రధాన న్యాయమూర్తి తన వ్యాఖ్యలపై ఒక గట్టి వివరణను జారీ చేశారు.తన వ్యాఖ్యలు కేవలం నకిలీ , , అయితే మీడియాలోని ఒక వర్గం వాటిని తప్పుగా ఉటంకించిందని ప్రధాన న్యాయమూర్తి నొక్కి చెప్పారు.మే 21న భారతదేశంలో సీజేపీ అసలు ఎక్స్ ఖాతా నిలిపివేశారు. ఆ తర్వాత, ఈ బృందం కాక్రోచ్ ఈజ్ బాక్ అనే కొత్త ఖాతాతో తిరిగి పుంజుకుంది. ప్రస్తుతం ఈ ఖాతాకు 2,27,000 మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు



కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతుల మీదుగా అక్రిడిటేషన్ కార్డు అందుకున్న వుదయం ఖానాపురం ప్రతినిధి సోమేశ్వరరావు

**వరంగల్ జిల్లా మే: 29 (వుదయం ప్రతినిధి)**

ఖానాపురం ప్రముఖ దినపత్రిక వుదయం ఖానాపురం ప్రతినిధి పల్లెల సోమేశ్వరరావు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతుల మీదుగా జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డును అందుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లెల సోమేశ్వరరావు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి అక్రిడిటేషన్ కార్డుల జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చేందుకు మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ అధికారులు, వివిధ పత్రికలు మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన జనుము విత్తనాల విక్రయాలు




**నల్గొండ టౌన్, మే 29 (వుదయం ప్రతినిధి)**

నల్గొండ పట్టణ కేంద్రంలోరైతులకు ఈ సీజన్లో అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారునాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ లిమిటెడ్ నల్గొండ నందు శుక్రవారం జనము విత్తనాల విక్రయాలను కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతాంగము జనుము విత్తనములను వినియోగించుకొని వివిధ రకాల పంటను ఉత్పత్తిని పెంచుకోవాల్సిందిగా కోరినారు.

జిల్లాలో అనేక చోట్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని పేర్కొన్నారు.జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావచ్చిందని తెలిపారు.

నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ లిమిటెడ్ బిజినెస్ మేనేజర్ నాగిళ్ల మురళి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా నష్టాల్లో ఉన్న ఎన్ డిసిఎంఎస్ ప్రస్తుతం రూ.4 కోట్ల లాభాలలో ఉందని తెలిపారు. మారుమూల గ్రామాలలో కూడా యూరియా అందించడంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు.

నల్గొండ మాజీ జెడ్పిటిసి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ రానున్న సీజన్ ను దృష్టిలో ఉంచుకొని రైతులకు అన్ని రకాల విత్తనాలను ఎరువులను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.ఎరువులు &విత్తనాలను అందించడంలో రైతులకు ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.*ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,డీఏవో మరియు జిల్లా సహకార అధికారి ఏవో శ్రీనివాసులు, పంచాయతీ సెక్రెటరీల సంఘం అధ్యక్షుడు అధ్యక్షుడు కాశీం,సెక్రెటరీ సతీష్ ట్రెజరర్ గీతాంజలి, టీఎన్జీవోస్ కార్యవర్గ సభ్యులు,రైతులు పాల్గొన్నారు



## విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**భూపాలపల్లి మే 29 (వుదయం విలేకరి)**

టాస్క్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ యువతకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని, ఇటువంటి కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకుని మంచి అవకాశాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం

## వేగవంతం చేయాలి




**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి**

**ములుగు, మే 28 (వుదయం ప్రతినిధి) :**

ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇంచార్జ్ ఆర్డిఓ ప్రతాప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ, స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదిగా ఉంటాయని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బి ఎల్ ఓ లు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతుండగా, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ఏ ఈ ఆర్ ఓ లు, బి ఎల్ ఓ లు, సూపర్వైజర్లు, ఎలక్షన్ తహసిల్దార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సైఆర్ పై క్షేత్రస్థాయి అవగాహన

**: వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య వినూత్న కార్యాచరణ**

**వరంగల్ ,మే 29 (వుదయం ప్రతినిధి)**



ప్రత్యేక సమగ్ర ఓటరు నమోదు ప్రక్రియపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వినూత్న కార్యాచరణ చేపట్టారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో డాక్టర్ కావ్య రూపకల్పన చేసిన ప్రక్రియ కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు దిక్సూచిగా నిలుస్తోంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కేవలం రాజ్యాంగబద్ధ హక్కే కాదని, అది ప్రజల అస్తిత్వాన్ని, స్వరాన్ని ప్రతిబింబించే మూలాధారమని ఈ ప్రక్రియ నిరూపిస్తోంది.ఓటు హక్కు పరిరక్షణలో రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయంలో, కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య చేపట్టిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రజాస్వామ్య చైతన్యానికి కొత్త దిశను చూపుతోంది. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బూత్ స్థాయి నాయకులకు అవగాహన కల్పిస్తూ ఆమె చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం కేవలం పార్టీ పరిమిత కార్యక్రమంగా కాకుండా, ఓటరు హక్కుల పరిరక్షణకు క్షేత్రస్థాయి ప్రేరణగా నిలుస్తోంది.ఎన్నికల జాబితాల్లో నకిలీ పేర్లు, మరణించిన వ్యక్తుల నమోదులు, అర్హతలేని ఎంట్రీలను తొలగిస్తూ, నిజమైన ఓటరుల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగిపోకుండా చూసే ప్రక్రియే ఎస్ఐఆర్. అయితే ఈ ప్రక్రియలో జరిగే చిన్న పొరపాటు కూడా ఒక పౌరుడి రాజ్యాంగ హక్కును దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఈ సున్నితత్వాన్ని గుర్తించిన డాక్టర్ కడియం కావ్య, బూత్ స్థాయి కార్యకర్తలకు అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాల్సిన అవసరాన్ని వివరించారు. " ఇంటింటి ధృవీకరణ, పత్రాల పరిశీలన, అభ్యంతరాల దాఖలు, ప్రజలతో ప్రత్యక్ష కమ్యూనికేషన్ వంటి అంశాలపై కార్యకర్తలకు ప్రత్యక్ష మార్గనిర్దేశం చేశారు.

అంతేకాకుండా ఆమె స్వయంగా సిద్ధం చేసిన పదకొండు పేజీల బుక్ లెట్ ఈ కార్యక్రమానికి మరింత బలాన్ని చేకూర్చింది. ఎస్ఐఆర్ ప్రక్రియ, అవసరమైన పత్రాలు, అనుమానాస్పద తొలగింపులను గుర్తించే విధానం, ప్రజలతో మమేకమయ్యే పద్ధతులు వంటి అంశాలను సులభమైన భాషలో అందులో పొందుపరిచారు. పార్టీ నాయకులు దీన్ని క్షేత్రస్థాయి కార్యకర్తలకు మార్గదర్శక గ్రంథంగా అభివర్ణించడం విశేషం.

ఇక ఇదే సమయంలో ప్రతిపక్ష రాజకీయాల వైఖరి మాత్రం ప్రధానంగా విమర్శలకే పరిమితమైనట్లు కనిపించింది. ఫలితంగా పత్రాల లోపాలు, .ఎస్ఐఆర్ ప్రక్రియలో ఉన్న లోపాలు, సవాళ్లు కూడా చిన్నవి కావు. ముఖ్యంగా 2003 తర్వాత నమోదైన ఓటర్లు జనన ధృవపత్రాలు, తల్లిదండ్రుల ఆధార పత్రాలు వంటి అదనపు పత్రాలు సమర్పించాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వలస కూలీలు, పేదలు, గ్రామీణ వర్గాలు, అట్టడుగు వర్గాల ప్రజలకు ఇవి పెద్ద అడ్డంకులుగా మారుతున్నాయి. సరైన సమాచారం అందకముందే పేర్లు తొలగించబడటం, తొందరపాటుగా నిర్వహించే ఇంటింటి ధృవీకరణలు, ఎన్నికలకు సమీప సమయంలో ఈ ప్రక్రియ చేపట్టడం వంటి అంశాలు ఆందోళనలకు కారణమవుతున్నాయి. డాక్టర్ కావ్య శిక్షణ కార్యక్రమం ఈ సమస్యలకు ప్రత్యక్ష పరిష్కార మార్గాన్ని సూచిస్తోంది. ప్రమాదంలో ఉన్న ఓటర్లను ముందుగానే గుర్తించడం, వారికి అవసరమైన పత్రాల సేకరణలో సహకరించడం, క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల ప్రక్రియలో మార్గనిర్దేశం చేయడం వంటి అంశాలపై ఆమె ప్రత్యేక దృష్టిసారించారు. అప్రమత్తతతో పాటు ప్రజల పట్ల సహానుభూతి కూడా అవసరమని కార్యకర్తలకు సూచించడం ఈ కార్యక్రమానికి మరింత విశ్వసనీయతను తీసుకొచ్చింది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల వ్యవస్థల పారదర్శకత, విశ్వసనీయతపై చర్చ జరుగుతున్న తరుణంలో, క్షేత్రస్థాయి శక్తివంతీకరణ ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్న డాక్టర్ కడియం కావ్య ప్రయత్నం ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. కేవలం ఆరోపణలు,

విమర్శలకే పరిమితం కాకుండా, వ్యవస్థను అర్థం చేసుకుని ప్రజలను చైతన్యపరిచే దిశగా రాజకీయ నాయకత్వం అడుగులు వేయాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం గుర్తుచేస్తోంది.ఎన్నికల జాబితాల సవరణ ప్రక్రియ కొనసాగుతున్న ఈ సమయంలో, ఇలాంటి చైతన్య కార్యక్రమాలు దేశ ప్రజాస్వామ్య మూలాలను మరింత బలపరుస్తాయి. బూత్ స్థాయి నుంచి ప్రారంభమైన ఈ అప్రమత్తత ఉద్యమం భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఆదర్శంగా మారినా ఆశ్చర్యం లేదు. ఓటు హక్కు పరిరక్షణలో జాగ్రత్త, బాధ్యత, నవ్య ఆలోచన ఎంత ముఖ్యమో డాక్టర్ కడియం కావ్య చొరవ మరోసారి స్పష్టం చేసింది.

## రాష్ట్ర అవతరణ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ కీలక ఆదేశాలు

**యాదాద్రి భువనగిరి మే 29 (వుదయం ప్రతినిధి)**




శుక్రవారం జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, తో కలిసి తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 2న జరుపుకొనే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిందిగా సూచించారు.తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణలో భాగంగా కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ (నిర్వహణ నియమాల) ను అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ తయారు చేయాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు తగు ఏర్పాట్లను ముందస్తు జాగ్రత్తలతో నిర్వహించాలని స్పష్టం చేశారు. తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, అమరవీరుల స్థూపం, స్టేజ్ అలంకరణ లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏవో అంజి రెడ్డి,మునిసిపల్ కమిషనర్ లు, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మంవుదయంబ్యూరో మే-29**




ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి ఇప్పటివరకు చేపట్టిన మ్యాపింగ్ వివరాలను మండలాల వారీగా పరిశీలించి, పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకతతో పని చేయాలన్నారు. ఎస్ఐఆర్ లో భాగమైన మండలాలు, కార్పోరేషన్, మున్సిపాలిటీ సంబంధించి ప్రతి ఓటర్లను మ్యాపింగ్ చేసే విధంగా టార్గెట్ పెట్టుకొని వంద శాతానికి చేరుకోవాలన్నారు. ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బీఎల్‌వో వద్ద ఎన్యుమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రతి బీఎల్‌వోకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. అంతకుముందు శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ 2026 ప్రక్రియ నిర్వహణ, శిక్షణ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయక ఎన్నికల నమోదు అధికారులు, బిఎల్ఓలు, సూపర్‌వైజర్లతో సహా ఎన్నికల అధికారులకు శిక్షణా కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ రాజేశ్వరీ, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, అన్సరీ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఊర చెరువు పూడికతీత పనులకు శంకుస్థాపన

**హనుమకొండ టౌన్ , మే 29 (వుదయం ప్రతినిధి) :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ గోపాలపూర్ ఊర చెరువులో సుమారు రూ.1 కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న పూడికతీత పనులకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్థానిక శాసన సభ్యులు కె.ఆర్. నాగరాజు హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయిలతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ

చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు చెరువుల నిల్వ సామర్థ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో గోపాలపూర్ పరిసర ప్రాంతాల్లో తరచూ ఎదురయ్యే వరద ముంపు సమస్యలను తగ్గించడంలో ఈ పూడికతీత పనులు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల విజయవంతానికి ప్రజల సహకారం అవసరమని, చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




## "ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా యువత వ్యాపారంలోకి రావాలి"

**- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట మే: 29 (వుదయం ప్రతినిధి)**

జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో సూర్యాపేటలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తల అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువత ఉద్యోగాల కోసమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని, వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి జిల్లా, దేశ అభివృద్ధికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వ్యాపార కేంద్రాలు, పరిశ్రమల ఏర్పాటుపై యువతకు సరైన అవగాహన కల్పించేందుకు మిక్కి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. , ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువత ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని, వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి జిల్లా, దేశ అభివృద్ధికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిబద్ధత, కృషి, సంకల్పం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని యువతకు సందేశం ఇచ్చారు. పరిశ్రమల స్థాపనలో జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాదిగ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు తక్కిళ్ళ విప్లవ గాంధీ, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్, ఉమాపతి, శ్రీనివాసరాజు, దుబ్బా నాగేశ్వర్, కవిత

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 29 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం జూలూరుపాడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో పరిశీలించారు. ఈ సందర్భంగా గత రాత్రి కురిసిన వర్షాల కారణంగా మొక్కజొన్న నిల్వలు తడిసాయా అనే అంశంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లతో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడంతో ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కేంద్రంలో నిల్వ ఉంచిన మొక్కజొన్న నిల్వలను, నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో 3,600 మొక్కజొన్న బస్తాలు ఉన్నాయని, ఈరోజే మొత్తం లోడింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిన్న ఎన్ని లారీలు లోడింగ్ చేశారో, ఇప్పటివరకు ఎంత పరిమాణంలో మొక్కజొన్నను గోదాములకు తరలించారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సుమారు 28 వేల బస్తాలను గోదాములకు తరలించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రహిత సమాజమే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం.. శనివారం ఉదయం అవగాహన ర్యాలీ**

**విద్యాసంస్థల సమీపంలో విక్రయాలపై ప్రత్యేక నిఘా,**

**టాస్క్ ఫోర్స్ తనిఖీలు**

**జనగామ, మే 29 (వుదయం ప్రతినిధి) :**




జిల్లాలో పొగాకు వినియోగాన్ని అరికట్టి, "పొగాకు రహిత సమాజమే లక్ష్యంగా" అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఈ నెల 31న నిర్వహించనున్న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గుట్కా, ఇతర పొగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం (COTPA Act) అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు పొగాకు బారిన పడకుండా విద్యాసంస్థల వంద గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను పూర్తిగా నిరోధించాలని స్పష్టం చేశారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి సంయుక్తంగా నిరంతర తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

కోట్పా (COTPA) చట్టం నిబంధనలుఇలా ఉన్నాయి.సెక్షన్ 4 బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, ఆసుపత్రుల్లో పొగతాగడం నిషేధం. ఉల్లంఘిస్తే జరిమానా.

సెక్షన్ 5 పొగాకు ఉత్పత్తుల ప్రకటనలపై పూర్తి నిషేధం.సెక్షన్ 6(A) 18 ఏళ్ల లోపు మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మడం చట్టవిరుద్ధం.సెక్షన్ 6(B) విద్యాసంస్థల 100 గజాల పరిధిలో విక్రయాలు నిషేధం.సెక్షన్ 7 ప్యాకెట్లపై స్పష్టమైన ఆరోగ్య హెచ్చరికలు తప్పనిసరి. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మే 30న (శనివారం) ఉదయం 6 గంటలకు కలెక్టరేట్ నుండి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే కళాజాతల ద్వారా విస్తృత ప్రచారం చేయిస్తామన్నారు.

ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డిపిఓ వెంకట్ రెడ్డి, డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, డ్రగ్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్' పోస్టుకు

## దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబాబాద్, మే 29 (వుదయం ప్రతినిధి):**

మహబూబాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ (eDM) పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ మీ సేవ (ESD) కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.పోస్టు రకం పూర్తిగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన.నెలసరి వేతనం రూ. 32,000/ (ఆల్ ఇన్‌క్లూజివ్).దరఖాస్తు గడువు మే 30 నుండి జూన్ 15, 2026 (సాయంత్రం 5:00 గంటల వరకు). దరఖాస్తు విధానం అర్హత గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://meeseva.telangana.gov.in ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, సంబంధిత అనుభవం మరియు ఇంటర్వ్యూలో చూపే ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని కమిషనర్ పేర్కొన్నారు. అర్హులైన స్థానిక యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

**జయశంకర్ భూపాలపల్లి మే 29(వుదయం జిల్లా ప్రతినిధి)**

అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారుశుక్రవారం ఐడిఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్ల పై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి పౌర సరఫరాలు, అదే స్ఫూర్తితో ధాన్యం కొనుగోళ్లలో సైతం వేగం పెంచాలని సూచించారు.

అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారం కొనుగోలు కేంద్రాలలో రైతులకు తప్పనిసరిగా ట్రక్ షీట్ ఇవ్వాలని, ధాన్యం కాంటా జరిపిన వెంటనే ట్యాబ్ ఎంట్రి కచ్చితంగా చేయాలని తెలిపారు ఐరిస్ పద్ధతిని తొలగించి ఓటిపి ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మరో వారంలోగా కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు పిఎసిఎస్ సీఈఓలు, లారీలు కొరత ఉంటే ట్రాక్టర్లు ద్వారా మిల్లులకు తరలించాలని అకాల వర్షాలు వల్ల ధాన్యం తడవకుండా ఎత్తైన ప్రదేశాలలో నిల్వ ఉంచాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాలు, సంస్థ రవాణా, డి ఆర్ డి ఓ, సహకార శాఖల అధికారులు, మిల్లర్లు పిఎసిఎస్ సీఈవోలు, ఏపీఎం లు తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ |ఆదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు




## ఎస్సీ సెల్ అధ్యక్షుడు గా ఎన్నికైన అరుణ్ కుమార్‌కు ఘనంగా స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

**కరీంనగర్ ,మే 29 (వుదయం ప్రతినిధి):** కరీంనగర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన కొరివి అరుణ్ కుమార్ ను కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు .ఈ సన్మాన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాంరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు పులి అంజనేయులు గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షులు పురం రాజేశం, మైనారిటీ సెల్ అధ్యక్షులు మహ్మద్ తాజ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రవణ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి పాల్గొన్నారు. మరియు కొత్తపల్లి మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సిరిపురం నాగప్రసాద్, కరీంనగర్ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం లావణ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అబ్దుల్ అమీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపాల్ రెడ్డి తదితరులు అరుణ్ కుమార్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, అరుణ్ కుమార్ నాయకత్వంలో జిల్లా ఎస్సీ విభాగం మరింత బలోపేతం అవుతుందని, పార్టీ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారని ఆకాంక్షించారు.

## కొనుగోళ్లలో ధాన్యం కటింగ్ చేయొద్దు
### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



- ●నాణ్యత పరిశీలించిన ధాన్యాన్నే రైస్ మిల్లులకు తరలించాలి
- ● జూన్ 2 నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలనిఆదేశం

**పెద్దపల్లి , మే 29 (వుదయం కరస్పాండెంట్ న్యూస్)** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో రైతుల ధాన్యంపై ఎలాంటి కటింగ్ చేయవద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.
శుక్రవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో వరి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్, కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎవరైనా రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నాణ్యత పరిశీలించిన ధాన్యాన్నే రైస్ మిల్లులకు తరలించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుల ధాన్యంలో కటింగ్ చేయవద్దని అధికారులకు స్పష్టం చేశారు.కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన 100 శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని, అన్ని ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.జూన్ 2 నాటికి జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి కేంద్రాలను మూసివేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ కాళిందిని, డీసీఓ శ్రీమాల, ఏపీఎంలు, ఏపీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా పథకాలు అమలు



**రాజన్నసిరిసిల్ల ,మే 29 (వుదయం ప్రతినిధి):** రాష్ట్రంలోని మహిళల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల కింద మహిళా స్వయం సహాయక సభ్యులకు బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్కే ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రుణాల పంపిణీ..337 సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ. 40 కోట్లు, ఎఫ్ పీసీ, ఎఫ్ పీజీ సీఐఎఫ్ కింద 42 సంఘాలకు రూ.1 కోటి ఐదు లక్షలు, శ్రీనిధి రూరల్ కింద 278 సంఘాలకు రూ.7 కోట్ల 13 లక్షలు, బ్యాంక్ లింకేజీ మెప్మా రుణాలు 55 సంఘాలకు రూ.6 కోట్ల 33 లక్షలు, శ్రీ నిధి మెప్మా 61 సంఘాలకు రూ. కోటి 50 లక్షల విలువైన చెక్కులను మహిళా సంఘాల బాధ్యులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించే సంఘాలకు రూ.11,36,113 కమిషన్ చెక్కును అందజేశారు. స్టాళ్లు ఏర్పాటు చేయగా, ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. మార్చి 6 వ తేదీన 99 రోజుల కార్యాచరణలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలపై వివరించడం.. భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు కార్యక్రమం కోసం ప్రభుత్వం ఈ కార్యాచరణ అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు 57 వేల కోట్లు బ్యాంక్ లింకేజ్ రుణాలు మంజూరు చేశామని వెల్లడించారు. రుణాలకు సంబంధించిన వడ్డీని తిరిగి చెల్లించామని తెలిపారు. ప్రతి మహిళను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రజా ప్రభుత్వం వివిధ పథకాలు, రుణాలను మంజూరు చేస్తుందని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 60 శాతం మహిళల సంఘాలకే ఇచ్చామని తెలిపారు. ప్రతి పథకంలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు వెళ్తున్నామని, ప్రజలను, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఉత్తమ పనితీరుతో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. మహిళా సంఘాలకు ఆధ్వర్యంలో ఎరువుల షాపు లు ఇవ్వాలని, మహిళా సంఘాలకు ప్రతి మండలానికి ఒకటి రైస్ మిల్లు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్ లలో ఉచిత ప్రయాణం పథకం కేరళలో కూడా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. చక్కటి సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయని తెలిపారు.

10 థీమ్ లతో 10 శాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. మహిళా సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై లైంగిక వేధింపుల నివారణ నిషేధము పరిష్కారాల చట్టం 2013 వివిధ అంశాలపై అవగాహన కల్పించామని వెల్లడించారు. జిల్లాలోని మహిళా సంఘాలు తీసుకుంటున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలని, స్వయం ఉపాధి వైపు ఉపయోగించాలని పిలుపు నిచ్చారు.మహిళా స్వయం సహాయక సంఘాల ఎన్‌పీఏ తక్కువగా ఉందని తెలిపారు. మన జిల్లా నుంచి ఉత్తమ అవార్డ్ తీసుకున్నామని గుర్తు చేశారు. బ్యాంక్ రుణాలను తినుబండారాలు, కిరాణా షాప్, మగ్గం వర్క్, ఇతర ఉపాధి పొందే వాటి కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంకా ప్రభుత్వ సబ్సిడీ పథకాలు ఉన్నాయని, వాటి వివరాలు సంబంధిత శాఖల వద్ద పొందాలని పిలుపు నిచ్చారు.జిల్లాలో ఆయా మండలాలకు కేటాయించిన బస్సులతో ప్రతి నెలా ఆదాయం వస్తుందని వివరించారు. సోలార్ ప్లాంట్, పెట్రోల్ బంక్ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని, విజయవంతంగా కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు.వృద్ధ మహిళలు, కిశోర బాలికలకు మహిళా సంఘాల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బ్యాంక్ ల కార్యకలాపాలు, అకౌంట్ తీయడంపై అవగాహన కిశోర బాలికలకు వస్తుందని, వారు సామాజిక అంశాలు, స్వయం సమృద్ధి తదితర అంశాలపై చర్చా చేయాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం మహిళలే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుందని, స్కూల్ యూనిఫాంలు కుట్టించే బాధ్యత, అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మత్తు పనులు మహిళా సంఘాలతో చేయించామని వివరించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు ఏమైనా స్వయం ఉపాధి ఆలోచనలు, ఇతర సహాయం కోసం అధికార యంత్రాంగం సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివరించారు.

కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వీర్నపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు. తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## సర్ -2026 ను పక్కాగా నిర్వహించాలి
### జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మే 29 (వుదయం ప్రతినిధి):** సర్ 2026 ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ, సర్ 2026 ప్రక్రియ నిర్వహణ పై సంబంధిత అధికారులకు పూర్తి అవగాహనతో కూడిన శిక్షణ ఇవ్వాలన్నారు. రాబోయే 'SIR2026' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలు లేకుండా, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఇందుకు అందించాల్సిన శిక్షణ, సాంకేతిక అంశాలపై ఆయన పలు ముఖ్యమైన మార్గదర్శకాలను జారీ చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ విసి హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులతో కలిసి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో 'సర్ 2026' విధులను అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఓటరు జాబితాల పర్యవేక్షణ, సవరణలు, ఇతర సాంకేతిక ప్రక్రియలపై సిబ్బందికి పూర్తి అవగాహన కలిగిఉండాలన్నారు. నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్, సమీక్షలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఆర్డీవో జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, మే 29 (వుదయం ప్రతినిధి):** జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం బీబీపేట మండలంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యం నాణ్యత, తూకం విధానం, హమాలీ సౌకర్యాలు, రవాణా ఏర్పాట్లపై ఆరా తీశారు.అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, అవసరమైన రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. కేంద్రంలో ధాన్యం నిల్వ విధానం, ఆన్‌లైన్ నమోదు, టోకెన్ వ్యవస్థ, చెల్లింపుల వివరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు తీసుకొచ్చిన ప్రతి ధాన్యపు గింజకు సరైన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కలెక్టర్ వెంట సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్, డీసీవో రామ్ మోహన్, సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి




**నిజామాబాద్,మే 29 (వుదయం ప్రతినిధి):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓ లతో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరుపై శిక్షణ, ఓటరు మ్యాపింగ్ పురోగతిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని, అదే సమయంలో అనర్హులకు అవకాశం లేకుండా నిశిత పరిశీలన జరపాలని సూచించారు. ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. . జూలై 1, 1987కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు.
జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి ఎవరిదైనా ఒకరి ధ్రువపత్రం సమర్పించాలని, డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తల్లిదండ్రులు ఇద్దరి ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ ఉంటుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.
తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించడం జరుగుతుందని సీ.ఈ.ఓ వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్.డీ.ఓ రాజేంద్రకుమార్, బాన్సువాడ ఆర్.డీ.ఓ రవీందర్ రెడ్డి, బోధన్ ఆర్డీఓ విజయ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏ.ఈ.ఆర్.ఓలు పాల్గొన్నారు.

## చిల్లర మాటలు, పిచ్చి చేష్టలు బాల్క సుమన్ నైజం

- ● నీ మాటలు జాగ్రత్త ఖబర్దార్ బాల్క మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి,
- ●కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ అజీజ్





**మంచిర్యాల/రామకృష్ణాపూర్ మే 29(వుదయం ప్రతినిధి)** చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నీయొక్క పద్ధతులు మార్చుకోవాలని, హైదరాబాద్ ప్రగతిభవన్ లో మీరు చేసిన వాక్యాలను వెనక్కి తీసుకోవాలని మంచిర్యాల డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. అధికారం కోల్పోయాక మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిచ్చి కూతలు కూస్తున్నారని మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ అజీజ్ అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే మాజీ ఎమ్మెల్యే కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ రామకృష్ణాపూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి రాజేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ పట్టణంలో విలేకరులతో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయాలని టీబీజీకేఎస్ నేతలకు, కార్యకర్తలకు బాల్క సుమన్ పిలుపునిచ్చిన నేపథ్యంలో బాల్క సుమన్ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రైలు పట్టాలు కోయడం, సింగరేణి కార్యాలయం ,జీఎం కార్యాలయాలను తగలబెట్టడం చేయాలని కార్యకర్తలను రెచ్చగొట్టడం సిగ్గుచేటని అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికలలో సైతం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి రాజకీయ లబ్ధి పొందిన బాల్క సుమన్, రాష్ట్ర రాజకీయాల్లో సైతం రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బిఆర్ఎస్ పార్టీ బాల్క సుమన్ ను ఆ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. వైద్య వృత్తిలో ఉన్న సమయంలో డాక్టర్ రాజా రమేష్ ను బాల్క సుమన్ ఇబ్బంది పెట్టిన రోజులు మరిచిపోయి వ్యవహరిస్తున్నారని అన్నారు. రాజా రమేష్ కు కాంగ్రెస్ పార్టీ రాజకీయ బిక్ష పెట్టిందని గుర్తు చేశారు. కార్యకర్తలు ఆలోచించి నాయకుల కొరకు పని చేయాలే తప్ప రెచ్చిపోయి కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు.
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రేషన్ కార్డులు అందించామని అన్నారు. స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, స్థానిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి లు పాటుపడుతున్నారని అన్నారు. చెన్నూర్ నియోజకవర్గాన్ని వివేక్ వెంకటస్వామి అభివృద్ధి చేస్తుంటే బాల్క సుమన్ ఉన్మాదిలా వ్యవహరిస్తున్నాడని దుయ్యబట్టారు. ఇప్పటికైనా బాల్క సుమన్ తన వ్యవహార శైలిని మార్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు పల్లె శ్రీదేవి, దాముక శిరీష, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ, సీనియర్ నాయకులు మహంకాళి శ్రీనివాస్, గాండ్ల సమ్మయ్య, గోపతి భానేష్, మెట్ట సుధాకర్, గోపు రాజం, మేకల సురేందర్,సత్యపాల్, కుర్మ సురేందర్, రాజ్ కుమార్, ఇప్ప అశోక్, ఎల్పుల సత్యనారాయణ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం అన్లోడింగ్, కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

**: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా మే 29 (వుదయం ప్రతినిధి):** జిల్లాలో ధాన్యం అన్లోడింగ్, కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఖానాపూర్, కడెం మండలాల్లోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖానాపూర్ మండలం సత్తనపల్లి గ్రామంలోని ఏఆర్ఎస్ (ARS) రైస్ మిల్లుతో పాటు కడెం మండలంలోని లక్ష్మీ అన్నపూర్ణ రైస్ మిల్లు, నవాబ్‌పేట్, పెద్దబెల్లాల్, నచ్చన్ ఎల్లాపూర్ గ్రామాల్లోని పలు రైస్ మిల్లులను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లుల్లో జరుగుతున్న ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు అన్లోడ్ చేసిన ధాన్యం వివరాలు, అందుబాటులో ఉన్న ఖాళీ స్థలం, రోజువారీ సగటు అన్లోడింగ్ సామర్థ్యం తదితర అంశాలపై అధికారులను, మిల్లు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం మిల్లుకు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా అవసరమైన మేరకు ఎక్కువమంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. స్థానిక అధికారులు రైస్ మిల్లుల వద్ద అన్లోడింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, లారీలు త్వరగా ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితి తలెత్తకుండా, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని స్పష్టం చేశారు.మిల్లుల తనిఖీ అనంతరం కడెం మండల తహసిల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వివరాలు, ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం పరిమాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలిన ప్రక్రియను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ తనిఖీలు, సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహశీల్దార్లు సుజాత, మొయినుద్దీన్, ఎంపీడీవోలు రాధ, అరుణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి








**తెలంగాణ గవర్నర్ శివప్రసాద్ శుక్ల.**

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులను అధికారులు దత్తత తీసుకొని వారికి అవసరమైన మందులు, పౌష్టికాహారం అందించాలన్నారు. యువత మారకద్రవ్యాలు మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.
నాషా ముక్త భారత్ లక్ష్యంగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మారకద్రవ్యాల నిర్మూలల కోసం కేంద్ర,
రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. స్వయం సహాయక సంఘాల సహకారం తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై ప్రజలు మౌనంగా ఉండకూడదని, ప్రజా వ్యతిరేక చర్యలను అరికట్టేందుకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ప్రజారోగ్యం ప్రత్యేక దృష్టి పెట్టాలని, వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె హరిత శాఖల వారీగా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా ఎస్పీ నికిత పంత్ జిల్లాలో శాంతిభద్రతలు మారక ద్రవ్యాల నిర్మూలనపైతీసుకుంటున్న చర్యలు వివరించారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం తీసుకున్న జిల్లా కలెక్టర్ కె. హరితకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.అంతకుముందు హెలికాప్టర్ ద్వారా జిల్లాకు వచ్చిన గవర్నర్ జిల్లా కలెక్టర్ కే హరిత, జిల్లా ఎస్పీ నికిత పంత్, ఎమ్మెల్యేలు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, కోవా లక్ష్మి ,ఎమ్మెల్సీ దండే విట్టల్ స్వాగతం పలికి పుష్పగుచ్చం అందజేసి శాలువతో సత్కరించారు.

## ఎమ్మెల్యే సంజయ్‌ను కలిసిన పద్మశాలి సంఘం నూతన కమిటీ



**జగిత్యాల మే 28 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల నియోజకవర్గ పరిధిలోని అల్లిపూర్ మార్కండేయ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ సభ్యులు జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవగా నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ అనంతరం పద్మశాలి సంఘం కళ్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలే చంద్ర శేఖర్ మాజీ ఎంపిటిసి మోర వెంకటేష్ సంఘం అధ్యక్షులు వేముల సతీష్ ఉపాధ్యక్షులు సిరిపురం నందు మల్లేశం కార్యదర్శి మోర శివ సంఘ నాయకులు నామని లక్ష్మీ నర్సయ్య అనుమల్ల రాజ్ కుమార్ నామని శేఖర్ అనుమల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## జూన్ 2న చేతి వృత్తిదారుల సంస్కృతిక సంబరాలు



**సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు – పోస్టర్ ఆవిష్కరణ**

**ముషీరాబాద్,మే 29(వుదయం)**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న "చేతి వృత్తిదారులు - తెలంగాణ సంస్కృతి" అంశంపై రాష్ట్ర సదస్సు మరియు సాంస్కృతిక సంబరాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కన్వీనర్ ఎం.వి. రమణ తెలిపారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది.ఈ సందర్భంగా శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎం.వి. రమణ మాట్లాడుతూ తెలంగాణలో ఇప్పటికీ లక్షలాది మంది చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. వారి జీవన విధానం, సంప్రదాయాలు, కళా సంస్కృతిని ప్రతిబింబించేలా శాస్త్రీయ భావజాలంతో కథలు, ఆటలు, పాటలతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ రాష్ట్ర సదస్సుకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి, మాజీ శాసన మండలి సభ్యుడు చెరుపల్లి సీతారాములు హాజరవుతారని వెల్లడించారు. వివిధ జిల్లాల నుంచి వృత్తి కళాకారులు పాల్గొని తమ సంప్రదాయ కళలను ప్రదర్శిస్తారని చెప్పారు.చేతి వృత్తిదారులు, కళాకారులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, అధ్యక్షుడు గోరింకల నరసింహ, గొర్రెలుమేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, సురుగు రాజేష్ గౌడ్, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి చారి తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండ



**వర్షా లకు తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు**
**తడిసిన ధాన్యానికి కూడా మద్దతు ధర**
**రైతులకు నష్టం లేకుండా ప్రత్యేక చర్యలు**
**మొక్కజొన్న భారీ దిగుబడి..**
**నిల్వలకు ప్రత్యేక ఏర్పాట్లు**
**కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం**
**రైతులకు నమ్మకం కలిగించే విధంగా మీడియా సహకారం అవసరం**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్**

**నాగర్ కర్నూల్ మే 29 (వుదయం ప్రతినిధి)**

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులు ఎదుర్కొన్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని, తడిసిన ప్రతి గింజను కూడా ప్రభుత్వ మద్దతు ధర (MSP) ప్రకారం కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రకటించారు.ఈ విషయంపై మీడియా ప్రతినిధులు కూడా రైతులకు సరైన సమాచారం చేరవేసి అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉందని, తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి అపోహలు నమ్మవద్దని రైతులకు తెలియజేయాలని సూచించారు. రైతులకు నమ్మకం కలిగించే విధంగా మీడియా సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ కోరారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్‌తో కలిసి కలెక్టర్ ఈ వివరాలను వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల ముఖ్యంగా కోత దశలో ఉన్న వరి పంట తీవ్రంగా దెబ్బతిందని, రైతులు ఆందోళనకు గురయ్యారని ఆయన తెలిపారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 35 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయగా, ఇంకా లక్ష మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉందని కలెక్టర్ వెల్లడించారు. ఇందుకోసం అవసరమైన కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇతర జిల్లాల్లో 90 శాతం కొనుగోళ్లు పూర్తయినప్పటికీ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇంకా కోతలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందన్నారు.జిల్లాలో మొక్కజొన్న దిగుబడి గణనీయంగా పెరిగిందని, సాధారణంగా ఎకరానికి 25 టన్నులు రావాల్సి ఉండగా ఈసారి 50 నుంచి 60 టన్నుల వరకు దిగుబడి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 1,75,000 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశామని, ఇంకా రైతుల వద్ద ఉన్న దిగుబడిని కొనుగోలు చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.మొక్కజొన్న భారీ దిగుబడి రావడంతో రవాణా, కూలీల, నిల్వ సమస్యలు తలెత్తుతున్నాయని, ఇప్పటికే జిన్నింగ్ మిల్లుల్లో నిల్వలు ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైతే ప్రత్యేక అధికారాలతో ఫంక్షన్ హాళ్లను కూడా తాత్కాలిక గోదాములుగా వినియోగిస్తామని స్పష్టం చేశారు.తడిసిన ధాన్యానికి కూడా నాణ్యత ప్రమాణాల్లో కొంత సడలింపుతో కొనుగోలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా వారికి న్యాయమైన ధర అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరగకుండా కఠిన పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో వరి, మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నమోదు చేసుకోవచ్చని సూచించారు. రసీదుల జారీ, తూకం, నిల్వ, రవాణా వంటి అన్ని దశల్లో స్పష్టమైన విధానాలు అమలు చేస్తామని తెలిపారు.మధ్యవర్తుల జోక్యాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, తాత్కాలిక వసతులు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రతి రోజు కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తూ నివేదికలు సేకరిస్తారని, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.అలాగే జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లకు అవసరమైన గన్ని బ్యాగుల నిల్వ పూర్తిగా అందుబాటులో ఉందని, అవసరానికి 20 శాతం అదనపు స్టాక్ కూడా సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. రైతుల ధాన్యం కొనుగోలుకు సంచుల కొరత లేదని తెలిపారు.

## నిర్వాసితుల కన్నీళ్లు పట్టని పాలకులు

**రెండేళ్లుగా చీకట్లలో చిన్నోనిపల్లె పునరావాస కేంద్రం**
**సహకరిస్తే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా సర్పంచ్ యు దేవేందర్**

**గద్వాల మే 29 (వుదయం బ్యూరో)**



చిన్నోనిపల్లె పునరావాస కేంద్రంలో నివసిస్తున్న నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తున్నానని గ్రామ సర్పంచ్ యు దేవేందర్ తెలిపారు. గ్రామ ప్రజలు రెండోసారి నమ్మకంతో గెలిపించారని,వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. చిన్నోనిపల్లెను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పని చేస్తున్నప్పటికీ అధికారుల సహకారం లేక అభివృద్ధి పనులు ఆశించిన వేగంతో సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం 101వ ప్యాకేజీ కింద నిర్మించిన రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ ప్రభావంతో గ్రామస్తులు తమ పాత ఊరిని విడిచి యర్రగట్టు వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలివచ్చారని తెలిపారు. గ్రామాన్ని ఖాళీ చేసినప్పటి నుంచి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రెయినేజీ, పాఠశాల భవనం వంటి కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం నిర్వాసితుల కోసం పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినా, అవసరమైన మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించలేదు. కొన్ని ఇళ్లకే తాగునీరు అందుతోంది. చాలా కుటుంబాలు బోరుమోటార్ల నీటిపైనే ఆధారపడుతు న్నాయి. మహిళలు నీటి కోసం అవస్థలు పడుతున్నారు అని సర్పంచ్ పేర్కొన్నారు.పునరావాస కేంద్రంలోని పాఠశాల భవనం నిర్మాణం అసంపూర్తిగా ఉండటం బాధాకరమని తెలిపారు. రెండంతస్తుల భవనానికి పిల్లర్లు నిర్మించి పనులు నిలిపివేశారు. చిన్నారులు తాత్కాలిక తడికెల మధ్య చదువుకోవాల్సి వస్తోంది. పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదు" అని విమర్శించారు. గ్రామంలోని అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, ప్రధాన రోడ్డును సీసీ రోడ్డుగా మార్చేందుకు నిధులు వచ్చినా పనులు ప్రారంభం కాలేదని ఆరోపించారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగు నీరు నిలిచిపోతూ కాలనీల్లో దుర్వాసన వ్యాపిస్తోందన్నారు. న్నారని చెప్పారు. గ్రామస్తులే చందాలు వేసుకుని ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించు కున్నారని గుర్తుచేశారు. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు చివరి వరకు పోరాడుతాను. అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తే చిన్నోనిపల్లె పునరావాస కేంద్రాన్ని అన్ని వసతులతో కూడిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం అని సర్పంచ్ యు దేవేందర్ స్పష్టం చేశారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇస్తామన్న పథకాలు ఎక్కడ..?

**జైలు జీవితం గడిపిన పట్టించుకోరా...!**

**నారాయణపేట మే 29 (వుదయం ప్రతినిధి)**



తెలంగాణ ఉద్యమకారులకు ఇస్తామన్న ప్రభుత్వ పథకాల లో ఏ ఒక్కటి కూడా అందలేదని తెలంగాణ ఉద్యమ సమయంలో జైలు జీవితం గడిపిన ప్రస్తుత ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా నేటికీ పట్టించుకోవడంలేదని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, ఉమ్మడి జిల్లా బిఎస్ఎన్ఎల్ మాజీ డైరెక్టర్ మన్నే బాబు ఆవేదన వ్యక్తం చేశారు.2001 నుండి తెలంగాణ రాష్ట్ర సాధనకై ఎన్నో పోరాటాలు,రాస్తారోకోలు, రైలు రోకోలు ,సకలజనుల సమ్మె సందర్భంగా నీళ్లు నిధులు నియామకాలు కొరకు ఎన్నో పోరాటాలు తెలంగాణ రాష్ట్రంలో నాలాంటి ఉద్యమకారులు చాలామంది తమ స్వరాష్ట్రం కొరకు ప్రాణత్యాగాన్ని వెనుకాడకుండగా ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. స్వరాష్ట్రమే మా ఊపిరిగా మా స్వప్నం మా ధ్యేయం తెలంగాణ రాష్ట్రం అంటూ ఎన్నో సందర్భాల్లో జిల్లా జైలు కూడా వెళ్లడం జరిగిందని అన్నారు. ఉద్యమకారులం మాపై కేసు అయితే ఏడు సంవత్సరాలు నారాయణపేట కోర్టుకు తిరగడం జరిగిందని తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఉద్యమకారులకు ఏ ఒక్క నాయకుడు కూడా సరియైన న్యాయము చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలక్షన్ సందర్భంగా ప్రతి ఉద్యమకారుడికి 200 గజాల స్థలం, ఇల్లు కట్టి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు అయి రెండున్నర సంవత్సరాలు గడిచిన ఇప్పటివరకు ఏ ఒక్క ఉద్యమకారుడికి ఒక్క ఇల్లు కానీ స్థలము కానీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల పై దయవుంచి గడిచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రకటించిన పథకాలను అందే విధంగా చర్యలు తీసుకోవాలని, జూన్ 2 వరకు జరిగే 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ వారోత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఉద్యమకారులకు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు బిఎస్ఎన్ఎల్ ఉమ్మడి జిల్లా మాజీ డైరెక్టర్ మన్నే బాబు కోరారు.

## ధర్మ దీక్ష ను విజయవంతం చేయండి

**తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎర్రం గురుమూర్తి**

**వెల్దండ (వు దయం )**



ఈనెల 2 న కల్వకుర్తి పట్టణంలో నీ ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిర్వహించే,ధర్మదీక్ష ను విజయవంతం చేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల రాష్ట్ర కన్వీనర్ ఎర్రం గురుమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు .ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యో గులకు ఇచ్చే బకాయిలను వెంటనే విడుదల చేయా లని డిమాండ్ చేశారు. పిఆర్సీ,డిఏ, ల బకాయిలను విడుదల చేయాలని కోరారు.రెండు లక్షల ఉద్యోగాల ను భర్తీ చేయాలి,ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను, ఆర్జి జెండర్లను, గ్రామపం చాయతీ మునిసిపాలిటీలో చేసే ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలి, రిటైర్ అయిన ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను నెరవే ర్చాలని 2 తేదీ ఎమ్మార్వో ఆఫీస్ వద్ద 24 గంటల ధర్మదీక్ష చేపడుతున్నారని తెలిపారు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## వనపర్తిలో అర్హు లందరికీ ఇందిరమ్మ ఇండ్లు: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హామీ



**వనపర్తి మే 29 (ఉదయం ప్రతినిధి)**

వనపర్తి నియోజకవర్గంలో ఒక్క పూరి గుడిసె లేకుండా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం వనపర్తి ఎమ్మెల్యే తూడి మెఘా రెడ్డి వనపర్తి నియోజకవర్గంలో ప్రతి ఆడపడుచుకు నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక దాచే లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మహిళా వారోత్సవాల కార్యక్రమంలో మహిళలకు బ్యాంకు లింకేజీ చెక్కుల పంపిణీ, ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమంలో శాసన సభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికై అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. డిసెంబర్ 7 2023న ప్రభుత్వం ఏర్పాటు అయినా వెంటనే మొదటగా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం చేసేందుకు మొదటి సంతకం చేసిందన్నారు. ఆర్టీసీలో మహిళలు ఉచిత ప్రయాణానికి ఒక్క వనపర్తి జిల్లాలోనే ఇప్పటివరకు 30.29 కోట్ల రూపాయలు ఆర్టీసీ యాజమాన్యానికి ప్రభుత్వం ధర చెల్లించడం జరిగింది అన్నారు. ప్రతి తెల్ల రేషన్ కార్డు పై ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తు జిల్లాలో రూ. 207 కోట్ల వ్యయంతో 500 పడకల ఆసుపత్రి మంజూరీ చేసినట్లు చెప్పారు. త్వరలోనే మహిళలకు సూపర్ మార్కెట్, రైస్ మిల్లు, గోదాములు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కోటి మంది మహిళలకు కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ పడుతుందని, మహిళలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యాపార వేత్తలుగా ఎదగాలను ఆకాంక్షించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు సైతం మాట్లాడారు. మహిళలు పెద్దమొత్తంలో పాల్గొన్నారు. అనంతరం శాసన సభ్యుల చేతుల మీదుగా మహిళా సంఘాల సభ్యులకు రూ. 3.40 కోట్ల బ్యాంక్ లింకేజ్ చెక్కును, మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.

## గీతంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ

**వృత్తి వికాస కార్యక్రమంలో శిక్షకులుగా ఐఐటీ, ఐఐఎస్సీ, బార్క్ నిపుణులు**

**పటాన్చెరు (వుదయం):**



సహజంగా భౌతికశాస్త్రం అంటే విద్యార్థులకు కొంచెం సంకోచం ఉంటుంది. ఆ భావనను పూర్తిగా మార్చివేసి, విద్యార్థుల మక్కువను చూరగొనే పాఠ్యాంశంగా దానిని మలచాలని హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సంకల్పించింది. దానికోసం, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని, భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అధునాతన భావనలు, బోధనా పద్ధతులు, విద్యా సాధనాలు' అనే అంశంపై భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజుల రెసిడెన్షియల్ వృత్తి వికాస కార్యక్రమాన్ని (ఆర్పీడీపీ) జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేట్ (ఐపీఏ) సహకారంతో, గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. భావనాత్మక అవగాహనను ప్రయోగాత్మక అభ్యాసం, సమకాలీన బోధనా పద్ధతులతో అనుసంధానించడం ద్వారా పాఠశాల, యూజీ స్థాయిలో భౌతికశాస్త్ర విద్యను బలోపేతం చేయడానికి దీనిని రూపొందించారు. తరగతి గదులలో శాస్త్రీయ జిజ్ఞాస, చురుకైన అభ్యాసం, భావనా స్పష్టత, ప్రత్యక్ష ప్రయోగాలను ప్రోత్సహించే వినూత్న బోధనా పద్ధతుల కోసం పెరుగుతున్న అవసరాన్ని తీర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యం.ప్రముఖ సంస్థల నుంచి విశిష్ట విద్యావేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులను ఒకచోట చేర్చి, ఇందులో పాల్గొనే వారికి భౌతికశాస్త్రంలోని అధునాతన భావనలు, ఆధునిక విద్యా సాధనాలు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రయోగాత్మక పద్ధతులు, అనుకరణలు, ఐసీటీ ఆధారిత బోధన, విద్యార్థి మూల్యాంకన వ్యూహాలపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తారు. గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు చెందిన అధ్యాపక బృందం బోధనా పద్ధతులు, అభ్యాసన సిద్ధాంతాలపై ప్రత్యేక సెషన్లను కూడా నిర్వహించి, ఈ కార్యక్రమాన్ని లక్ష్యాన్ని మరింత సుసంపన్నం చేయనుంది.ఈ మూడు రోజుల కార్యక్రమంలో విద్యుదయస్కాంత సిద్ధాంతం, ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్, సూపర్ కండక్టివిటీ, అయస్కాంతత్వం, అణు వికిరణం, ప్రయోగాత్మక ప్రదర్శనలు, స్వయంగా తయారు చేసుకునే భౌతిక శాస్త్ర కిట్లు, తరగతి గది బోధనా పద్ధతులు, అభ్యసన మూల్యాంకన పద్ధతులు వంటి అంశాలు ఉంటాయి.ఈ శిక్షణా కార్యక్రమంలో గీతం సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంత రామకృష్ణ; విశిష్ట విజిటింగ్ ఆచార్యుడు ప్రొఫెసర్ బి.వి.ఆర్. టాటా; ఐఐటీ మద్రాసు ఆచార్యుడు ప్రొఫెసర్ టి.ఎస్. నటరాజన్; బెంగళూరులోని ఐఐఎస్ సీకి చెందిన ప్రొఫెసర్ విబోర్ సింగ్ వంటి నిపుణులు పాల్గొంటారు. అలాగే గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ జి.రవి కుమార్; బాబా అణు శక్తి సంస్థ పూర్వ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి.ఎ. రామారావు; మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఆచార్యులు ప్రొఫెసర్ వనజ, ముంబైలోని టాటా ప్రాథమిక పరిశోధనా సంస్థ, హోమీ భాభా విద్యా సంస్థకు చెందిన ప్రొఫెసర్ దీపాచారి తదితరులు పాల్గొని, సదస్యులకు తగిన మార్గదర్శనం చేయనున్నారు.ఈ కార్యక్రమం పాఠశాల స్థాయి భౌతిక శాస్త్రం, విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుల కోసం ఉద్దేశించారు. భౌతికశాస్త్ర విద్యలో ఉత్తమ పద్ధతులు, వినూత్న విధానాలను పంచుకోవడానికి ఒక సహకార వేదికను సృష్టించడం దీని లక్ష్యం.ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జి.సాయిప్రీతి, డాక్టర్ టి.విశ్వం సమన్వయం చేస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్ల నమోదు, ఇతరత్రా వివరాల కోసం కార్యక్రమ సమన్వయకర్తలు షామాబీ (77802 74121) లేదా గోపీకృష్ణ (87120 18815) లను సంప్రదించవచ్చు.

## విత్తన దుకాణాలను పరిశీలించిన అధికారులు..



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం రెవెన్యూ,పోలీస్, అగ్రికల్చర్ శాఖ ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్,ఎస్ఐ రాజేష్,లు మాట్లాడుతూ.. మెదక్ జిల్లా కలెక్టర్ ఆర్డిఓ ఆదేశాల మేరకు రెవిన్యూ పోలీస్ అగ్రికల్చర్ శాఖల ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ కమిటీగా ఏర్పడి ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీలలో పలు రికార్డుల ను పరిశీలించి విత్తనాలను తనిఖీ చేశామన్నారు. ఈ వర్షాకాలం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విత్తనాలను అందించాలన్నారు. అలాగే నకిలీ విత్తనాలను అమ్మినట్లయితే పోలీస్ శాఖ లేదా టాస్క్ ఫోర్స్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, ఆర్ఐ ప్రీతి, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమ్య, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయండి: కలెక్టర్ కె. హైమావతి

**జిల్లాలో క్షేత్రస్థాయిలో గోదాములను పరిశీలించిన కలెక్టర్**
**మిల్లుల్లో స్థల కొరత తీర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**
**రైతుల పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం**

**సిద్దిపేట, మే 29 (వుదయం బ్యూరో)**



జిల్లాలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. శుక్రవారం ఆమె దౌల్తాబాద్, మిరుదొడ్డి, కొండపాక మండలాల్లోని పలు గోదాములను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతోందని, దీనిని మరింత వేగవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం శాయశక్తిలా కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం రైస్ మిల్లుల్లో స్థల కొరత కారణంగా దిగుమతి ప్రక్రియ కొంత ఆలస్యమవుతోందని, ఈ సమస్యను అధిగమించేందుకే స్థానికంగా అందుబాటులో ఉన్న పలు గోదాములను పరిశీలిస్తున్నట్లు ఆమె వివరించారు. ధాన్యాన్ని గోదాములోకి మార్చాలని డి.ఎం. మార్కెటింగ్ నాగరాజును ఫోన్ ద్వారా కలెక్టర్ ఆదేశించారు. ఈ గోదాం మొత్తం వరి ధాన్యం దిగుమతికి అనుకూ సెంటర్ల నుండి వచ్చే వరి ధాన్యాన్ని అక్కడ దిగుమతి చేయించాలని తహసిల్దార్ మల్లికార్జున్‌ను ఆదేశించారు.అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, రైతులకు ఇబ్బంది లేకుండా చూసేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు పండించిన ధాన్యంలో చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి స్పష్టం చేశారు.

## కర్ణాటక కాబోయే సీఎం డీకే శివకుమార్ ముందున్న సవాళ్లేమిటి.....?

**రెండేళ్లలో చరిత్ర తిరగరాయగలరా?**
**సిద్ధరామయ్య తనయుడికి డిప్యూటీ సీఎం!**
**జూన్ 1న డీకే ప్రమాణస్వీకారం..**

**వికారాబాద్ మే 29 (వుదయం బ్యూరో)**



కర్ణాటక రాజకీయాలు ఒక చరిత్రాత్మక మలుపు తిరిగాయి. అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో ముఖ్యమంత్రిని మార్చాలని కాంగ్రెస్ హైకమాండ్ తీసుకున్న కీలక నిర్ణయం మేరకు సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. దీంతో కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. మరో రెండేళ్లలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ టర్మ్ మధ్యలో జరిగిన నాయకత్వ మార్పు పార్టీకి ఎంతవరకు లాభిస్తుందనేది రాబోయే ఎన్నికల తీర్పే తేల్చనుంది.40 ఏళ్ల సెంటిమెంట్‌ను బద్దలు కొట్టగలరా?కర్ణాటక ఎన్నికల చరిత్రలో గత నాలుగు దశాబ్దాలుగా (40 ఏళ్లుగా) ఏ అధికార పార్టీ కూడా వరుసగా రెండోసారి అధికారంలోకి రాలేకపోయింది. గతంలో 2013 నుంచి 2018 వరకు ఐదేళ్ల పూర్తి కాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, సిద్ధరామయ్య తదుపరి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఒంటరిగా మెజారిటీతో గెలిపించలేకపోయారు. ఇప్పుడు డీకే శివకుమార్ చేతిలో కేవలం రెండేళ్ల ఒక 'ఫైటర్'గా ఒకరు. ఆయనకు బెంగళూరు, ఢిల్లీతో సహా చాలా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భూములు, ఫ్లాట్లు, వాణిజ్య భవనాలు (కమర్షియల్ ప్రాపర్టీలు) ఉన్నాయి. సుమారు రూ.900 కోట్ల విలువైన 'గ్లోబల్ మాల్' ఆయనదేననే ప్రచారం ఉంది. వివిధ కార్పొరేట్ కంపెనీల్లో కోట్ల రూపాయల షేర్లు, స్టాక్ మార్కెట్ పెట్టుబడులు ఆయనకు ఉన్నాయి. తన భార్య పేరు మీద కూడా కోట్ల విలువ చేసే వ్యవసాయ భూములు ఉన్నాయి. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు డీకే శివకుమారే సీఎం అవుతారనే ప్రచారం జరిగింది. కానీ ఓబీసీ నేత అయిన సిద్ధరామయ్య.. పావులు కదిపి.. సీఎం సీటును సొంతం చేసుకున్నారు. అప్పట్లో రెండున్నరేళ్లపాటూ ఆయన.. మరో రెండున్నరేళ్లపాటూ డీకే ఆ పదవిలో ఉండేలా అనధికారిక డీల్ కుదిరినట్లు సమాచారం. ఐతే.. తన పదవీకాలం పూర్తైనా.. సిద్ధరామయ్య.. సీటును వదల్లేదు. దాంతో.. హైకమాండ్ స్థాయిలో డీకే.. పావులు కదిపారు. ఢిల్లీ సమావేశంలో ఖర్గే, రాహుల్ గాంధీలతో చర్చలు జరిగాయి. శివకుమార్.. ఒక్కలింగ సమాజానికి చెందినవారు. కర్ణాటకలో పార్టీని ఒంటిచేత్తో గెలిపించారు. అందువల్ల సీఎం అయ్యేందుకు ఆయనకు పూర్తి అర్హతలున్నాయి. 2028 ఎన్నికలకు కొత్త ముఖంతో ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తోంది. సాధారంగా కర్ణాటకలో ఒక్కలింగ కమ్యూనిటీకి చెందిన నేత ఎవరు ఉంటే.. వారు సీఎం అయ్యే అవకాశాలు ఎక్కువ. అందుకే హైకమాండ్.. ఇప్పటి వరకూ ఓబీసీ నేతకు ఛాన్స్ ఇచ్చి.. ఇకపై శివకుమార్‌కి ఛాన్స్ ఇస్తోంది. తద్వారా నెక్స్ట్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కలింగ కమ్యూనిటీ ఓట్లను కొల్లగొట్టేందుకు రెడీ అవుతోంది. అదే సమయంలో సిద్ధరామయ్యకు ఇప్పటివరకూ ఛాన్స్ ఇవ్వడం ద్వారా.. బీసీలు, ఓబీసీలు, పేదలు కూడా తమవైపే ఉంటారని వ్యూహం రచించింది.

## నూతన ప్రభుత్వ పాఠశాల భవనానికి శంకుస్థాపన

**మహబూబ్ నగర్ మే 29 (వుదయం ప్రతినిధి)**



జడ్చర్ల మండల పరిధిలోని బాదేపల్లి పాతబజార్ హరిజనవాడలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శుక్రవారం భూమిపూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ పాఠశాల భవన సమస్యను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అనంతరం అరబిందో ఫార్మా యాజమాన్యంతో నిరంతరం చర్చలు జరిపి, వారి సామాజిక బాధ్యత సిఎస్ఆర్ నిధుల కింద నూతన పాఠశాల భవన నిర్మాణానికి ముందుకు తీసుకువచ్చినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రతి కార్పొరేట్ సంస్థ తమ లాభాల్లో రెండు శాతం నిధులను సామాజిక బాధ్యత కింద సమాజ శ్రేయస్సు కోసం ఖర్చు చేయాల్సి ఉంటుందని కలెక్టర్ గుర్తు చేశారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఈ నిధులను వినియోగిస్తే సమాజానికి మరింత మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న అరబిందో ఫార్మా సంస్థ యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని ఇందులో భాగంగానే బాదేపల్లిలో రూ.80 లక్షల వ్యయంతో నూతన పాఠశాల భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆమోదంతో పాత భవనాన్ని తొలగించి కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా ఉరుకొండ మండలం గుడిగానిపల్లిలో రూ.1.20 కోట్ల వ్యయంతో మరో నూతన పాఠశాల భవన నిర్మాణానికి కూడా అరబిందో ఫార్మా సంస్థ ముందుకు వచ్చిందని తెలిపారు. రాబోయే రోజుల్లో అమ్నియల్, హెటరో ఫార్మా సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే భవిష్యత్తులో వారు కూడా ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించగలరని విశ్వాసం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, మండల విద్యాధికారి మంజులాదేవి, అరబిందో ఫార్మా కంపెనీ డి.జి .ఎం జనార్ధన్ రెడ్డి ,అరబిందో ఫార్మా ఏ.జి.యం.(సి.ఎస్.ఆర్) ఆరుట్ల నరసింహా రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సోషల్ స్టడీస్‌లో సంచలన ప్రతిభ.. విద్యార్థిని ఘనంగా సన్మానం



రాయపర్తి మే 29( వుదయం ప్రతినిధి): మండలం కొండూరు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల కు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థి చెట్టే చరణ్ సోషల్ స్టడీస్ విషయంలో 100కి 98 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో మూడో స్థానం సాధించిన చరణ్ ను సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడు, ఏ ఎం ఓ సుచంత్ తేజ డీఎస్ఓ శ్రీనివాస్ ల చేతుల మీదుగా సర్టిఫికెట్ మెమొంట్ ,శాలువాతో ఘనంగా సన్మానించారు .

ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థిని కృషి, పట్టుదల , ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాన్ని సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ తమ కుమారుడు మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు, సహ విద్యార్థులు కూడా విద్యార్థినికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన విజయాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సోషల్ స్టడీస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు తాటిపాముల రమేష్ ,కార్యదర్శి రవి, కేసోజు సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే పద్మలత , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత



మహాదేవపూర్ మే 29(వుదయం ప్రతినిధి) పలిమెల మండలంలోని తిమ్మేటిగూడెం గ్రామానికి చెందిన పోడెం బ్రహ్మేశ్వర్ పది రోజుల క్రితం తన మొబైల్ ఫోన్ ను పోగొట్టుకొని, పలిమెల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఫిర్యాదు స్వీకరించిన పలిమెల ఎస్సై జె. రమేష్ సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ బ్లాక్ చేసి శుక్రవారం సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ని ట్రేస్ చేసి కనుగొన్నారు. ఆ మొబైల్ ఫోనును పోగొట్టుకున్న పోడెం బ్రహ్మేశ్వర్ కు పలిమెల పోలీస్ వారి చేతుల మీదుగా అంద చేయడం జరిగింది. మండలంలో ఎవరైనా వ్యక్తులు మొబైలు పోగొట్టుకున్నట్లయితే వెంటనే ఫిర్యాదు చేసినట్లు అయితే వీలైనంత త్వరగా మొబైల్ ను కనుగొనవచ్చు అని పలిమెల ఎస్సై జె. రమేష్ తెలిపారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా రైస్ మిల్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలి

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



జయశంకర్ భూపాలపల్లి మే 29(వుదయం జిల్లా ప్రతినిధి) రైతులకు ఇబ్బందులు కలగకుండా రైస్ మిల్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలి అని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశించారు శుక్రవారం రైతు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ కుమార్‌లతో కలిసి భూపాలపల్లి జిల్లా గోర్లవీడు గ్రామంలోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును పరిశీలించారు మిల్లులో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజుకు ఎంత మేర వడ్లు స్వీకరిస్తున్నారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రైతుల నుండి సాధ్యమైనంత ఎక్కువ వడ్లను పారదర్శకంగా కొనుగోలు చేయాలని సూచించడం జరిగింది.

అలాగే రానున్న రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున వడ్ల లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రోజువారీ వడ్ల కొనుగోలు, ఎగుమతులపై నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు.

# తీవ్ర ఎండలకు వృద్ధురాలు అమృత బలి!



హనుమకొండ టౌన్, మే 29 (వుదయం ప్రతినిధి) : నగరంలో భానుడి భగభగలకు ఓ వృద్ధురాలు వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన హనుమకొండ బస్టాండ్ సమీపంలోని 7వ డివిజన్ లక్ష్మీపురం ప్రాంతంలో చోటుచేసుకుంది.

?కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన జనగాని అమృత (76) అనే వృద్ధురాలు గురువారం సాయంత్రం ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతల తీవ్రతకు తట్టుకోలేక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వడదెబ్బ తగలడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

?అమృత హఠాన్మరణంతో లక్ష్మీపురం కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆమె మృతి పట్ల పలువురు స్థానికులు, కాలనీవాసులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన వృద్ధురాలు వడదెబ్బతో మరణించడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పేద కుటుంబాలకు అండగా ఎస్ ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పేరూపాటి శ్రీనివాస్ రెడ్డి



రాయపర్తి మే 29 (వుదయం ప్రతినిధి): నిరుపేద కుటుంబాలకు ఎప్పుడు అండగా నిలుస్తూ ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పేరపాటు శ్రీనివాస్ రెడ్డి తన సేవ మనసు చాటుకున్నారు. శనివారం మండలంలోని తిట్టేకుంటతండా గ్రామంలోబిఆర్ఎస్ పార్టీ నాయకులు భూక్య శ్రీనివాస్ భార్య సునీత ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని వారికి నిత్యవసర సరుకులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఎవరు ఆకలితో లేదా ఇబ్బందులతో ఉండకూడదనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు లేతాకుల రంగారెడ్డి స్థానిక సర్పంచ్ ఇస్లావత్ సంతోష్ నాయక్, నాయకులు బాలాజీ యాకోబు నరసింహ గిరి దుగ్గ మంజి రమేష్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

**కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**ఉపాధి కూలీల వసతులపై కలెక్టర్ ఆరా.. అధికారులకు అభినందనలు**

కమలాపూర్/?హనుమకొండ, మే 29 (వుదయం ప్రతినిధి) : రెండు పడక గదుల (డబుల్ బెడ్‌రూమ్) ఇళ్ల సముదాయాల్లో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను తక్షణవే కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమలాపూర్ మండలం గూడూరు, కమలాపూర్ గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇళ్లకు సంబంధించిన పెండింగ్ పనులను, మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్, డిఆర్డీఓ మేన శ్రీను, ఎంపీడీవో బాబు, తహసీల్దార్ సురేష్ కుమార్, స్థానిక సర్పంచ్‌లు వనజ, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం



ఉప్పల్ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో కూలీలతో నేరుగా మాట్లాడి.. వారికి అందుతున్న తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల వంటి సౌకర్యాలపై ఆరా తీశారు. మహిళా కూలీల స్వయం సహాయక సంఘాల రుణాలు, హాజరు నమోదు (ఫొటోలు దిగే సమయం) లో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.?పనులకు 480 మంది కూలీలు హాజరుకావడం, అక్కడ కల్పించిన వసతుల పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి పనులను వేగంగా నిర్వహిస్తున్న డిఆర్డిఓ మేన శ్రీను, ఎంపీడీవో గుండె బాబు, ఈజీఎస్ సిబ్బందిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమా, తహసిల్దార్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఊర చెరువు పూడికతీత పనులకు శంకుస్థాపన

హనుమకొండ టౌన్, మే 29 (వుదయం ప్రతినిధి) : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ గోపాలపూర్ ఊర చెరువులో సుమారు రూ. 1 కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న పూడికతీత పనులకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్థానిక శాసన సభ్యులు కె.ఆర్. నాగరాజు హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు చెరువుల నిల్వ సామర్థ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో గోపాలపూర్ పరిసర ప్రాంతాల్లో తరచూ ఎదురయ్యే వరద ముంపు సమస్యలను తగ్గించడంలో ఈ పూడికతీత పనులు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల విజయవంతానికి ప్రజల సహకారం అవఠరమని, చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికురాలికి పట్టుచీర అందజేత



నర్సంపేట వుదయం ప్రతినిధి మే 29: ఆర్టీసీ నర్సంపేట డిపో కండక్టర్ డాక్టర్ గొలనకొండ వేణు కుటుంబం సేవా దృక్పథంతో మరోసారి ఆదర్శంగా నిలిచింది. కుమార్తె సహస్ర పుట్టినరోజు సందర్భంగా గురిజాల గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు దౌడు పద్మకు పట్టుచీర అందజేశారు. గ్రామ పరిశుభ్రత కోసం శ్రమించే కార్మికుల సేవలను గౌరవిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వేణు తెలిపారు. గత ఏడాది నుంచి పిల్లల పుట్టినరోజులను సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నామని చెప్పారు. పట్టుచీర అందుకున్న పద్మ ఆనందం వ్యక్తం చేస్తూ చిన్నారి సహస్రకు ఆశీర్వాదాలు అందించారు. గొలనకొండ కుటుంబ సేవా కార్యక్రమాలను స్థానికులు అభినందించారు.

# బంగారు బాల్యానికి వెయ్యి మెట్లు



వరంగల్ జిల్లా నర్సంపేట వుదయం ప్రతినిధి మే 29.ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నర్సంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నర్సంపేట ప్రాజెక్టు సి డి పి ఓ మధురిమ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మహిళా భద్రత వారోత్సవాలలో భాగంగా “బంగారు బాల్యానికి 1000 మెట్లు” కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉంటూ ఐసిడిఎస్ మరియు వైద్యశాఖలు రెండు కళ్లు లాగా పనిచేస్తున్నాయని అన్నారు. తల్లి బిడ్డల సంక్షేమం కోసం ప్రతి కుటుంబంలో భాగస్వాములై సేవలు అందించాలని సూచించారు. రెండు శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. డాక్టర్ శ్రావణ్ మాట్లాడుతూ ప్రతి బిడ్డ ఎదుగుదలలో ఏవైనా సమస్యలు లేదా అపోహలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందేలా అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. సిడిపిఓ మధురిమ మాట్లాడుతూ మహిళా భద్రత వారోత్సవాలలో భాగంగా “బంగారు బాల్యానికి 1000 మెట్లు” అంశంపై సమావేశం నిర్వహించామని తెలిపారు. గర్భిణిగా నమోదు అయినప్పటి నుంచి తల్లి ఆరోగ్యం, బిడ్డ ఎదుగుదలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి తల్లి అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల భోజన సమయంలో ఫోన్, టీవీ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అమ్మమ్మ, నానమ్మ ఒడి నుంచి పిల్లలు దూరమవుతున్న పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు అమ్మఒడితో సమానమని అన్నారు. ఐసిడిఎస్ మరియు హెల్త్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో పిల్లలకు పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఏసీడిపిఓ జ్యోతి మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో శ్రీనివాస్, డాక్టర్ శ్రావణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తల్లీ బిడ్డల సంక్షేమం కోసం అన్ని శాఖలు కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు అరుణ, పారిజాతం, ఝాన్సీరాణి, ఏ ఎన్ ఎం లు కవిత, రాజమణి, రాధ, బి. శిరీష, డి. రమాదేవి, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాచనపల్లి అమరుల త్యాగం వృధా కానివ్వం

**-సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శి సూర్యం**



కొత్తగూడ మే 29(వుదయం ప్రతినిధి ):కాచనపల్లి అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయ సాధనకై పోరాడాలని సిపిఐ(ఎం.ఎల్ )న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సూర్యం పిలుపునిచ్చారు. శుక్రవారం ?కొత్తగూడ మండల కేంద్రంలోని స్థానిక సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ పాలడుగు కృష్ణ స్మారక భవనంలో కాచనపల్లి అమరవీరులను స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాచనపల్లి అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి, విప్లవ జోహార్లు అర్పిస్తూ ఘనంగా నివాళులర్పించారు.?ఈ సందర్భంగా సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం కాచనపల్లి అమరవీరులు చేసిన పోరాటాలు, త్యాగాలు వృధా కానివ్వబోము అని నాటి పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.?”అమరవీరుల ఆశయాలను గుండెల్లో నింపుకొని, వారు చూపిన బాటలో నడుస్తూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే మనం వారికిచ్చే నిజమైన నివాళి అని అన్నారు.? ప్రస్తుత ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఆదివాసి హక్కులను చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని దీంతో ఆదివాసీలు పూర్తిగా నష్టపోతున్నారని అన్నారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, అదేవిధంగా ఏజెన్సీ మండలాలైన కొత్తగూడ గంగారం మండలాల ప్రజలకు సాగునీరు అందించాలని కోరారు. ఆదివాసీల హక్కుల రక్షణకై, పోడు భూముల సాధనకై ఎందరో అమరవీరులు తమ రక్తాన్ని చిందించి నేలకొరిగారని ఆ అమరుల స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బుర్కా వెంకటయ్య,మండల ప్రధాన కార్యదర్శి బూర్కాబుచ్చి రాములు,పి వై ఎల్ మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్, జామ్లా, పూర్ణ చందర్, రాజా,బాబీ,గట్టి సతీష్,నగేష్,సదయ్య, సుదర్శన్,నిర్మల,రమ తదితరులు పాల్గొన్నారు.



# కష్టకాలంలో సహాయం అందించి మానవత్వం చాటిన గ్రామ సర్పంచ్...

రాయపర్తి మే 29 (వుదయం ప్రతినిధి): మండలం కాట్రపల్లి గ్రామంలో ఆపదలో ఉన్న బాధిత కుటుంబానికి స్థానిక సర్పంచ్ రాపాక పద్మ అండగా నిలిచి మానవత్వాన్ని చాటారు. కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న సర్పంచ్ వెంటనే స్పందించి ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు ఎలాంటి కష్టాలు వచ్చినా తాను ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, తమ కష్టసమయంలో తోడుగా నిలవడం ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తాటి వనాన్ని దగ్ధం చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

**మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్.**



నర్సంపేట వుదయం ప్రతినిధి మే 29.

నర్సంపేట డివిజన్ చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామంలో తాటి చెట్లను కావాలనే దగ్ధం చేసిన కడగండ్ల పెద్ద యాకయ్యపై కేసు నమోదు చేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాలిపోయిన తాటి వనాన్ని గౌడ కులస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తాటి, ఈత చెట్లను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూస్వాములు నరికి వేయడం, దగ్ధం చేయడం జరుగుతోందన్నారు. లింగగిరిలో 20 తాటి చెట్లు కాలిపోవడంతో వాటిపై ఆధారపడి జీవించే గీత కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులకు, ఆబ్కారీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎండ నుంచి రక్షణ పొందేలా..



ఎండలు మండిపోతున్నాయి.. వేడి, ఉక్కపోతతో సతమతమవుతున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో బయటికి వెళ్లినప్పుడు ఎండ తీవ్రత చర్మంపై పడకుండా సన్‌స్క్రీన్ లోషన్లు రాసుకోవడం మనకు అలవాటే! అయితే ఇదొక్కటే కాదు.. అతినీలలోహిత కిరణాల ప్రభావం చర్మంపై పడకుండా ఉండాలంటే వేసుకునే దుస్తులు కూడా ముఖ్యమేనంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో సరైన ఫ్యాబ్రిక్, ఎంచుకునే రంగులు.. రెండింటినీ పరిగణనలోకి తీసుకోవాలని చెబుతున్నారు. మరి, ఎండ నుంచి రక్షణ పొందాలంటే ఎలాంటి దుస్తులు ధరించాలో తెలుసుకుందాం రండి.. సూర్యకాంతి నుంచి వెలువడే అతినీల లోహిత కిరణాలు చర్మంపై ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. ఫలితంగా చర్మం కందిపోవడం, నల్ల మచ్చలు, ముడతలు.. వంటివి వచ్చే ప్రమాదం ఎక్కువంటున్నారు. అందుకే వీటన్నింటి నుంచి రక్షణ పొందాలంటే సరైన దుస్తులు ధరించడం ముఖ్యమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో అతినీల లోహిత కిరణాల నుంచి రక్షణనిచ్చే 'యూపీఎఫ్ క్లాతింగ్'ని ఎంచుకోవాలని సూచిస్తున్నారు. అంటే మనం ఎలాగైతే.. ఎండ నుంచి రక్షణ పొందడానికి SPF 30+ రేటింగ్ ఉన్న సన్‌స్క్రీన్ లోషన్లు ఎంచుకుంటామో.. అదే విధంగా యూపీఎఫ్ 50+ రేటింగ్ ఉన్న ఫ్యాబ్రిక్స్ ధరించాల్సి ఉంటుంది. ఈ తరహా దుస్తులు మార్కెట్లో దొరుకుతాయి. ఇవి 98 శాతం అతినీలలోహిత కిరణాలు చర్మానికి తాకకుండా అడ్డుకుంటాయని పలు అధ్యయనాల్లో తేలింది. సింథటిక్ మైక్రో పాలియెస్టర్, నైలాన్, వెదురు, కాటన్, లినెన్.. వంటి ఫ్యాబ్రిక్స్‌తో ఇవి తయారవుతాయట! అలాగే వీటిలోనూ అతినీల లోహిత కిరణాల్ని బ్లాక్ చేసే డై లతోనూ రంగులద్దినవి దొరుకుతాయట!

కాబట్టి ఎక్కువగా ఎండలో గడిపే వారు ఈ తరహా దుస్తుల్ని ఎంచుకుంటే ఎండ నుంచి రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. ఎండ, అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ పొందాలంటే.. మనం డ్రస్సింగ్ చేసుకొనే క్రమంలోనూ పలు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఉక్కపోతగా ఉందని పల్చటి దుస్తులు ధరిస్తుంటారు కొందరు.. అలాగే పైనుంచి ధరించే జాకెట్స్‌నీ దూరం పెడుతుంటారు. నిజానికి అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ పొందాలంటే కాస్త మందంగా ఉన్న దుస్తులు ధరించడం, శరీరమంతా కవరయ్యేలా పొడవాటి డ్రస్సులు ఎంచుకోవడం, అవసరమైతే చేతులు పూర్తిగా కవరయ్యేలా పొడవాటి చేతులున్న జాకెట్ వేసుకోవడం, హై-కాలర్ డ్రస్సులు.. వంటివి ఎంచుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. ఓవర్‌సైజ్‌డ్.. ఇప్పుడిదే ట్రెండ్. కాబట్టి మీరు స్లీవ్‌లెస్ వేసుకున్నా.. పైనుంచి ఓవర్‌సైజ్‌డ్ షర్ట్స్, ష్రగ్స్.. వంటివి జతచేస్తే ఎండ నుంచి రక్షణ పొందచ్చు.. అలాగే శరీరానికి గాలి కూడా తగులుతుంది. కొంతమంది పాత బడిన, రంగు వెలిసిపోయిన దుస్తుల్ని పదే పదే ధరిస్తుంటారు. అయితే వీటిని పక్కన పెట్టేయమంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఎక్కువ సార్లు ధరించడం వల్ల వీటి నాణ్యత తగ్గిపోతుందని, తద్వారా అతినీలలోహిత కిరణాల్ని పరివర్తనం చేయలేవని చెబుతున్నారు. అతినీల లోహిత కిరణాలు చర్మంపై పడకుండా చేయడంలో దుస్తుల రంగులు కూడా కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు నిపుణులు. అయితే చాలామంది ముదురు రంగు దుస్తులు ఎండను గ్రహించి చర్మానికి చేటు చేస్తాయనుకుంటారు. కానీ ముదురు రంగుల వల్లే ఎండ నుంచి రక్షణ పొందచ్చంటున్నారు.

# పనీర్ రుచికే కాదు.. ఆరోగ్యానికీ!



పాలకు సంబంధించిన పదార్థాల్లో పనీర్‌ది ప్రత్యేక స్థానం. వీటితో చేసే కూరలు, స్వీట్లను చాలామంది ఇష్టపడి తింటుంటారు. ఇందులో పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయంటున్నారు నిపుణులు. ఈక్రమంలో పనీర్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం రండి..

పనీర్‌లో మంచి కొవ్వులు, ప్రొటీన్లు సమృద్ధిగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎక్కువసేపు అలసట లేకుండా పని చేయచ్చుట.

క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం.. తదితర పోషకాలు కూడా అధికంగా ఉంటాయి. ఇవి వివిధ అనారోగ్య సమస్యల నుంచి రక్షణ అందిస్తాయి. ఆకలిని అదుపులో ఉంచుకోవాలంటే పనీర్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతుంటారు.

# తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నారా.. నిర్లక్ష్యం వద్దు!

గతంలో జరిగిన భయంకరమైన సంఘటనలు పదే పదే గుర్తొస్తున్నాయా? మీపై మీకున్న నమ్మకం కోల్పోయి ప్రతికూల ఆలోచనలు మీ మనసును తొలిచేస్తున్నాయా? వీటితో పాటు అలసట, నీరసం.. వంటివీ మిమ్మల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయా? అయినా కాస్త ఒత్తిడికి గురైనప్పుడు ఇలాంటి సమస్యలు సహజమే నంటూ వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారా? అదిగో అలాంటి అలక్ష్యమే తగదంటున్నారు నిపుణులు. ఎందుకంటే దీన్నే మానసికంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న స్థితి (మెంటల్ బ్రేక్‌డౌన్ లేదా నెర్వస్ బ్రేక్‌డౌన్)గా పేర్కొంటున్నారు. సరైన సమయంలో దీన్ని గుర్తించి చికిత్స తీసుకోకపోతే మానసిక ఆరోగ్యం మరింత దిగజారే ప్రమాదం ఉందంటున్నారు.

మానసికంగా మనం ఎదుర్కొనే తీవ్రమైన ఒత్తిడిని కొన్ని లక్షణాలతో గుర్తించచ్చని చెబుతున్నారు నిపుణులు. బీపీ పెరిగి విపరీతమైన కోపం రావడం..

మనపై మనం నమ్మకం కోల్పోవడం. ప్రతికూల ఆలోచనలతో రాత్రుళ్లు నిద్ర పట్టకపోవడం.. తద్వారా ఇది క్రమంగా నిద్రలేమికి దారితీస్తుంది. విపరీతమైన అలసట, ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం. ఏదైనా విషయం జరగకపోయినా జరుగుతుందేమోనని భ్రమపడడం. ఉన్నట్లుండి ఒక్కసారిగా భయంతో ఉలిక్కిపడడం. గతంలో జరిగిన భయంకరమైన సంఘటనలు పదే పదే గుర్తుకు రావడం..

నలుగురిలోకి వెళ్లడానికి ఆసక్తి చూపకపోవడం.. ఎక్కువ సమయం ఒంటరిగానే గడపాలనిపించడం.. ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం.. మొదలైనవి.




ఇలా మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామంటే మన చుట్టూ ఉన్న వాతావరణం, వ్యక్తులతో పాటు ఈ అంశాలు కూడా కారణం కావచ్చంటున్నారు నిపుణులు. నిరంతరాయంగా పనిలో కలిగే ఒత్తిడి ఇలాంటి మానసిక స్థితికి కారణమవుతుందంటున్నారు నిపుణులు. అలాగే కొంతమంది ఉద్యోగమైనా, ఇతర పనైనా తప్పని పరిస్థితుల్లో చేస్తుంటారు. అలాంటి వారు అయిష్టంగానే ఆ పనిని పూర్తిచేస్తుంటారు. ఈ క్రమంలో రోజూ ఎదుర్కొనే ఒత్తిడి వల్ల కూడా ఈ స్థితి రావచ్చంటున్నారు నిపుణులు.

బాగా ఇష్టమైన కుటుంబ సభ్యుల్ని కోల్పోవడం/దూరమవడం, అలాగే ఆర్థిక స్థితి బాగోలేక పదే పదే డబ్బు గురించే మథనపడడం కూడా ఈ తీవ్రమైన మానసిక ఒత్తిడికి ఓ కారణంగా చెప్పుకోవచ్చు. దీర్ఘకాలం పాటు నిద్ర సరిగ్గా లేకపోవడం, విశ్రాంతి తీసుకోవడానికీ సమయం దొరక్కపోవడం, దీర్ఘకాలిక అనారోగ్యాలు.. వంటివి కూడా మానసికంగా దెబ్బతీసేందుకు ప్రధాన కారణాలంటున్నారు నిపుణులు. ఈ తీవ్రమైన మానసిక స్థితిని గుర్తించిన వెంటనే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.. అన్నింటికంటే ముందుగా డాక్టర్ సలహా మేరకు పూర్తి బాడీ చెకప్ చేయించుకోవాలి. తద్వారా మీ మానసిక స్థితి మీ శరీరంపై ఎలాంటి ప్రభావం చూపుతోందో తెలుసుకోవచ్చు. ఇక ఈ మానసిక స్థితి నుంచి బయటపడేందుకు టాక్ థెరపీ/కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ.. వంటివి ఉపయోగపడతాయి. ఈ మానసిక స్థితి లక్షణాలను ఎదుర్కోవడానికి డాక్టర్ సలహా మేరకు యాంటీ డిప్రెసెంట్, యాంటీ యాంగ్జైటీ మందులు వాడచ్చు.

# చక్కని ఆరోగ్యం

# జుట్టు రాలకుండా ఉండాలంటే..!

ఒత్తైన, నల్లని కురులు సొంతం చేసుకోవాలని ప్రతి అమ్మాయి ఆరాటపడుతుంది. అయితే మనం రోజూ చేసే కొన్ని పనుల వల్ల మనకు తెలియకుండానే కేశాలకు హాని కలుగుతుంది. ఫలితంగా జుట్టు రాలడం, చివర్లు చిట్లడం, నిర్జీవంగా మారడం.. వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. మరి, ఆ పొరపాట్లేంటో తెలుసుకుని సరిదిద్దుకుంటే కురులను చక్కగా సంరక్షించుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

కొంతమంది తలస్నానం చేసిన తర్వాత జుట్టు తడిగా ఉండగానే చిక్కు తీసుకుంటూ ఉంటారు. అయితే కేశాలు తడిగా ఉన్నప్పుడు కుదుళ్లు కాస్త బలహీనంగా ఉంటాయి. ఇలాంటి సమయంలో దువ్వుకోవడం వల్ల జుట్టు ఊడిపోవడం లేదా బలహీనపడి రాలిపోవడం జరుగుతుంది. కాబట్టి తడిగా ఉన్న జుట్టుని దువ్వుకోకూడదు. పొడిగా ఆరాకే ఎలాంటి హెయిర్‌స్టైల్‌నైనా ప్రయత్నించడం



ఉత్తమం. తడిగా ఉన్న జుట్టుని ఆరబెట్టుకోవడానికి డ్రయర్, ఉంగరాల జుట్టు కోసం కర్లర్, స్ట్రెయిట్‌నర్.. ఇలా ఒకటేమిటి.. కేశాలంకరణలో భాగంగా మనం ఉపయోగించే ఎలక్ట్రానిక్ వస్తువులెన్నో! అయితే వీటిని ఎంత తక్కువగా వాడితే జుట్టుకు అంత మంచిదంటున్నారు నిపుణులు. ఎందుకంటే వీటి నుంచి ఉత్పత్తయ్యే వేడికి కురులు నిర్జీవంగా మారడం, చివర్లు చిట్లిపోవడం, పొడిబారిపోవడం.. ఇలా వివిధ రకాల సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి మరీ అవసరమైతే తప్ప వీటిని వాడకపోవడం మంచిది. అలాగే చిట్లిన చివర్లను నిర్ణీత వ్యవధుల్లో ట్రిమ్మింగ్ చేసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

# వేసవిలో తలనొప్పి సమస్య రోజు రోజుకీ ఎక్కువవుతుందా..

వేసవి వేడి రోజురోజుకీ పెరుగుతున్న కొద్దీ మైగ్రేన్ సమస్యతో బాధపడేవారిలో తలనొప్పి ఎక్కువవుతోంది. అధిక ఉష్ణోగ్రతలు, డీహైడ్రేషన్, ఎండలో ఎక్కువసేపు తిరగడం, నిద్రలేమి వంటి



కారణాలు మైగ్రేన్‌ను మరింత తీవ్రమయ్యేలా చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే కొన్ని సాధారణ జీవనశైలి మార్పులు, ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు పాటించడం ద్వారా మైగ్రేన్ దాడులను కొంతవరకు నియంత్రించవచ్చని సూచిస్తున్నారు. వేసవిలో మైగ్రేన్‌కు ప్రధాన కారణాలుగా భోజనం మానేయడం, సరైన నిద్ర లేకపోవడం, అధిక ఒత్తిడి, రాత్రివేళల్లో ఎక్కువసేపు మొబైల్ లేదా కంప్యూటర్ స్క్రీన్ చూడడం, ఎండలో ప్రయాణాలు చేయడం, ప్రాసెస్డ్, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వంటి అంశాలు ఉంటున్నాయి. కొంతమందిలో చాక్లెట్, చీజ్ వంటి ఆహారాలు కూడా ట్రిగ్గర్‌గా పనిచేస్తాయని చెబుతున్నారు. మైగ్రేన్ బాధితులు భోజన సమయాలను కచ్చితంగా పాటించడం చాలా ముఖ్యం. అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం ఒకే సమయాల్లో తీసుకోవడం మంచిది. భోజనం మానేయడం వల్ల తలనొప్పి ముదిరే అవకాశముంటుంది. శరీరంలో నీటి లోపం లేకుండా చూసుకోవడం కూడా అత్యంత అవసరం. రోజుకు కనీసం రెండు నుంచి మూడు లీటర్ల నీరు తాగాలి. గుండె లేదా కిడ్నీ సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు నీటి పరిమాణాన్ని నిర్ణయించుకోవాలి. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం మైగ్రేన్ నియంత్రణలో సహాయపడుతుంది. టోఫు, పనీర్, క్వినోవా, బాదం, పప్పులు, గుడ్లు, శనగలు, గ్రీక్ యోగర్ట్ వంటి పదార్థాలను ఆహారంలో చేర్చాలి. సాచ్యురేటెడ్, ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉండే ప్రాసెస్డ్, ప్యాకేజ్డ్, డీప్ ఫ్రైడ్ ఫుడ్స్‌ను తగ్గించడం మంచిది. ఇవి మైగ్రేన్ దాడులను పెంచే అవకాశముంది.

# వైట్ రైస్ వర్సెస్ బ్రౌన్ రైస్ ఆరోగ్యానికి ఏది మంచిదంటే..

తెల్ల బియ్యంలో ఫైబర్ తక్కువగా ఉండటం వల్ల, అది సులభంగా జీర్ణమవుతుంది. కొన్ని ప్రత్యేక సమయాల్లో కొంతమందికి ఇది ప్రయోజనకరంగా ఉండవచ్చు. ఉదాహరణకు, ఇన్ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ లేదా ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి సమస్యలు తీవ్రమైనప్పుడు, తప్పక ఫైబర్ తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. అదీగాక తెల్ల బియ్యం త్వరగా ఉడుకుతుంది, తినేందుకు మృదువుగా ఉంటుంది. ఇందులో పోషకమైన మొలక, పీచుపదార్థం గల ఊక, కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఎండోస్పెర్మ్ తదితరాలు ఉంటాయి. దీని గరుకైన ఊక ఉపరితలం కారణంగా నమలడానికి గట్టిగానూ ఉడికేందుకు కాస్త సమయం ఎక్కువ తీసుకుంటుంది. సమతుల్య ఆహారంలో తెల్ల బియ్యం, బ్రౌన్ రైస్ రెండూ ఉంటాయి. అయితే, తెల్ల బియ్యంతో పోలిస్తే, బ్రౌన్ రైస్‌లో ఊక, ఎక్కువ పోషకాలు ఉంటాయి. ఉదాహరణకు, తెల్ల బియ్యంతో పోలిస్తే బ్రౌన్ రైస్‌లో ఫైబర్, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ అనేక బి విటమిన్లు (బి1, బి3, బి6, మరియు బి9) అధిక స్థాయిలో ఉంటాయి.



ఆరోగ్యంగా ఉండాలని ఆలోచిస్తుంటే, బ్రౌన్ రైస్ వంటి ఫైబర్ అధికంగా ఉండే తృణధాన్యాలు ఎక్కువగా తీసుకుంటే గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం తగ్గడం, అలాగే బరువును మెరుగ్గా నియంత్రించుకోవడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే తెల్ల బియ్యం గ్లైసెమిక్ ఇండెక్స్ 73 ± 4, ఇది అధికం. బ్రౌన్ రైస్‌ను మధ్యస్థ గ్లైసెమిక్ ఇండెక్స్ 68 ± 4 కారంగా ఆరోగ్యప్రదంగా పరిగణించారు నిపుణులు. అదీగాక, బ్రౌన్ రైస్ తినడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుంది, కానీ తెల్ల బియ్యం తినడం వల్ల ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. చాలా మంది బ్రౌన్ రైస్ మంచిదన్న ఉద్దేశ్యంతో దీనికే ప్రాధాన్యత ఇస్తారు. అయితే దీనిలోని అధిక ఫైబర్ జీర్ణం చేసుకోవడం కష్టతరం చేసి జీర్ణసంబంధిత రుగ్మతలు తీవ్రమై ప్రమాదం లేకపోలేదని అంటున్నారు ఆదర్శ గౌడ. అందువల్ల బ్రౌన్ రైస్, వైట్‌రైస్ రెండిటిని కలిపి ఎంచుకోమని సూచిస్తున్నారు నిపుణులు. మెరుగైన పోషకాహారం కోసం కొద్దిపాటి మార్పులతో రెండిటిని సమంగా తీసుకునే ప్రయత్నం చేయమని అంటున్నారు అప్పుడు శరీరానికి సమతుల్య పోషకాలు అందుతాయని చెబుతున్నారు.

# ఫైబర్ ఉండే స్నాక్స్ తింటే నిజంగానే మనకు మేలు జరుగుతుందా..

ఆధునిక జీవనశైలిలో ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్ వినియోగం పెరుగుతున్న వేళ శరీరానికి అవసరమైన ఫైబర్ లోపం కూడా పెద్ద సమస్యగా మారుతోంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌లో ఇప్పుడు ఫైబర్ కలిపిన స్నాక్స్ విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అయితే ఈ ఫైబర్ నిజంగా ఆరోగ్యానికి ఉపయోగకరమా? లేక కేవలం మార్కెటింగ్ కోసమేనా? అనే సందేహాలు చాలా మందిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిపుణులు ఫైబర్ ఫోర్టిఫైడ్ స్నాక్స్‌పై ఆసక్తికరమైన విషయాలు వెల్లడిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఫైబర్ బ్లూబెర్రీ వంటి సహజ ఆహారం నుంచి వచ్చినా, ఫైబర్ కలిపిన స్నాక్స్ నుంచి వచ్చినా పేగుల్లోని మంచి బ్యాక్టీరియా దాన్ని దాదాపు ఒకే విధంగా గుర్తిస్తాయి. ఈ ఫైబర్ పేగుల్లో ఫెర్మెంటేషన్‌కు గురై షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్స్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇవి గట్ మైక్రోబయోమ్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. రోజుకు అవసరమైన 30 గ్రాముల ఫైబర్‌ను తీసుకోలేని వారికి ఈ ఫైబర్ కలిగిన స్నాక్స్ కొంత మేర ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే సహజ ఆహారాల్లో లభించే ఫైబర్‌కు, ఫోర్టిఫైడ్ స్నాక్స్‌లో కలిపే ఫైబర్‌కు కొన్ని ముఖ్యమైన తేడాలు ఉన్నాయని కూడా వారు స్పష్టం చేస్తున్నారు. ఉదాహరణకు పండ్లు లేదా బెర్రీలు తింటే కేవలం ఒక రకం ఫైబర్ మాత్రమే కాదు, పెక్టిన్, సెల్యులోజ్, హెమిసెల్యులోజ్, రెసిస్టెంట్ స్టార్చ్ వంటి అనేక రకాల ఫైబర్లు శరీరానికి అందుతాయి. వీటిలో ప్రతి ఒక్కటి వేర్వేరు విధుల్లో పనిచేస్తుంది. అంతేకాదు సహజ ఆహారాల్లో ఫైబర్‌తో పాటు పాలీఫినాల్స్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, సూక్ష్మ పోషకాలు కూడా లభిస్తాయి. ఇవన్నీ కలిసి గట్



ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమిష్టిగా పనిచేస్తాయి. కానీ ఫైబర్ కలిపిన స్నాక్స్ ఈ సహజ సమ్మేళనాన్ని పూర్తిగా అందించలేవని నిపుణులు చెబుతున్నారు. స్నాక్స్ తయారీదారులు ఖర్చు, రుచి, నిల్వ సామర్థ్యం, వేడి తట్టుకునే గుణం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని కొన్ని పరిమిత రకాల ఫైబర్లనే ఉపయోగిస్తారని వివరించారు. అందుకే మార్కెట్‌లో లభించే చాలా ఫైబర్ స్నాక్స్‌లో ఇన్యూలిన్ అనే ఫైబర్ ను ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇది చికోరి వేర్ల నుంచి తీసుకునే ఫైబర్. ఇది తక్కువ ఖర్చుతో లభించడం, రుచి లేకపోవడం, వేడి తట్టుకోవడం వంటి కారణాలతో దీన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు.

# కాలేయం ఆరోగ్యం కోసం..!

ముందుగా కాలేయంపై భారాన్ని తగ్గించడని విజ్ఞప్తి చేస్తున్నారు. అతిగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, అనవసరమైన పెయిన్ కిల్లర్ మందులు అతిగా వాడటం, దీర్ఘకాలిక ఒత్తిడి, సరిగా నిద్రపోవకపోవడం వంటి వాటితో కాలేయంపై అతిగా భారాన్ని మోపొద్దు అంటున్నారు. అంటే సమయానికి భోజనం, నిద్ర ఉండేలా కేర్ తీసుకుంటూ ఆరోగ్యకరమైన పోషకవంతమైన ఆహారాలను తినమని సూచిస్తున్నారు. కాలేయం ఆరోగ్యానికి నిమ్మకాయ ఎంతగానో ఉపయోగపడుతుందని చెబుతున్నారు. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు గ్లూటాథియోన్ రీసైక్లింగ్‌కు మద్దతు ఇస్తుంది. నిమ్మరసం కలిపిన నీరు శరీరానికి తగినంత నీటిని అందించి హైడ్రేటెడ్‌గా ఉండేలా చేస్తుంది. ముఖ్యంగా శరీరం నుంచి వ్యర్థాలను బయటకు పంపించేస్తుంది.

మిల్క్ థిస్టిల్: అనేది శతాబ్దాలుగా ఆయుర్వేద వైద్యంలో వాడుతున్న ఒక పురాతన మూలిక. దీనిలో ఉండే 'సిలిమరిన్' అనే క్రియాశీలక సమ్మేళనం కాలేయ ఆరోగ్యానికి (Liver health) అత్యంత మేలు. ఇది లివర్ వాపును తగ్గించి, విషతుల్య పదార్థాలను బయటకు పంపి కణాలను పునరుద్ధరిస్తుంది. హెపటైటిస్, కామెర్లు వంటి సమస్యల నివారణకు ఇది బాగా పనిచేస్తుంది. డయాబెటిస్ ఉన్నవారిలో ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. చర్మంపై ముడతలను తగ్గించి, ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తుంది. నిమ్మకాయ పరోక్షంగా డిటాక్స్‌కు మద్దతు ఇస్తుంది. ఇది విటమిన్ సిని అందిస్తుంది, ఇది యాంటీఆక్సిడెంట్ రక్షణకు సహాయపడుతుంది మరియు గ్లూటాథియోన్ రీసైక్లింగ్‌కు మద్దతు ఇస్తుంది.




నిమ్మరసం కలిపిన నీరు శరీరానికి తగినంత నీటిని అందిస్తుంది, ఇది చాలా ముఖ్యం ఎందుకంటే వ్యర్థాల విసర్జన అనేది పైత్యరస ప్రవాహం, మూత్ర విసర్జన మరియు జీర్ణక్రియపై ఆధారపడి ఉంటుంది. క్రూసిఫెరస్ కూరగాయలు తీసుకోవడం: దీనిలో గ్లూకోసినోలేట్లు ఉంటాయి, ఇవి సల్ఫోరాఫేన్ సంబంధిత సమ్మేళనాలుగా మారగలవు. ఇవి ఫేజ్ 2 డిటాక్స్ ఎంజైమ్ చర్యకు, యాంటీఆక్సిడెంట్ ప్రతిస్పందన మార్గాలకు మద్దతు ఇస్తాయి. ఔషధాల పరంగా: గ్లూటాథయాన్ అండ్ బి విటమిన్లు ఫ్యాటీ లివర్ ఫేజ్ 2కు కీలకమైన సాధనాలు. గ్లూటాథయాన్ రియాక్టివ్ సమ్మేళనాలను బంధించి, తటస్థీకరించడంలో సహాయపడుతుంది. బి విటమిన్లు మిథైలేషన్, శక్తి జీవక్రియ డిటాక్స్ మార్గాలకు మద్దతు ఇస్తాయి. వీటితోపాటు ప్రోటీన్, గ్లైసిన్, సిస్టీన్, ఫోలేట్, బి12, బి6, రిబోఫ్లేవిన్, మెగ్నీషియం ఉండే ఆహారాలను తీసుకోవడంపై దృష్టి పెట్టాలి. వెల్లుల్లి సల్ఫర్ సమ్మేళనాలను అందిస్తుంది, ఇవి డిటాక్స్ కెమిస్ట్రీకి, యాంటీఆక్సిడెంట్ రక్షణకు మద్దతు ఇస్తాయి. ఇది హృదయ సంబంధ, రోగనిరోధక మార్గాలకు కూడా మద్దతు ఇస్తుంది. ఇలా ఆహారంలో ఆరోగ్యకరమైన ఆహారాలతో మార్పులు చేర్పులు చేసుకుంటే..మంచి ఆరోగ్యం సులభంగా సొంతం చేసుకోవచ్చిన అంటున్నారు.

# ఎండ పోటు.. గుండెకు చేటు

ఎండ దెబ్బకు గుండె గుభేల్‌మంటోంది. పగటి ఉష్ణోగ్రతలు సుమారు 45 డిగ్రీల దాకా నమోదవుతుండటం, తీవ్ర వడగాడ్పులు వీయడం, వాతావరణంలో మార్పులతో హృద్రోగాలు పెరుగుతున్నాయి. సమ్మర్ హార్ట్ ఎటాక్స్ కేసులు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లోనూ ఇలాంటి కేసులు నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దీర్ఘకాలిక రోగాలకు మందులు వాడుతున్న వారు, హృద్రోగులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీర సాధారణ ఉష్ణోగ్రత 35 డిగ్రీల నుంచి



38 డిగ్రీల వరకు ఉంటుంది. ఈ సమయంలో గుండె నిమిషానికి 72 సార్లు కొట్టుకుంటుంది. ఉష్ణోగ్రత ఒక డిగ్రీ పెరిగితే గుండె 10 సార్లు ఎక్కువ కొట్టుకుంటుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైనే నమోదవుతుండటంతో వేసవిలో హార్ట్ ఎటాక్స్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. చర్మం నుంచి చెమట రూపంలో సోడియం, పొటాషియం వంటివి ఎక్కువ మోతాదులో బయటకు వెళ్లిపోతాయి. లవణాలు బ్యాలెన్స్ తప్పితే గుండెలయ తప్పుతుంది. డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు రక్తం చిక్కగా మారి గడ్డకట్టే ప్రమాదం ఏర్పడుతుంది. దీనివల్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని వైద్యులు చెబుతున్నారు.

వాతావరణంలో మార్పులకు అనుగుణంగా గుండె పనితీరు మారుతుందని.. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే సమ్మర్ కార్డియాక్ అరెస్టు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ప్రతి లక్షలో 200 మంది నుంచి 500 మందిలో గుండెపోటు సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని.. వేసవి వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతలతో ఈ సమస్య 2–3 రెట్లు పెరుగుతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. డీహైడ్రేషన్ వల్ల రక్తం చిక్కగా మారిపోతుంది. వేసవిలో దాహం అనిపించినా లేకున్నా అరగంటకోసారి 50 మిల్లీలీటర్ల నుంచి 80 మిల్లీలీటర్ల నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తాగడం మంచిది. బీపీకి మందులు (బీటా బ్లాకర్స్) వినియోగించే వారు చాలా జాగ్రత్తగా ఉండాలి. వేసవి వేడికి హార్ట్ రేటు పెరుగుతుంది. దీన్ని బీపీ మందులు కంట్రోల్ చేస్తాయి. దీంతో శరీరానికి అవసరమైన రక్త సరఫరా జరగదు. వేసవిలో రక్తనాళాలు వ్యాకోచిస్తాయి. చర్మంలో రక్తనాళాల పరిమాణం పెరిగితేనే చెమట వస్తుంది.

ఇలాంటి సమయంలో మెదడు, ఇతర శరీర అవయవాలకు రక్త సరఫరా తగ్గిపోతుంది. దీంతో కార్డియాక్ అరెస్ట్ అయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ప్రజలు ప్రత్యేకించి వృద్ధులు ఎండలో తిరగొద్దు. అలాగే సాలిడ్ ఫ్రూట్ జ్యూస్, సోడా, మద్యం, కాఫీ వంటి వాటికి దూరంగా ఉండాలి.

## ట్రంప్ చిత్రంతో 250 డాలర్ల నోటు!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో 250 డాలర్ల కరెన్సీ నోట్ వచ్చే అవకాశం ఉంది. ఇందుకు కాంగ్రెస్ అనుమతిని ప్రభుత్వ అధికారులు పొందడమే మిగిలి ఉంది. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ట్రంప్ చిత్రంతో ప్రత్యేక బంగారు నాణేన్ని తీసుకువస్తామని ప్రకటించిన రెండు నెలల్లోపే ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం. 250 డాలర్ నోట్ల ప్రొటోటైపులను సిద్ధం చేయమని ఆర్థిక శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎంగ్రేవింగ్ అండ్ ప్రింటింగ్ (బీఈపీ) సిబ్బందికి అమెరికా ట్రెజరర్ బ్రాండన్ బీచ్ తెలిపినట్లు వాషింగ్టన్‌పోస్ట్ పేర్కొంది.




# సంక్షేమ పథకాలకు డిజిటల్ కరెన్సీ: ఆర్‌బీఐ

సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ పైలట్ ప్రాజెక్ట్‌ను మరింత విస్తరించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యోచిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిటైల్ రంగానికీ విస్తరించాలని భావిస్తోంది. ఫైనాన్షియల్ అసెట్ టోకనైజేషన్‌కు ఉన్న అవకాశాలనూ పరిశీలించాలని ఆర్‌బీఐ యోచిస్తోంది. తద్వారా సీబీడీసీ పైలట్ ప్రాజెక్ట్‌లో మరింత మందిని భాగస్వాములను చేయాలనుకుంటోంది. ఈ మేరకు ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో ఈ అంశాన్ని పొందుపరిచింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో గుజరాత్, పుదుచ్చేరి, చండీగఢ్‌లలో నగదు బదిలీ పథకాల కింద డిజిటల్ కరెన్సీని ప్రయోగాత్మకంగా పరిశీలించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ప్రజా పంపిణీ వ్యవస్థ లబ్ధిదారులకూ ఆహార సబ్సిడీని సీబీడీసీ ద్వారా అందించారు. లబ్ధిదారులు ఆ నిధులను రేషన్ షాపులు, ఎంపిక చేసిన వ్యాపారుల వద్ద వస్తువుల కొనుగోలుకు మాత్రమే ఉపయోగించేలా




చూశారు. దీన్ని మరింత విస్తరించాలని భావిస్తోంది. పశ్చిమాసియా రూపంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పెరిగిన ఇంధన ధరలు, సప్లయ్ చైన్ అవరోధాలు ఉన్నా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధికి ఢోకా లేదని ఆర్‌బీఐ పేర్కొంది. పటిష్టమైన స్థూల ఆర్థిక పునాదులు బలంగా ఉండడమే దీనికి కారణమని తన వార్షిక నివేదికలో తెలిపింది. కార్పొరేట్, బ్యాంకింగ్ రంగాల బలోపేతమైన బ్యాలెన్స్ షీట్లు, ప్రభుత్వ మూలధన వ్యయం కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి సానుకూలంగా ఉండనుందని తెలిపింది. వివిధ వాణిజ్య భాగస్వాములతో కుదుర్చుకున్న ఒప్పందాలు కూడా వృద్ధికి దన్నుగా నిలవనున్నాయని అభిప్రాయపడింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.6 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని ఆర్‌బీఐ గుర్తు చేసింది. 2026–27లో వ్యవసాయ రంగం నైరుతి రుతుపవనాలపై ఆధారపడి ఉంటుందని అంచనా వేసింది.

# సెన్సెక్స్ 1092 పాయింట్లు డౌన్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. మధ్యాహ్నం వరకు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా – ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో అనిశ్చితి, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండటం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠాల నుంచి 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 23,550 దిగువన ముగిసింది. మదుపర్ల సంపద రూ.5 లక్షల కోట్లు క్షీణించి రూ.466 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 75,988.51 (క్రితం ముగింపు 75,867.80) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడే 76,220.02 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. దీంతో 74,589.11 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. చివరికి 1092.06 పాయింట్ల నష్టంతో 74,775.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 359.40 పాయింట్ల నష్టంతో 23,547.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం



విలువ 95.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్ షేర్లు మిగిలిన షేర్లు నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండిగో, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

# 20% పెరిగిన నకిలీ రూ.500లు




రెండు వేల రూపాయల నోట్ల ఉపసంహరణ తర్వాత రూ.500 నోటుకు ఆదరణ పెరిగింది. 2025–26లో బ్యాంకింగ్ వ్యవస్థలో చలామణిలో ఉన్న వీటి సంఖ్య 11.2 శాతం వృద్ధి చెందింది. అదే సమయంలో నకిలీ నోట్ల బెడదా పెద్ద ఎత్తున రూ.500 నోటు ఎదుర్కొంటున్నట్లు ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో తెలిపింది. 2026 మార్చి నాటికి 7,05,482 లక్షల రూ.500 నోట్లు చలామణిలో ఉండగా.. అంతకుముందు ఏడాది ఇదే సమయానికి 6,34,458 లక్షల నోట్లు సర్క్యులేషన్‌లో ఉన్నాయి. విలువ పరంగా చూస్తే రూ.31.72 లక్షల కోట్ల నుంచి రూ.35.27 లక్షల కోట్లకు పెరిగినట్లు ఆర్‌బీఐ తెలిపింది. మార్కెట్‌లో చలామణిలో ఉన్న మొత్తం కరెన్సీలో ఎక్కువ వాటా కూడా 500 రూపాయల నోటుదే. సంఖ్యా పరంగా 41.2 శాతం వాటా కలిగి ఉండగా.. విలువ పరంగా 86 శాతం వాటా వాటిదే కావడం గమనార్హం. సంఖ్యాపరంగా రూ.10 నోటు 16.1 శాతం వాటాతో రెండో స్థానంలో ఉంది. బ్యాంకింగ్ వ్యవస్థలో చలామణిలో ఉన్న మొత్తం నోట్ల విలువ 11.9 శాతం, సంఖ్య 10.5 శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ తెలిపింది. దీనిబట్టి ఆర్థిక వ్యవస్థలో నగదు డిమాండ్ ఇంకా కొనసాగుతోందనడానికి ఇది సూచికగా నిలుస్తోంది. బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ రూ.500 నోట్లు కూడా పెద్ద సంఖ్యలో చలామణిలో ఉన్నట్లు ఆర్‌బీఐ గుర్తించింది. గతేడాదితో పోలిస్తే ఈ నకిలీల బెడద 20 శాతం పెరిగినట్లు తెలిపింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1,17,722 రూ.500 నోట్లను గుర్తించగా.. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 1,41,907 నోట్లకు పెరిగినట్లు ఆర్‌బీఐ తెలిపింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 30,591 నకిలీ రూ.200 నోట్లను గుర్తించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. మొత్తంగా బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ నోట్ల బెడద 5.7 శాతం మేర పెరిగినట్లు పేర్కొంది.

## ఎల్ఐసీ షేర్లు 50 శాతం పడ్డాయా?

ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (LIC) షేర్లు శుక్రవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో 50 శాతం మేర క్షీణించినట్లు కనిపిస్తోంది. వాస్తవానికి ఎల్ఐసీ బోనస్ ఇష్యూ సంగతి తెలీని వారు ఈ మార్పు చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. శుక్రవారం నుంచి బోనస్ షేర్ల జారీ షేరు విలువలో ప్రతిఫలించడమే ఇందుకు కారణం. బుధవారం మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో ఎల్ఐసీ షేరు విలువ రూ.830గా ఉంది. బోనస్ షేరు వల్ల విలువ సగమైంది. ఈ క్రమంలోనే శుక్రవారం మార్కెట్ ప్రారంభంలో రూ.417.60 వద్ద ప్రారంభమైంది. తర్వాత ఒక శాతం నష్టంతో రూ.411 వద్ద మగిసింది. అంటే నష్టపోయింది ఒక శాతం లోపే. కానీ, 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయడం వల్ల స్టాక్ ధరలో పెద్ద మొత్తంలో నష్టపోయినట్లు కనిపించింది.




మే 29 నాటికి ఎల్ఐసీ షేర్లు ఉన్నవారికి 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేయాలని ఎల్ఐసీ నిర్ణయం తీసుకుంది. రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరు కలిగిన వాటాదార్లకు అదనంగా రూ.10 ముఖ విలువ కలిగిన మరో ఈక్విటీ షేరును బోనస్‌గా జారీ చేస్తామని ప్రకటించింది. ఇందుకోసం 2025 డిసెంబరు 31 నాటికి ఎల్ఐసీ వద్ద ఉన్న రూ.6,325 కోట్ల నిల్వలు, మిగులు నిధులతో ఈ బోనస్ ఇష్యూను పూర్తి చేయనున్నట్లు ఎక్స్ఛేంజీలకు గతంలో ఎల్ఐసీ సమాచారం ఇచ్చింది. దీనివల్ల కంపెనీ షేర్ల సంఖ్య పెరగడమే కాకుండా.. రిటైల్ మదుపర్లను ఆకర్షించడానికి ఉపయోగపడుతుంది. షేర్ల సంఖ్య పెరిగినంత మాత్రాన కంపెనీ మార్కెట్ విలువలో ఎలాంటి మార్పూ ఉండదు.

# ట్రిలియన్ డాలర్లకు చేరువలో ఆంథ్రోపిక్..!

కృత్రిమమేధ సంస్థలు ఇప్పుడు ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా ఏఐ స్టార్టప్ ఆంథ్రోపిక్ మార్కెట్ విలువ ట్రిలియన్ డాలర్లకు చేరువైంది. తాజాగా 65 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ సమయంలో కంపెనీ విలువను ఇన్వెస్టర్లు 965 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు. ఈ ఫండింగ్ విషయాన్ని గురువారం ప్రకటించారు. ఆల్టిమీటర్ క్యాపిటల్, డ్రాగోనీర్, గ్రీనోక్స్, సెకోయియా క్యాపిటల్ వంటి సంస్థలు నిధులిచ్చిన జాబితాలో ఉన్నాయి. ఈ సంస్థలు ఒక్కోటీ రెండు బిలియన్ డాలర్ల చొప్పున ఆంథ్రోపిక్‌లో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. సెకోయియా మాత్రం దీనిపై స్పందించేందుకు ఇష్టపడలేదు. ఈ విడతలో కూడా గూగుల్ సంస్థ నుంచి భారీగానే పెట్టుబడులు అందాయి. ఇప్పటికే ఆంథ్రోపిక్‌లో 40 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతానని ఈ టెక్ దిగ్గజం ప్రకటించింది. అమెజాన్ 5 బిలియన్ డాలర్ల నిధులను సమకూర్చినట్లు తెలుస్తోంది. శాంసంగ్ ఎలక్ట్రానిక్స్, మైక్రాన్ టెక్నాలజీ, ఎస్‌కే హైనిక్స్‌లు కూడా ఇన్వెస్టర్ల జాబితాలో ఉన్నాయి. కృత్రిమ మేధకు సంబంధించిన రంగాల్లోని సంస్థల మార్కెట్ విలువ భారీగా పెరుగుతోంది. ఇటీవలే చిప్‌ల తయారీ కంపెనీలు శాంసంగ్ ఎలక్ట్రానిక్స్, మైక్రాన్ టెక్నాలజీ, ఎస్‌కే హైనిక్స్‌లు ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను తాకాయి. ఇదిలా ఉండగా.. క్లాడ్ ఓపస్ 4.8 మోడల్‌ను ఆంథ్రోపిక్ తాజాగా అందుబాటులోకి తెచ్చింది. ఇక మిథోస్ శ్రేణి ఏఐని




వినియోగదారులకు కొన్ని వారాల్లో అందుబాలోకి తెస్తామని ఈ కంపెనీ ప్రకటించింది. అయితే దీనికి సంబంధించిన కచ్చితమైన వివరాలను మాత్రం బహిర్గతం చేయలేదు. మిథోస్ తన అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో పలు సాఫ్ట్‌వేర్‌లలో ఏళ్లతరబడి ఉన్న బగ్‌లను వేగంగా కనుగొని.. వాటిని వాడుకొనే మార్గాలను చెప్పింది. దీంతో అమెరికాలోని చాలా టెక్ దిగ్గజ సంస్థలు తమ సాఫ్ట్‌వేర్ల విషయంలో అప్రమత్తమయ్యాయి. అగ్రరాజ్య ప్రభుత్వం ఒత్తిడితో మిథోస్ విడుదలను ఆంథ్రోపిక్ వాయిదా వేసుకొంది. మరోవైపు, ప్రాజెక్ట్ గ్లాస్‌వింగ్ పేరిట మిథోస్‌ను వాడి టెక్ దిగ్గజాల్లో సాఫ్ట్‌వేర్‌లను సరిచేసే పని మొదలుపెట్టారు.






## కావ్యా మారన్ కన్నీళ్ల ఫొటోలు వైరల్..

ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఓటమితో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇంటిముఖం పట్టిన సంగతి తెలిసిందే. రాజస్థాన్ రాయల్స్ నిర్దేశించిన 244 పరుగుల టార్గెట్‌ను ఛేదించలేక 196 పరుగులకే పరిమితమైంది. దీంతో ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంచైజీ యజమాని కావ్యా మారన్ తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు.. కన్నీళ్లు పెట్టుకున్నట్లుగా ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి. తాజాగా దీనిపై ఫ్యాక్ట్ చెక్ చేస్తే.. అవన్నీ ఎడిట్ చేసినవేనని తేలింది. రాజస్థాన్‌తో మ్యాచ్ అనంతరం సన్‌రైజర్స్ ఆటగాడు ఇషాన్ కిషన్, కోచ్ ముత్తయ్య మురళీధరన్‌తో కావ్యా మారన్ మాట్లాడుతూ ఉన్న ఫొటోలను కొందరు ఎడిట్ చేశారు. ఆ ఫొటోలను తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేశారు. మరికొందరైతే AI వినియోగించి వీడియోలనూ రూపొందించారు. కావ్యా మారన్ ఏడుస్తూ ఉంటే ఇషాన్, ముత్తయ్య ఓదారుస్తున్నట్లు అందులో ఉన్నాయి. గతంలోనూ రెజ్లర్లు సంగీత, వినేశ్ ఫొగట్‌పైనా ఇలాంటి ఎడిటింగ్‌లతో తప్పుదోవ పట్టించారు.

# లఖ్‌నవూ కెప్టెన్సీ నుంచి వైదొలిగిన రిషభ్ పంత్




ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఘోరంగా విఫలమైంది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగున పడిపోయింది. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ సీజన్‌లో లఖ్‌నవూ (LSG)కు సారథ్యం వహించిన రిషభ్ పంత్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈ మేరకు ఫ్రాంఛైజీ 'ఎక్స్' వేదికగా ప్రకటన చేసింది. ''కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని రిషభ్ పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంఛైజీ మర్యాదపూర్వకంగా అంగీకరించింది. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అంత సులభమేమీ కాదు. కెప్టెన్‌గా పంత్ ఇప్పటివరకు ఫ్రాంఛైజీకి గొప్పగా సేవలందించాడు'' అని రాసుకొచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో జట్టును అత్యుత్తమ ప్రమాణాలతో పునర్నిర్మించడంపై తాము దృష్టి పెట్టినట్లు తెలిపింది.

2025 ఐపీఎల్ (IPL) మెగా వేలంలో పంత్‌ను లఖ్‌నవూ ఫ్రాంఛైజీ ఏకంగా రూ.27 కోట్లతో దక్కించుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే, పంత్ సారథ్యంలో లఖ్‌నవూ రెండు సీజన్‌లలో కలిసి కేవలం 10 మ్యాచ్‌లో గెలవడం గమనార్హం. 2025 సీజన్‌లో ఈ జట్టు ఆరు విజయాలతో ప్లేఆఫ్స్‌కు కూడా చేరుకోలేకపోయింది. ఇక, బ్యాటింగ్ పరంగానూ పంత్ ఆకట్టుకోలేకపోయాడు. గత సీజన్‌లో మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం 269 పరుగులు చేసిన అతడు.. ఈ ఏడాది మొత్తంగా 312 పరుగులు సాధించాడు.

# గుకేశ్‌కు వరుసగా రెండో ఓటమి

నార్వే చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద సంచలన విజయం నమోదు చేశాడు. ఓపెన్ విభాగం మూడో రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)కు అతను షాకిచ్చాడు. ఇటీవలే సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ టైటిల్ గెలిచిన ప్రజ్ఞానంద.. ఇక్కడా ఫామ్ కొనసాగిస్తున్నాడు. ఉత్కంఠగా సాగిన పోరులో ఆఖరికి ప్రజ్ఞదే పైచేయి అయింది. నార్వే చెస్ టోర్నీలో కార్ల్‌సన్‌పై గెలవడం ప్రజ్ఞకు ఇది రెండోసారి. 2024లోనూ అతడు కార్ల్‌సన్‌ను కంగుతినిపించాడు. ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్ ప్రస్తుత టోర్నీ పాయింట్ల పట్టికలో అట్టడుగున కొనసాగుతుండడం గమనార్హం. మరోవైపు ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ వరుసగా రెండో పరాజయం చవిచూశాడు. తొలి రెండు గేమ్‌ల్లో గెలిచి ఊపు మీదున్న అలీరెజా ఫిరౌజా (ఫ్రాన్స్)తో మొదట డ్రా చేసుకున్నప్పటికీ.. ఆర్మగెడాన్‌లో ఓడిపోయాడు. పట్టికలో ఫిరౌజా (7.5 పాయింట్లు) అగ్రస్థానంలో, ప్రజ్ఞానంద (4.5) రెండో స్థానంలో ఉన్నారు. వెస్లీ సో (4, అమెరికా), గుకేశ్ (3.5), విన్సెంట్ కీమర్ (3, జర్మనీ) కార్ల్‌సన్ (1.5) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. మహిళల విభాగంలో ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ వరుసగా మూడో గేమ్‌లో విజయం సాధించింది. టోర్నమెంట్ టాప్ ప్లేయర్ బిబిసారా అసబాయెవా (కజకిస్థాన్)ను ఆమె ఆర్మగెడాన్‌లో ఓడించింది. కోనేరు హంపి.. ఆర్మగెడాన్‌లో అనా ముజిచుక్ (ఉక్రెయిన్)కు తలొంచింది. బిబిసారా (5.5), దివ్య (4.5) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతుండగా.. హంపి (2) అట్టడుగున ఉంది.




## ఐపీఎల్ 2026..

## ప్లేయర్లకు కొత్త రూల్స్?

ఐపీఎల్ 2026 సీజన్‌లో కేవలం రెండే మ్యాచులు మిగిలాయి. ఇవాళ క్వాలిఫయర్–2 జరగనుండగా.. ఆదివారం కప్పు విజేతను తేల్చే ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ క్రమంలో బీసీసీఐ ఆదేశాల మేరకు క్రికెటర్లు, సహాయక సిబ్బందికి ఐపీఎల్ కీలక ఆదేశాలను జారీ చేసింది. అత్యాధునిక కమ్యూనికేషన్ డివైజ్‌ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో.. ఆటగాళ్లు మైదానంలో స్మార్ట్ గ్లాసెస్, సన్‌గ్లాసెస్ తరహా గ్యాడ్జెట్‌లను వాడొద్దని ఆదేశించింది. అవినీతి నిరోధక, సెక్యూరిటీ విభాగం (ఏసీఎస్‌యూ) సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ తరహా గ్యాడ్జెట్స్ వల్ల లైవ్ స్ట్రీమింగ్‌తోపాటు, మెసేజ్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని ఏసీఎస్‌యూ తెలిపింది. ''సాంకేతికత ఇప్పుడు జీవితంలో భాగమైంది. అదే సమయంలో ఆటగాళ్ల రహస్య సమాచార బదిలీ పద్ధతులపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రపంచ క్రికెట్‌లో అత్యధిక వాణిజ్య ప్రాముఖ్యత కలిగిన లీగుల్లో ఐపీఎల్ ఒకటి. ఆట అభివృద్ధితోపాటు ప్లేయర్ల ప్రైవసీకి రక్షణ ఇవ్వాల్సిన బాధ్యత మాపై ఉంది. తాజాగా యాంటీ కరప్షన్, సెక్యూరిటీ యూనిట్ తీసుకుంటున్న కఠిన చర్యలు అందుకు తార్కాణం. ఇప్పటికే పలుమార్లు ఆటగాళ్లు, సహాయక సిబ్బంది నిబంధనలను ఉల్లంఘించిన ఘటనలు చూశాం. వాటిపై బీసీసీఐ దృష్టిసారించింది'' అని ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి.




# సుప్రీంకోర్టులో రెజ్లర్‌కు ఊరట

ఆసియా క్రీడల ట్రయల్స్ (2026)లో పోటీపడే విషయంలో భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆమె సెలక్షన్ ట్రయల్స్‌లో పోటీ చేసేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతినిచ్చింది. ఈ దశలో ఆమెను వెనక్కి రమ్మని చెప్పడం భావ్యం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ''ఈ స్థానంలో వేరొకరు ఉండి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. కానీ ఆమె (వినేశ్) ఈ దేశాన్ని గర్వపడేలా చేశారు. ఇప్పటికే ట్రయల్స్‌లో పాల్గొనేందుకు ఆమెకు హైకోర్టు అనుమతినిచ్చింది. ఈ దశలో ఆమెను వెనక్కి వెళ్లమని చెప్పడం సరైన నిర్ణయమనిపించుకోదు. ప్రస్తుతానికి ఈ విషయంలో మేం ఏం చేయలేం.



మే 30, 31వ తేదీల్లో జరిగే సెలక్షన్ ట్రయల్స్‌లో వినేశ్ ఫొగాట్ పోటీ పడేందుకు అనుమతినిస్తూ ఇటీవల దిల్లీ హైకోర్టు ఉత్తర్వులను జారీచేసింది. దీన్ని భారత రెజ్లింగ్ సమాఖ్య (WFI) సుప్రీంకోర్టులో సవాలు చేసింది. హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తన పరిధిని మీరిందని, ఎంపిక ప్రమాణాల ప్రకారం వినేశ్ అనర్హురాలైనా.. ట్రయల్స్‌లో పాల్గొనేందుకు ఆమెకు అనుమతివ్వాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించినట్లు డబ్ల్యూఎఫ్ఐ తమ స్పెషల్ లీవ్ పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. దిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఆమె పోటీల్లో పాల్గొనవచ్చు'' అని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, డబ్ల్యూఎఫ్ఐ పిటిషన్‌పై వినేశ్‌కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది. ఈ విషయంలో దిల్లీ హైకోర్టు వ్యవహరించిన తీరుపై సుప్రీం ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి అంశాల్లో కోర్టుల వేగవంతమైన జోక్యం సరికాదని అభిప్రాయపడింది. ''ఆమె అద్భుతమైన రెజ్లర్ కావొచ్చు. కానీ, కోర్టులకు దేశమే ప్రథమ ప్రాధాన్యం. ఇదేమీ కాలేజీ అడ్మిషన్ కాదు. జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు సంబంధించిన అంశం.

# వుదయం సినిమా

MOVIE TIME!

## ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిలిం టెలివిజన్ & థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ గా కొండపనేని ఉమామహేశ్వరరావు

**వుదయం సినిమా** కాగా అందులో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ గా సీనియర్ పాత్రికేయులు, ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ సభ్యుడైన కొండపనేని మామహేశ్వరరావు గారిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఫిలింక్రిటిక్స్ అసోసియేషన్ పాలక వర్గం ఆయనను ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ నందు శుక్రవారం నాడు సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాతలు జి.ఆదిశేషగిరి రావు, కాజా సూర్యనారాయణ గారు ఆత్మీయ అతిధులు గా పాల్గొన్నారు. ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేష్ కొండేటి పుష్ప గుచ్చాన్ని ఇవ్వగా .. సీనియర్ సభ్యులు ఎ.బాలిరెడ్డి, కె. వెంకటేశ్వరరావులు శాలువాలతో సత్కరించారు.



## ప్రపంచవ్యాప్తంగా జూలై 31న "సిగ్మా" రిలీజ్

**వుదయం:** లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'సిగ్మా' చిత్రం ప్రపంచవ్యాప్తంగా జూలై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. అనౌన్స్మెంట్ నాటి నుంచే సినీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించిన ఈ సినిమా, టీజర్‌కు అద్భుతమైన స్పందన రావడంతో మరింత హైప్‌ను సొంతం చేసుకుంది. టీజర్ ఇప్పటికే 20 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి సినిమాపై అంచనాలను పెంచింది.లైకా ప్రొడక్షన్స్ హెడ్ జి.కె.ఎం తమిళ్ కుమరన్ మాట్లాడుతూ.. "జూలై 31న 'సిగ్మా'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఆనందంగా ఉంది. సినిమా అద్భుతంగా వచ్చింది. ప్రేక్షకులకు ఇది ఒక కొత్త సినీ అనుభూతిని అందిస్తుందని నమ్ముతున్నాం. దర్శకుడిగా తొలి చిత్రానికే జేసన్ సంజయ్ మంచి స్పష్టత, అంకితభావం, నమ్మకంతో పనిచేశారు. ఈ విజన్‌ను సాకారం చేయడానికి నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ ఎంతో కష్టపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు 'సిగ్మా'ను తీసుకురావడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం" అన్నారు.దర్శకుడు జేసన్ సంజయ్ మాట్లాడుతూ.. "సిగ్మా నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన ప్రయాణం. నా విజన్‌ను నమ్మి, ప్రతి దశలోనూ అండగా నిలిచిన లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ చిత్రానికి పనిచేసిన ప్రతి నటుడు, సాంకేతిక నిపుణుడు ఎంతో నిబద్ధతతో పనిచేశారు. వారందరికీ నా ధన్యవాదాలు. జూలై 31న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాం.



## నందమూరి తారక రామారావు 103వ జయంతి



**వుదయం:** స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా నేడు ఫిలింనగర్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్ భూషణ్, ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణ , నందమూరి మోహన రూప, నందమూరి సీమంతిని, నందమూరి దీపిక, తుమ్మల ప్రసన్నకుమార్, పరుచూరి గోపాల కృష్ణ , బాబు మోహన్, నిర్మాత భరద్వాజ్ తదితరులు పాల్గొని పూలమాలలతో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పరుచూరి గోపాల కృష్ణ మాట్లాడుతూ... "అందరి నమస్కారం. ఈరోజు తెలుగు జాతి మరువలేని రోజు, అన్నగారి పుట్టిన రోజు. తెలుగు జాతికి ప్రఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు. ఆయన తెలుగు జాతికి ఒక వరం. ఆయన ఆశీస్సులు తెలుగు వారందరికీ ఎప్పుడు ఉంటాయని ఆశిస్తున్నాను" అన్నారు.

## ఇద్దరు స్టార్ హీరోయిన్స్‌తో 'ఆల్ఫా'తీయడం నిజంగా అద్భుతం!..



**వుదయం:** యశ్ రాజ్ ఫిల్మ్ రూపొందిస్తోన్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా' లో నటించటం చాలా సరదాగా అనిపించిందని అంటున్నారు బాలీవుడ్ యాక్షన్ స్టార్ బాబీ డియోల్. వ్యక్తులను చంపటానికి శిక్షణ ఇచ్చి పెంచి పెద్ద చేసిన ఓ హంతకురాలి కథతో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మరో హీరోయిన్ శర్వారి కూడా నటిస్తోంది. ఇద్దరు హీరోయిన్స్ నటిస్తోన్న ఈ ఫుల్ యాక్షన్ మూవీ ఇండియాలో రూపొందటం చాలా సంతోషంగా ఉందని బాబీ అన్నారు. కచ్చితంగా ఈ ఆల్ఫా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బాబీ డియోల్ మాట్లాడుతూ "నాకు రణ్‌భీర్ కపూర్, ఆలియా భట్ అంటే చాలా ఇష్టం. వాళ్లిద్దరితో కలిసి పని చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటుండేవాడిని. రణ్‌భీర్ కపూర్‌తో అనిమల్ సినిమా చేశాను. ఇప్పుడు ఆలియా భట్‌తో ఆల్ఫా సినిమా చేస్తున్నాను. ఇది నిజంగా నాకెంతో ఆనందాన్నిచ్చే విషయం. ఇండియన్ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ యాక్షన్ సన్నివేశాల్లో నటించటం చాలా గొప్ప విషయం. సినిమా నాకెంతో నచ్చింది. ఎందుకంటే ఇది నాకు కొత్తగా, ఫ్రెష్‌గా ఉంది. ప్రేక్షకులకు థియేటర్స్‌లో ఓ కొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ వస్తుంది.ఆలియా భట్ యాక్షన్ సన్నివేశాల్లో నటించిన తీరు.. అందుకు ఆమె సన్నద్ధమైన తీరు నన్నెంతగా ఆకట్టుకుంది. ఎంతో కఠినమైన యాక్షన్ సీక్వెన్స్‌లో ఆమె అద్భుతంగా నటించింది. నేను కలిసి పని చేసిన నటీనటుల్లో ఆలియా భట్ చాలా కష్టపడే తత్వమున్న వ్యక్తి. చాలా నిజాయతీతో పని చేస్తుంది.

## 'దీవాన" నుంచి 'తెల్లపోరి...

### 'లిరికల్ సాంగ్ రిలీజ్



**వుదయం:** "దీవాన" వన్ సైడ్ లవ్ స్టోరీ లో ఉన్న మ్యాడ్ నెస్ ప్రేక్షకులకు ఆకట్టుకునేలా చూపించబోతోంది. "దీవాన" సినిమా ఇప్పటికే మ్యూజికల్ గా సక్సెస్ అవుతోంది. ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన 'ఇది ప్రేమా .. ఇది ప్రేమా..' ఛాట్ బస్టర్ కాగా.. ఇప్పుడు ఎనర్జిటిక్ టీజింగ్ సాంగ్ 'తెల్లపోరి...'ని మేకర్స్ రిలీజ్ చేశారు. తెల్లపోరి...' పాటను సంగీత దర్శకుడు ఈశ్వర్ చంద్ స్వరపర్చి, సాహిత్యాన్ని అందించి పాడటం విశేషం. ఈ పాటకు ది క్రింజ్ సాంగ్ ఆఫ్ ది ఇయర్ అనే క్యాప్షన్ మంచి జస్టిఫికేషన్ ఇస్తోంది. ఈ పాట ఎలా ఉందో చూస్తే – 'తెల్లపోరి, నా తెల్లపోరి బల్లి కంటే తెల్లగుంటది..తెల్లపోరి, నా తెల్లపోరి బల్లి కంటే తెల్లగుంటది., మెత్తమెత్త బుగ్గలు, పందిపిల్ల పెదవులు, గింతకంటే క్యూటు పిల్ల యాడ ఉంటది, బ్రష్ చేస్తున్నా, ఫ్లష్ చేస్తున్నాగా పిల్ల మొఖమే తిరుగుతుంటది, నా బండి మీద స్టిక్కర్ ఆమె పేరు మీదే, పాస్ వర్డ్ నెంబర్ అంటే ఆమె బర్త్ డే, ఇంతమంచి ఫీలింగ్ కావాలనంటే లవ్ లోనే శాతనైతదే.. 'అంటూ ఫన్నీగా ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. పాటలోని కాన్సెప్ట్ లకు యాప్ట్ అయ్యే లా డిజైన్ చేసిన కొరియోగ్రఫీ, డిఫరెంట్ లొకేషన్స్లో చేసిన పిక్చరైజేషన్ ఈ సాంగ్ కు హైలైట్ గా నిలుస్తున్నాయి. ఈ వన్ సైడ్ లవ్ స్టోరీ ఇప్పటికే సాంగ్, టీజర్ వంటి ప్రమోషనల్ కంటెంట్ తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది."దీవాన" సినిమా టీజర్, సాంగ్స్ సూపర్బ్ రెస్పాన్స్ తెచ్చుకుంటున్నా యి. యూత్ ఆడియెన్స్ లో "దీవాన" సినిమా పట్ల మంచి క్రేజ్ ఏర్పడుతోంది. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు.

## 'ఇట్లు అర్జున' మెస్మరైజింగ్ ఫస్ట్ సింగిల్ హాయ్ రే

**వుదయం:** స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల తన నిర్మాణ సంస్థ వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న తొలి చిత్రం 'ఇట్లు అర్జున'. "న్యూ గై ఇన్ టౌన్" అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, మహేష్ ఉప్పల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌తోనే మంచి బజ్ క్రియేట్ చేసింది. అనౌన్స్‌మెంట్ వీడియో, ప్రోమోతో అంచనాలు పెంచిన మేకర్స్, తాజాగా ఫస్ట్ సింగిల్ హాయ్ రే ను విడుదల చేస్తూ మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. నేచురల్ స్టార్ నాని లాంచ్ చేసిన ఈ పాట యూత్‌ఫుల్ ఎనర్జీతో, క్యాచీ ట్యూన్‌తో ఆకట్టుకుంటోంది. ఎస్. థమన్ ఈ పాటను స్ట్రాంగ్ ఎలక్ట్రానిక్, హిప్‌హాప్ బీట్స్‌తో ఫాస్ట్ పేస్డ్ రిథమ్ నంబర్‌గా కంపోజ్ చేశారు. ట్రెండీ రిథమ్స్‌తో పాటు క్లాసికల్ టచ్, బ్రైట్ ఇన్‌స్ట్రుమెంటేషన్ పాటకు మోడ్రన్ & సోల్‌ఫుల్ ఫీల్ తీసుకొచ్చాయి.అనిరుధ్ రవిచందర్ తన ఎనర్జిటిక్ వోకల్స్‌తో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాఫ్ట్ ఎమోషన్స్ నుంచి హై ఎనర్జీ హుక్స్ వరకు ఆయన వాయిస్ పాట మూడ్‌ను మరింత ఎలివేట్ చేసింది. సంజన ఆలపించిన కర్ణాటిక్ టచ్ నోట్స్, హర్ష వర్ధన్ ర్యాప్ సెగ్మెంట్ పాటకు కొత్త లేయర్స్‌ను జోడించా యి. కళ్యాణ్ చక్రవర్తి రాసిన సాహిత్యం సింపుల్ గా, హార్ట్‌ఫుల్‌గా ఉండి హీరోయిన్‌ను దూరం నుంచి ప్రేమించే హీరో భావాలను అందంగా వ్యక్తపరిచింది.



## 'అప్నిహద్ద్ సే' చిత్రంలోని 'తేరా హీ కరమ్ తేరా సహారా చాహియే' పాట అద్భుత విజయం

**వుదయం:** 'అప్ని హద్ద్ సే' చిత్రంలోని పాటకు లభిస్తున్న విశేష స్పందనను చిత్ర హీరో నజీర్ సినిమా మరియు సాంగ్ విశేషాలను పంచుకున్నారు. ముఖ్యంగా ఈ చిత్రం లోని 'తేరా హీ కరమ్ తేరా సహారా చాహియే' అనే పాట సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కేవలం 3 మిలియన్ల రీచ్‌తో మొదలైన ఈ పాట, ప్రస్తుతం ప్రేక్షకుల అమితమైన ఆదరణతో ఏకంగా 6 మిలియన్ మైలురాయిని చేరువలో ఉంది . ఈ పాట సోషల్ మీడియాలోనూ, మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ ట్రెండింగ్‌లో ఉంటూ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక



స్థానాన్ని సంపాదించుకుంది.ఈ కార్యక్రమంలో ఎడిటర్ జమీర్ షేక్ మాట్లాడుతూ, పాట నిర్మాణంలోని తన అనుభవాన్ని పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ: "ఒక పాటను ఎడిట్ చేయడంలో భావోద్వేగమే ప్రధానమైనది. సంగీతానికి మరియు లిరిక్స్‌కు తగినట్లుగా విజువల్స్‌ను పర్ఫెక్ట్‌గా మ్యాచ్ చేయడానికి నేను మూడు వేర్వేరు వెర్షన్‌లపై పనిచేశాను.

## 'హిట్ అండ్ రన్' ఫస్ట్ లుక్ రిలీజ్

**వుదయం:** క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లకు ఉండే క్రేజ్ అందరికీ తెలిసిందే. ప్రస్తుతం ఆడియెన్స్ డిఫరెంట్ కంటెంట్‌ను ఎక్స్‌పీరియెన్స్ చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలో క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లకు మరింత డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం సంజయ్ రావ్, నటాషా సింగ్ ప్రధాన పాత్రల్లో త్వరలో రానున్న చిత్రం 'హిట్ అండ్ రన్'. శ్రీ ఉరుకుంద ఈరణ్ణ స్వామి సమర్పణలో సతీష్ రెడ్డి అల్లం ఎంటర్టైన్మెంట్, శ్రీలక్ష్మి నరసింహస్వామి క్రియేషన్స్ బ్యానర్‌ల మీద సతీష్ రెడ్డి అల్లం, కె. శేఖర్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సాయి కృష్ణ సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు.ప్రస్తుతం ఈచిత్రానికి సంబంధించిన షూటింగ్‌ను ఫినిష్ చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. సంజయ్ రావ్ పుట్టిన రోజు సందర్భంగా 'హిట్ అండ్ రన్' సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.



## కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్

**వుదయం:** తెలుగు చలనచిత్ర రంగానికి విశిష్ట సేవలందించిన కళాకారులు, సాంకేతిక నిపుణులను సత్కరించేందుకు నిర్వహించిన "కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్ – 2026" కార్యక్రమం హైదరాబాద్‌లోని AAA సినిమాస్, అమీర్‌పేట్‌లో ఘనంగా జరిగింది. సినీ, సాంస్కృతిక, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్మారకార్థం నిర్వహించిన ఈ అవార్డుల వేడుకలో పలువురు సినీ ప్రముఖులకు ప్రతిష్టాత్మక పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (APFDC) చైర్మన్ భరత్ భూషణ్, APFDC డైరెక్టర్ మరియు ప్రముఖ నిర్మాత చదలవాడ శ్రీనివాస్ రావు, ఎన్టీఆర్ తనయుడు మరియు ప్రముఖ కొరియోగ్రాఫర్ నందమూరి మోహన కృష్ణ గారు, TFPC కార్యదర్శి తుమ్మల ప్రసన్న కుమార్ గారు, నిర్మాత పుష్కార్ రామ్ మోహన్ రావు గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రముఖ నటి ప్రశాంతి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. అలాగే దర్శకుడు వి.ఎన్. ఆదిత్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




## సినిమా ఒక అద్భుతమైన మీడియం..

**వుదయం:** ఇటీవల సినిమా ఈవెంట్స్, ఇతర వేదికలపై చిత్ర పరిశ్రమలో సమస్యల్లో ఉన్నాం, ఇబ్బందులు పడుతున్నాం అంటూ ఫిలింమేకర్స్ చెప్పడం చూస్తున్నాం. ఇలా టాలీవుడ్ లోని కొందరు ప్రతిసారీ చేస్తున్న వ్యాఖ్యలపై దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి స్పందిం చారు. సినిమా అనేది అద్భుతమైన మీడియం అని, దాన్ని బాధల వేదికగా మార్చొద్దని ఆయన సోషల్ మీడియా పోస్ట్ చేశారు. ఏ రంగంలో అడుగుపెట్టాలన్నా కష్టాలు, ఒత్తిడులు, లాభనష్టాలు ముందే అంచనా వేసుకుని, అర్థం చేసుకుని వస్తారని, సినిమా ఇండస్ట్రీ కూడా అంతేనని మధుర శ్రీధర్ రెడ్డి తన పోస్ట్ లో పేర్కొన్నారు. మంచి చిత్రానికి ప్రేక్షకుల ఆదరణ తప్పకుండా ఉంటుందని ఆయన అన్నారు.



దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.